




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 10 శుక్రవారం | జనవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 115


# వరంగల్‌కు విమానాశ్రయం



- హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ సిటీ అభివృద్ధి
- వరంగల్ మహానగరంగా ఎదిగేందుకు కృషి
- మామూనూరు విమానాశ్రయ భూసేకరణపై సీఎం సమీక్ష
- పెట్టుబడులు ఆకర్షించేలా వరంగల్ విమానాశ్రయముండాలి
- వరంగల్ ఔటర్ రింగు రోడ్డు, రేడియల్ రోడ్లు విమానాశ్రయానికి అనుసంధానంగా ఉండాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశం

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

వరంగల్ మహానగరంగా ఎదగడానికి వీలుగా విమానాశ్రయానికి రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. వరంగల్ (మామునూరు) విమానాశ్రయ భూ సేకరణ, ఇతర ప్రణాళికలపై ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఆయా దేశాల పెట్టుబడులు ఆకర్షించేలా వరంగల్ విమానాశ్రయం ఉండాలని, దక్షిణ కొరియాతో పాటు పలు దేశాలు తమ పెట్టుబడులకు విమానాశ్రయాలను ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ వివరించారు. కొచ్చి విమానాశ్రయం అన్ని వసతులతో ఉంటుందని, దానిని పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వరంగల్ ఔటర్ రింగు రోడ్డు, రేడియల్ రోడ్లు విమానాశ్రయానికి అనుసంధానంగా ఉండాలని సీఎ రేవంత్ చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం, కరీంనగర్, నల్గొండ జిల్లాల ప్రజలు భవిష్యత్‌లో వరంగల్ విమానాశ్రయం నుంచే రాకపోకలకు వీలుగా రహదారులు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. టెక్స్‌టైల్స్‌తో పాటు ఐటీ, ఫార్మా, ఇతర పరిశ్రమల అభివృద్ధితో హైదరాబాద్‌ను ప్రతిబింబించేలా వరంగల్ ఎదిగేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. వరంగల్ విమానాశ్రయం పూర్తయితే మేడారం జాతరతో పాటు లక్నవరం, రామప్ప ఇతర పర్యాటక ప్రదేశాలకు వచ్చే ప్రజలు సైతం దానినే వినియోగించుకుంటారని సీఎం రేవంత్ తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జయవీర్, ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి మృతుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా

- మృతుల కుటుంబాలకు కాంట్రాక్టు ఉద్యోగాలు: సీఎం చంద్రబాబు
- తీవ్రంగా గాయపడిన ఇద్దరికి రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం
- గాయపడిన మరో 33 మందికి రూ.2లక్షల చొప్పున సాయం
- గాయపడిన వారికి కోలుకున్న తర్వాత శ్రీవారి దర్శనానికి అనుమతి
- వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ పంపిణీ కేంద్రాల వద్ద
- తొక్కిసలాట ఘటనపై తిరుపతిలో మీడియాతో చంద్రబాబు

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం తెలిసిందే. నేడు తిరుపతి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులపై నిప్పులు చెరిగారు. ఘటన స్థలిని స్వయంగా పరిశీలించిన ఆయన, ఆసుపత్రిలో క్షతగాత్రులను ఓదార్చారు. ఈ ఘటనలో ఇద్దరు ఉన్నతాధికారులను సస్పెండ్ చేసిన చంద్రబాబు... మరో ముగ్గురు అధికారులపై బదిలీ వేటు వేశారు.

ఈ సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించిన చంద్రబాబు... కీలక నిర్ణయాలు ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున టీటీడీ ద్వారా ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించారు. ఆరుగురు మృతుల కుటుంబాల్లో ఒకరికి చొప్పున కాంట్రాక్టు ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు.

తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఇద్దరికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థికసాయం చేస్తామని చెప్పారు. వారి ఆరోగ్యం మెరుగయ్యే వరకు వైద్య ఖర్చులు భరిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. గాయపడిన మరో 33 మందికి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సాయం

## తిరుపతి ఘటనలో ఇద్దరు సస్పెండ్

- డీఎస్పీ రమణకుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు
- నేడు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన సీఎం చంద్రబాబు
- ఆసుపత్రిలో క్షతగాత్రులకు పరామర్శ

2

**తిరుపతి-నవభూమిబ్యూరో**

తిరుపతి తొక్కిసలాట ఘటనపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, ఆసుపత్రిలో క్షతగాత్రులతో



# గ్రామ పంచాయతీ ఉద్యోగులకు నెలనెలా వేతనాలు



- గ్రామ పంచాయతీ ఉద్యోగులకు రేవంత్ సర్కారు గుడ్‌న్యూస్
- ప్రతి నెలా గ్రీన్ చానెల్ ద్వారా జీతాలు చెల్లించేలా చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 92,351 మంది ఉద్యోగులు
- వారికి ప్రతినెలా రూ.116కోట్ల చెల్లిస్తున్నామన్న సీఎం
- ఉపాధి హామీ పథకం బిల్లులను తొందరగా చెల్లించాలన్న సీఎం

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలోని గ్రామ పంచాయతీ ఉద్యోగులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఇకపై నెల నెలా చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంత్రులు, ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 92,351 మంది ఉద్యోగులు పని చేస్తుండగా.. వారికి ప్రతి నెలా రూ. 116 కోట్లు జీతాలు చెల్లించాల్సి ఉంది. వారందరికీ ప్రతి నెలా గ్రీన్ చానెల్ ద్వారా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం బిల్లులను తొందరగా చెల్లించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి రాష్ట్రంలో దాదాపు 1.26 లక్షల ఉపాధి పనులు జరిగాయని, వీటికి సంబంధించిన మొత్తం బిల్లులను చెల్లించాలని సీఎం రేవంత్ చెప్పారు.

కేంద్రం నుంచి పంచాయతీలకు విడుదలయ్యే నిధులు ఎప్పటికప్పుడు గ్రామాల అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాల న్నారు. ఉపాధి హామీ, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకాల ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రాబట్టుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు ధనసరి సీతక్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఫ్యాక్టరీ చిమ్నీ కూలి 8 మంది దుర్మరణం

- ముంగేలీ జిల్లాలోని నరగావ్ స్టీల్ ప్లాంట్
- పరిశ్రమలో చిమ్నీ నిర్మాణం
- శిథిలాల కింద మరికొంతమంది ఉన్నట్లు సమాచారం
- కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్..
- భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదం

2



# ఇది ప్రభుత్వ తప్పిదమే

- తిరుపతిలో ఘటన రాష్ట్ర చరిత్రలోనే ఎప్పడూ జరగలేదు
- దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- మృతులకుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కింద యాభై లక్షలు,
- గాయపడిన వారికి ఐదులక్షలు చెల్లించాలి
- మాజీ ముఖ్యమంత్రి,వైఎస్సార్‌సీపీ అధినేత జగన్

2



# ఏ క్షణంలోనైనా అరెస్ట్!

- ఏసీబీ విచారణకు హాజరైన మాజీ మంత్రి కేటీఆర్
- విచారణ తర్వాత అరెస్టు చేసే అవకాశాలు
- విచారణ సమయంలో హరీశ్‌రావు గృహ నిర్బంధం
- బీఆర్ఎస్‌కు వెళ్లే దారులన్నీ బారికేడ్లతో మూసివేత
- కేటీఆర్ అరెస్టు అయితే బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని జిల్లాల ఎస్పీలు,కమిషనర్లకు సమాచారం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ఏసీబీ ఎదుట కేటీఆర్ మాజీ మంత్రి కేటీఆర్ ఫార్ములా-ఈ కారు రేసు కేసులో విచారణకు హాజరై,ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. విచారణ తరువాత కేటీఆర్ అరెస్ట్ అవుతారా.. లేక, విచారించి పంపిస్తారా అనేది ఇప్పుడు రాజకీయంగా ఉత్కంఠ పెంచుతోంది. ఇప్పటికే ఈ కేసులో అర్వింద్‌కుమార్‌ను బుధవారం ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. పలు కీలక అంశాలకు సంబంధించిన ఆధారాలను సేకరించారు. ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో ఎఫ్ఈవో, ఏస్ నెక్ట్స్‌జెన్, పురపాలక శాఖ మధ్య జరిగిన తొలి త్రైపాక్షిక ఒప్పందం సమయంలో జరిగిన కమ్యూనికేషన్ వివరాలను ఏసీబీ అధికారులు ఇప్పటికే పూర్తి స్థాయిలో సేకరించారు. విచారణ వేళ ఈ కేసులో ఏస్ నెక్ట్స్‌జెన్ సంస్థకు చెందిన చలమలశెట్టి అనిల్‌కుమార్‌కు నాటి మంత్రి కేటీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యానికి సంబంధించిన కీలక ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. ఒకవేళ కేటీఆర్‌ను అరెస్టు చేయాల్సి వస్తే బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలు చేపట్టే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీలు, కమిషనర్లకు అలెర్ట్ వచ్చినట్లు సమాచారం. ఇటు ఏసీబీ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. బీఆర్ఎస్ కీలక నేతలు కొందరిని గృహ నిర్బంధం చేస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఏసీబీ ఆఫీసు వద్దకు వచ్చే అవకాశం ఉండడంతో అటువైపు వెళ్లే రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసి మూసివేస్తున్నారు. ఇక, విచారణ వేళ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేసారు. తాను ఎలాంటి అవినీతి చేయలేదని చెప్పారు. ఎన్ని కేసులు

# సుప్రీంలో మోహన్‌బాబుకు ఊరట

- తీర్పు వచ్చే వరకూ మోహన్‌బాబుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దు
- ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఆదేశం
- ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టేసింది
- దాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన మోహన్‌బాబు

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

సినీనటుడు మోహన్ బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తర్వాతి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం సినీనటుడు మోహన్ బాబు ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో మోహన్ బాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను డిసెంబర్ 23న తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. దాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆయనపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించింది. మోహన్ బాబు కుటుంబ తగాదాల నేపథ్యంలో ఆయన ఇంటికి వెళ్లిన ఓ మీడియా ప్రతినిధిపై మోహన్ బాబు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మోహన్ బాబుపై కేసు నమోదైంది.

**తిరుపతి ఘటన హృదయాన్ని కలిచివేసింది: మోహన్‌బాబు**

తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో పలువురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై మోహన్ బాబు స్పందించారు. ఈ ఘటన తన హృదయాన్ని కలిచివేసిందని ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

వైకుంఠ ఏకాదశి సందర్భంగా టికెట్ల కోసం తిరుపతి కౌంటర్ల వద్దకు వెళ్లిన భక్తులు మరణించడం తన హృదయాన్ని కలిచివేసిందన్నారు మోహన్ బాబు. ప్రపంచంలోనే తిరుమల తిరుపతి దేవస్థానం అతిపెద్ద ధార్మిక సంస్థ. వారు భక్తుల కోసం తీసుకునే జాగ్రత్తలు, సదుపాయాలు బ్రహ్మాండంగా ఉంటాయి. అయినప్పటికీ ఇలా జరగడం దురదృష్టకరం. గాయపడిన భక్తులు త్వరగా కోలుకోవాలని, మరణించినవారి కుటుంబాలకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని ప్రార్థిస్తున్నా అని మోహన్ బాబు పేర్కొన్నారు.

# వంద కేసులైనా ఎదుర్కొంటా

- ఏసీబీ విచారణపై కేటీఆర్ వ్యాఖ్యలు
- ఏసీబీ అధికారులు అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడిగారు
- 82 ప్రశ్నలు అడిగారు..అన్నింటికీ దీటుగా సమాధానమిచ్చా
- రాజకీయ కక్షతోనే తనపై తప్పుడు కేసు పెట్టించారని ఏసీబీ అధికారులకు కూడా అర్థమైందన్న కేటీఆర్
- భవిష్యత్తులో ఈవీరంగంలో పెట్టుబడులు వస్తాయనే సదుద్దేశంతో ఫార్ములా ఈ రేసు నిర్వహణ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తనపై వంద కేసులు పెట్టినా ఎదుర్కొంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఏసీబీ విచారణ అనంతరం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఏసీబీ అధికారులు అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడిగారని.. అలా 82 ప్రశ్నలు అడిగారని చెప్పారు. రాజకీయ కక్షతోనే తనపై తప్పుడు కేసు పెట్టించారని ఏసీబీ అధికారులకు కూడా అర్థమైందన్నారు. కేసులో ఎలాంటి విషయం లేదని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఫార్ములా ఈ రేస్ అనేదాన్ని తొలిసారి ఇండియాకు తీసుకొచ్చామని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లో కొనసాగించాలని భావించామన్నారు. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే తెలంగాణకు భవిష్యత్తులో ఈవీ రంగంలో పెట్టుబడులు వస్తాయనే సదుద్దేశంతో పనిచేశామని తెలిపారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో ఎలాంటి అవినీతి లేదని.. అవినీతి పనులు తాము చేయమని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఎన్నిసార్లు విచారణకు పిలిచినా తప్పకుండా వస్తానని

# గుంటూరుకు మహర్దశ

- గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామన్న కేంద్రమంత్రి పెమ్మసాని
- రోడ్లు,ఓవర్ బ్రిడ్జీల నిర్మాణం,మంచినీరు,మురుగునీటి సరఫరా వంటి మౌళిక సదుపాయాల కల్పన
- గుంటూరు శంకర్ విలాస్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ ఆమోదం
- కొత్తగా రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ.107 కోట్లు మంజూరు

2




**గుంటూరు-నవభూమిబ్యూరో**

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని గుంటూరు లోక్‌సభ సభ్యుడు, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులో రోడ్లు, ఓవర్ బ్రిడ్జీల నిర్మాణం, మంచినీరు, మురుగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు. గుంటూరు శంకర్ విలాస్ వద్ద ఓవర్ బ్రిడ్జిని నిర్మించడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిందని చంద్రశేఖర్ అన్నారు. రెండు మూడు నెలల్లో నిర్మాణ పనులు మొదలవుతాయని చెప్పారు. సిటీలో ఎక్కడెక్కడ ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయో.. అలాంటి ప్రాంతాలను గుర్తించామని, వాటిపై సమీక్షలను నిర్వహించామని తెలిపారు. తాజాగా గుంటూరులో కొత్తగా రైల్వే బ్రిడ్జిని నిర్మించడానికి రైల్వే శాఖ 107 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని పెమ్మసాని చెప్పారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, ఆ శాఖ సహాయమంత్రి సోమణ్ణ, రైల్వే బోర్డు అధికారులు ఈ మొత్తాన్నిమంజూరు చేశారని, అందుకు వారికి కృతజ్ఞతలు



## జీహెచ్ఎంసీ ఎదుట మెరుపు ధర్నా.. కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ మహనగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) కార్యాలయం ఎదుట బల్దియా కాంట్రాక్టర్లు మెరుపు ధర్నాకు దిగారు. గురువారం ఉదయం కాంట్రాక్టర్లంతా ధర్నాకు దిగారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే తమకు రావాల్సిన బకాయలు రూ. 1100 కోట్లు చెల్లించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ క్రమంలో ఓ కాంట్రాక్టర్.. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పూనుకున్నాడు. అక్కడే ఉన్న సహచర కాంట్రాక్టర్లు.. అతడి ప్రయత్నాన్ని అడ్డుకొన్నారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జీహెచ్ఎంసీ బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల బాధతో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు.అధికారం అందుకొనే క్రమంలో వెనుకా.. ముందు ఆలోచించకుండా రాజకీయ పార్టీలు.. ఉచిత హామీలకు తెర తీస్తోన్నాయి. దీంతో అధికారంలోకి వచ్చిన ఆయా పార్టీలు.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉచిత హామీలు.. తప్పక అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇంకా సోదాహరణగా వివరించాలంటే.. తెలంగాణలో కొలువు తీరిన రేవంత్ ప్రభుత్వం మహలక్ష్మీ పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. దీంతో ఆర్టీసీ భారీ నష్టాలను చవి చూస్తోంది.మరోవైపు అంతకు కొన్ని నెలల ముందు కర్ణాటకలో కొత్తగా కొలువు తీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం శక్తి పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం అమలు వల్ల ప్రభుత్వానికి కోట్లాది రూపాయిల నష్టం వస్తుంది. ఈ నేపథ్యంలో కర్ణాటకలో ఆర్టీసీ ఛార్జీలు 15 శాతం మేరు పెంచుతోన్నట్లు తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది.



## తెలంగాణలో కింగ్ ఫిషర్ బీరు ధర రూ.270కు పెరుగుతుందా..? ప్రభుత్వం కీలక ప్రకటన




**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో పండగైనా.. పబ్బమైనా.. మంచైనా.. చెడైనా.. చాలా ఇళ్లలో ముక్కతో పాటు సుక్క ఉండాల్సిందే. మద్యం లేకుండా దావత్‌లు, పండగలు జరగవంటే అతిశయోక్తి కాదు. తెలంగాణలో తాగుడు బానిసత్వం కాదు.. అలవాటు పడిన ఓ సాంప్రదాయం అనే మాట కూడా ఉటుంది. మరో నాలుగు రోజుల్లో సంక్రాంతి పండగ ఉన్న మందుబాబులు ఇప్పట్నుంచే ప్లాన్లు వేసుకుంటున్నారు. ఇటువంటి తరణంలో మందుబాబులకు బీర్ల తయారీ సంస్థలు షాకింగ్ న్యూస్ చెప్పాయి. తెలంగాణలో అతిపెద్ద బీర్ల తయారీ సంస్థ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్( సంస్థ.. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(కు బీర్లు సరకు సరఫరా చేయలేమని స్పష్టం చేసింది. ఈ సంస్థ కింగ్ ఫిషర్ బీర్లు తయారు చేస్తుండగా.. ఇక నుంచి సరఫరా చేయమని తేల్చి చెప్పింది.

గత రెండేళ్ల నుంచి రూ.702 కోట్ల బకాయిల్ని కార్పొరేషన్ విడుదల చేయకపోవడం, బీరు ధరలు పెంచాలని విన్నవించినా పట్టించుకోకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ శాఖకు ఆ సంస్థ ప్రతినిధులు లేఖ రాశారు. రాష్ట్రంలో ఆరు బీర్ల తయారీ సంస్థలున్నా.. మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా కింగ్ ఫిషర్ బీర్లకే ఉంటుంది. దాదాపు 75 శాతం వాటా యూబీఎల్ కంపెనీదే. ప్రస్తుతం టీజీబీసీఎల్ దగ్గర 14 లక్షల బీరు కేసుల స్టాక్ ఉండగా.. తెలంగాణలో నెలకు సగటున 40 లక్షల కేసుల వినియోగం జరుగుతోంది. పండగ వేళ షాకింగ్ న్యూస్ చెప్పటంతో మందుబాబులు లోబోదిబోమంటున్నారు.ఈ విషయంపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. యూబీఎల్ సంస్థ తమకు ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని బీరు ధరలు పెంచాలని డిమాండ్ చేస్తోందన్నారు. బీరు ధర 33.10 శాతం పెంచాలని కోరుతోందని.. ఇలా చేస్తే కింగ్‌ఫిషర్ ప్రీమియం బీరు రూ.150 నుంచి రూ.210కి, స్ట్రాంగ్ బీరు ధర రూ.160 నుంచి రూ.220కి, కింగ్ ఫిషర్ అల్ట్రా బీరు ధర రూ.210 నుంచి రూ.270కి పెరుగుతాయని చెప్పారు. అయినా ఆ సంస్థ ఒత్తిడికి ఏమాత్రం లొంగేది లేదని అన్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటకలో బీరు ధర రూ.190, ఏపీలో రూ.180, మహారాష్ట్రలో రూ.200 ఉండగా తెలంగాణలో మాత్రం రూ.150కే లభిస్తుందన్నారు. మద్యం ధరల పెంపు అంశం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలోని కమిటీ పరిధిలో ఉందని వివరించారు. కమిటీ నివేదిక వచ్చిన తర్వాత ధరలు సవరించినా.. ఆ సంస్థ అడిగిన ప్రకారం భారీగా పెంచబోమని అన్నారు. ఇతర రాష్ట్రాల కంటే తక్కువగా బీర్ల ధరలు ఉండేలా చూస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. ఇప్పటివరకు ఆ సంస్థకు రూ.1130.99 కోట్లు చెల్లించినట్లు తెలిపారు.

## తెలంగాణ విద్యాశాఖ కార్యదర్శిగా.. మోదీ చేత అవార్డు అందుకున్న మహిళా ఐఏఎస్



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ మరోసారి ఐఏఎస్‌లో బదిలీ చేపట్టింది. ఇటీవలే అధికారుల బదీలు చేపట్టిన ప్రభుత్వం.. ఇప్పుడు మరోసారి పలువురు ఐఏఎస్‌లకు స్థానచలనం కలిగించింది. ఈ క్రమంలోనే.. ఐఏఎస్ సురేంద్ర మోహన్‌ను గనుల శాఖ నుంచి రవాణా శాఖ కమిషనర్‌గా బదిలీ చేయగా.. గనుల శాఖ అదనపు బాధ్యతలను ఎన్.శ్రీధర్‌కు అప్పగించారు. ఇక.. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వెయిటింగ్‌లో ఉంచిన యోగితా రాణాకు కీలక విద్యాశాఖ బాధ్యతలు అప్పగించారు.యోగితా రాణా..తెలంగాణ సర్కార్ మరోసారి ఐఏఎస్‌ల బదిలీ చేపట్టింది. ఇటీవలే ఐఏఎస్‌లను బదిలీ చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త సంవత్సరంలో మరోసారి ఐఏఎస్ అధికారులకు స్థానచలనం కల్పించింది. ఇందులో భాగంగా.. మైన్స్ అండ్ జియాలజీ కార్యదర్శిగా ఉన్న ఐఏఎస్ సురేంద్ర మోహన్‌ను రవాణా శాఖ కమిషనర్‌గా బదిలీ చేసింది. మరోవైపు మైన్స్ అండ్ జియాలజీ కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌ను నియమించింది. ఇదిలా ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వెయిటింగ్‌లో ఉన్న ఐఏఎస్ యోగితా రాణాకు పోస్టింగ్ ఇచ్చింది ప్రభుత్వం. యోగితా రాణాను విద్యాశాఖ కార్యదర్శిగా నియమిస్తూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం (జనవరి 09న) ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని సీఎస్ శాంతి కుమారి పేర్కొన్నారు.

2003 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన యోగితా రాణా.. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా భాధ్యతలు నిర్వహించారు. అయితే.. విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న బుర్రా వెంకటేశంను రేవంత్ రెడ్డి సర్కార్ టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించటంతో.. ఎన్.శ్రీధర్‌కు విద్యాశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా.. శ్రీధర్‌కు ఇప్పుడు మైన్స్ అండ్ జియాలజీ డిపార్ట్ మెంట్ అదనపు బాధ్యతలు అప్పగించి.. విద్యాశాఖ పూర్తి బాధ్యతలను యోగితా రాణాకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం.యోగితా రాణా.. 2003 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. 2002లో సివిల్ సర్వీసెస్‌లో మూడో ప్రయత్నంలో ఐఆర్‌టీఎస్‌కు ఎంపికయ్యారు. 2003లో సివిల్స్‌లో నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. యోగితా రాణాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడంతో విశాఖపట్నం జిల్లాలో సంవత్సరం పాటు శిక్షణ తీసుకున్నారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్‌గా అటు తర్వాత.. రంపచోడవరం ఐటీడీఏ పీఓగా పనిచేశారు. ఆ తర్వాత యూఎన్‌డీపీలో మూడున్నరేళ్లు సేవలు అందించారు.ఇక.. తెలంగాణ ఏర్పడిన తర్వాత.. 2017లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ సమయంలో.. "ఈ-నామ్" అమలులో మెరుగైన పనితీరు కనబరిచి.. జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు యోగితా రాణా. అయితే.. మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న మహిళా ఐఏఎస్‌కు.. ఇన్ని రోజులు పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్‌లో పెట్టిన రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పుడు.. ప్రతిష్ఠాత్మకమైన విద్యాశాఖ కార్యదర్శిగా కీలక బాధ్యతలు అప్పగించటం గమనార్హం.

# తెలంగాణ కల్చర్‌ను అవమానించాడు..
## దిల్ రాజు వ్యాఖ్యలపై దేశపతి శ్రీనివాస్ ఫైర్



**హైదరాబాద్-నవభూమి:**సినీ నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ మాజీ మంత్రి రసమయి బాలకిషన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఫంక్షన్‌లో తెలంగాణ కల్చర్ గురించి చేసిన మాటలు అవమానకరంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసిన నేతలు.. దిల్ రాజు సినిమాలను తిరస్కరించాలని సూచించారు. తెలంగాణలో కల్లు, మాంసం దుకాణాలు పెట్టుకోవాలంటూ దిల్ రాజుకు సూచించారు.సినిమా నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "సంక్రాంతికి వస్తున్నాం.." సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో దిల్ రాజు చేసిన వ్యాఖ్యలపై స్పందించిన దేశపతి.. ఫైర్ అయ్యారు. నిజానికి దిల్ రాజు అనే వ్యక్తి తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడు కూడా కలిసి రాలేదని.. ఏ ఒక్క రోజు కూడా తెలంగాణకు అండగా నిలబడలేదన్నారు. "సంక్రాంతికి వస్తున్నాం" అనే సినిమా కార్యక్రమంలో.. తెలంగాణ సంస్కృతిని దిల్ రాజు అవమానించాడని మండిపడ్డారు. ఆయనకు ఆంధ్రాలోనే సినిమాలకు వైబ్ ఉంటుందట.. తెలంగాణలో వైబ్ ఉండదట అంటూ దుయ్యబట్టారు. దిల్ రాజు.. తెలంగాణలో సినిమాలు మానుకోవాలని.. కల్లు, మాంసం దుకాణాలు పెట్టుకోవాలని హితవు పలికారు. అలా అయితే వైబ్ ఉంటుందంటూ దేశపతి శ్రీనివాస్ చురకలంటించారు.మరోవైపు.. సీఎం రేవంత్ రెడ్డి రెండు నాలుకల ధోరణి మరోసారి నిరూపితమైందని దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. గేమ్ ఛేంజర్ సినిమాకు అదనపు షోలు ఎందుకు..? టికెట్ రేట్ల పెంపు ఎందుకు..? అని దేశపతి ప్రశ్నించారు. టికెట్ల ధరల పెంపు ఉండదని అసెంబ్లీ సాక్షిగా సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిజ్ఞ చేశారని.. మరి ఇప్పుడు ఆయన ఎక్కడ దాక్కున్నారంటూ ప్రశ్నించారు. ఈ జీవోపై వివరణ ఇవ్వాలన్నారు. దిల్ రాజుకు ప్రత్యేకమైన ప్రివిలేజ్ ఎందుకని నిలదీశారు. ఇక నుంచి బెనిఫిట్ షోలు, అదనపు షోలు ఉండవని సీఎం రేవంత్ రెడ్డి.. నెల రోజుల క్రితం అసెంబ్లీలో ప్రకటించారని గుర్తు చేసిన దేశపతి.. మరి గేమ్ ఛేంజర్‌కు ఎందుకు ప్రివిలేజ్ ఇస్తున్నారని ప్రశ్నించారు.తెలంగాణ ప్రజల సంస్కృతిని అవమానించేలా మాట్లాడిన దిల్ రాజు సినిమాను తిరస్కరించాలని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి రసమయి బాలకిషన్ మీడియాతో మాట్లాడారు.నేను నిజాయితీగా, మాట మీద నిలబడుతానని పొంకనాలు పలికిన రేవంత్ రెడ్డి.. రాత్రికి రాత్రి గేమ్ ఛేంజర్ సినిమాకు బెనిఫిట్ షోలు, అదనపు షోలకు జీవో జారీ చేశారు. దీనిపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. వీళ్లేమన్న దేశభక్తులా..? దేశ రక్షణకు పాటు పడుతున్నారా..? అదనపు, బెనిఫిట్ షోలు ఎందుకు అని రేవంత్ రెడ్డి మొన్నటికి మొన్న మాట్లాడారు. ఇవాళ దిల్ రాజుకు రేవంత్ రెడ్డి ఎంతకు అమ్ముడు పోయారు..? కేవలం నాలుగు షోలు ఉంటాయి. కానీ తెల్లవారుజామున నాలుగు గంటలకే లేచి పోయి గేమ్ ఛేంజర్ చూడాల్నట. మరి గేమ్ ఛేంజర్‌కు నిన్ను ఏం గేమ్ ఛేంజర్ చేశాడో చెప్పాలి అని సీఎం రేవంత్ రెడ్డిని రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. ఇదే సమయలో.. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సైతం.. దిల్ రాజు మీద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో దిల్ రాజు లేడని.. ఆయన ఎప్పుడూ ఆంధ్రా వైపే ఉన్నారని రసమయి ఆరోపించారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఆడియో ఫంక్షన్‌లో మాట్లాడిన మాటలను తెలంగాణ ప్రజలు మరిచిపోలేదన్నారు. "మటన్ ముక్కను, కల్లును మాత్రమే ఆరాధిస్తారు.. సినిమాలను ఆరాధించరు" అని దిల్ రాజు మాట్లాడారని గుర్తుచేశారు. ఇంత అవమాకరమైన మాటలు మాట్లాడిన దిల్ రాజు సినిమాను తెలంగాణ ప్రజలు తిరస్కరించాలన్నారు. తెలంగాణ సంస్కృతిని దిల్ రాజు అవమానించారని మండిపడ్డారు. తెలంగాణలో బతుకైనా, చావైనా, పండుగైనా.. కల్లు ఉంటది.. మటన్, చికెన్ ఉంటుందని రసమయి వివరించారు. బలగం సినిమాలో కూడా ఆత్మ శాంతించాలని కల్లు పెట్టి, మటన్ పెట్టి చూపించినట్టు తెలిపారు. నల్లి బొక్క మీద, కల్లు మీద, ప్రజల సంస్కృతి మీద ఆప్యాయతల మీద ఆయన తీసిన బలగం సినిమాను అందరూ ఆదరించారని.. ఆ ఆదరణను, కృతజ్ఞతను మరిచిపోయాడని మండిపడ్డారు. అదనపు షోలకు అనుతిచ్చేది లేదని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోజు అసెంబ్లీలో మాట్లాడారని.. మరి ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయంపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు.

## తెలంగాణ మహిళలకు గుడ్‌న్యూస్.. త్వరలోనే అకౌంట్లలోకి డబ్బులు..?



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ ప్రభుత్వం మహిళలకు తీపి కబురు చెప్పింది. త్వరలోనే మహిళా సంఘాల్లోని మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు రెడీ అయింది. అభయహస్తం పథకంలోని రూ.385 కోట్ల నిధులను మహిళలకు తిరిగివ్వాలని రేవంత్ సర్కార్ నిర్ణయించినట్లు సమాచారం. ఉమ్మడి ఏపీలో 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పథకంలో భాగంగా మహిళలు రోజుకు రూపాయి చొప్పున ఆరేళ్లపాటు చెల్లించారు. డ్వాక్రా సంఘాల్లోని మహిళలు తమ డబ్బులు పొదుపు చేసుకున్నారు. అయితే ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత.. ఈ నిధులను గత ప్రభుత్వం ఇతర అవసరాలకు వినియోగించినట్లు రేవంత్ ప్రభుత్వం గుర్తించింది. 2022 నాటికి ఆ డబ్బులు వడ్డీతో కలిపి రూ.545 కోట్లకు చేరుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పుడు వీటిని తిరిగి మహిళలకు ఇవ్వాలని రేవంత్ సర్కార్ యోచిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక నిర్ణయం తీసుకొని అకౌంట్లలో డబ్బులు జమ చేయనున్నట్లు సమాచారం.

మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు..

ఇక తెలంగాణలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు సబ్సిడీపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయించేందుకు సర్కార్ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక అప్డేట్ ఇచ్చారు. వెయ్యి మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్లకు త్వరలోనే టెండర్లు ఖరారు చేయనున్నట్లు చెప్పారు. టెండర్లు పూర్తయ్యేనాటికి సంఘాలను గుర్తించి నిర్ధారించడం, భూసేకరణ, బ్యాంకుల నుంచి అవసరమైన ఆర్థికసాయం వంటి పనులను రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్, జిల్లా కలెక్టర్లు త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు.ఎస్‌హెచ్‌జీల ద్వారా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దేవాదాయ, నీటిపారుదలశాఖల పరిధిలోని భూములను గుర్తించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. తెలంగాణలోని 6.67 లక్షల ఎకరాలను ఇంతవరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేసిందని చెప్పారు. అయితే ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడం లేదని వెల్లడించారు. అటవీ హక్కుల ద్వారా లభించిన భూముల్లో అవకాడో వంటి పంటలు సాగుచేస్తే వారికి మేలు జరుగుతుందన్నారు. అటవీ సంపద పెరగడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా బలోపేతమవుతారని చెప్పారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఫ్యాక్టరీ చిమ్నీ కూలి 8 మంది దుర్మరణం

**ముంగేలీ(ఛత్తీస్‌గఢ్)-నవభూమిబ్యూరో**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ముంగేలీ జిల్లాలోని ఓ స్టీల్ ప్లాంట్ పరిశ్రమలో నిర్మాణంలో ఉన్న చిమ్నీ కుప్పకూలింది. ఈ ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొంత మంది శిథిలాల కింద ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ బృందాలు ఘటన స్థలానికి చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టాయి. పదుల సంఖ్యలో గాయపడిన కార్మికులను హుటాహుటిన ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌కు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న సరాగావ్‌లోని కుసుమ్ ప్లాంట్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. అధికారులు తెలిపిన ప్రకారం.. కనీసం 8-9 మంది కార్మికులు చనిపోయారని, మరికొందరు గాయపడినట్లు భావిస్తున్నారు. రెస్క్యూ ఆపరేషన్ ప్రస్తుతం కొనసాగుతోంది. చిక్కుకున్న కార్మికులను వెలికితీసేందుకు అత్యవసర సేవలు, రెస్క్యూ బృందాలు అవిశ్రాంతంగా పనిచేస్తున్నాయి. సరాగావ్ ప్రాంతంలో ఉన్న ప్లాంట్‌లో మధ్యాహ్నం ఈ ఘటన జరిగిందని ముంగేలీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ భోజ్‌రామ్ పటేల్ తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. సైలో - బల్క్ మెటీరియల్‌లను నిల్వ చేయడానికి ఉపయోగించే ఇనుప నిర్మాణం - క్రాష్ అయ్యింది. సైట్‌లో ఉన్న కొంతమంది కార్మికులు దాని కింద చిక్కుకున్నారని ఆయన చెప్పారు. అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించినట్లు అధికారి తెలిపారు. ముంగేలి కలెక్టర్ రాహుల్ డియో మాట్లాడుతూ.. ముంగేలిలోని సర్గావ్‌లోని ఇనుము తయారీ కర్మాగారంలో కర్మాగారం చిమ్నీలు కూలిపోవడంతో కార్మికులు అక్కడ చిక్కుకుపోయారు. ఘటనా స్థలంలో పోలీసులు, అధికారులు ఉన్నారని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్లాంట్ నిర్మాణ సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి.

## గుంటూరుకు మహర్దశ

**(1వపేజీ తరువాయి)**తెలుపుతున్నానని పేర్కొన్నారు. గుంటూరు-నంబూరును కలుపుతూ నిర్మితం కాబోతోన్న నాలుగు లైన్ల ఓవర్ బ్రిడ్జి అని ఆయన వివరించారు. ఇది.. గుంటూరు-నంబూరు- మంగళగిరి-పొన్నూరు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుం దని పెమ్మసాని చెప్పారు. అమరావతి ప్రాంతం పూర్తిస్థాయిలో రాజ ధానిగా కాబోతోందని, ట్రాఫిక్ పెరిగినప్పటికీ- వచ్చే 30 నుంచి 40 సంవత్సరాల వరకు ఇబ్బందులు లేకుండా ఈ ప్రాజెక్ట్ వస్తుందని పేర్కొన్నారు.

## ఇది ప్రభుత్వ తప్పిదమే

**తిరుపతి-నవభూమిబ్యూరో**

తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుపతిలో టోకెన్ల జారీ కౌంటర్ల వద్ద చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘటనలో ఆరుమంది దుర్మరణం పాలయ్యారు. వారిలో అయిదుమంది మహిళలు ఉన్నారు. 41 మంది గాయపడ్డారు.వాళ్లందరినీ శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్), శ్రీవేంకటేశ్వర రామ్‌నారాయణ్ రూయా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ స్విమ్స్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. చికిత్స అందిస్తోన్న తీరుపై ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ.. తిరుపతిలో ఘటన రాష్ట్ర చరిత్రలోనే ఎప్పుడూ జరగలేదని ఆయన అన్నారు. ఇది ప్రభుత్వం చేసిన తప్పు అని, ప్రభుత్వ తప్పిదం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని విమర్శించారు. ఈ ఘటనకు ప్రభుత్వం పూర్తిగా బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. బైరాగిపట్టెడలో ఐదుగురు చనిపోయారని ఉంది.. తొక్కిసలాట ఘటనలో ఆరుగురు చనిపోయారని జగన్ తెలిపారు. స్విమ్స్ ఆసుపత్రిలో మొత్తం 35 మంది చికిత్స పొందుతున్నారని స్పష్టం చేశారు. వారు కోలుకున్నాక ఇంటికి పంపించేటప్పుడు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఇచ్చి పంపించాలని జగన్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## వంద కేసులైనా ఎదుర్కుంటా

**(1వపేజీ తరువాయి)**తెలిపారు. తనకు ఎలాంటి ఇబ్బంది లేదని ఏసీబీ అధికారులకు చెప్పినట్లు వెల్లడించారు. ఇలాంటివి మరో వంద కేసులు పెట్టినా ఎదుర్కొంటామన్నారు. తమపై ఎవరెన్ని కుట్రలు చేసినా.. ఎన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేసినా ఈ ఏడాదంతా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉంటామని కేటీఆర్ చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ నేతృత్వంలో ఎంతో నిబద్ధతతో, ఎక్కడా అవినీతి లేకుండా పనిచేశామని చెప్పారు. కాగా, ఫార్ములా వన్ ఈ కారు రేసింగ్ కేసులో భాగంగా గురువారం కేటీఆర్‌ను ఏసీబీ విచారించింది. సుమారు ఏడు గంటలపాటు కేటీఆర్‌ను ఏసీబీ విచారించింది. మరోసారి విచారణకు హాజరుకావాలని కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఆయన మరోసారి ఏసీబీ ముందు హాజరయ్యే అవకాశం ఉంది.

## ఏ క్షణంలోనైనా అరెస్ట్!

**(1వపేజీ తరువాయి)**పెట్టుకున్న ఎదుర్కోవటానికి సిద్ధమని వెల్లడించారు. తాను ఇచ్చిన హామీల నుంచి డైవర్షన్ కోసమే ఈ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రతిష్ఠ పెంచటం కోసమే తాము పని చేసామని.. సొంత మనుషులకు మేలు చేసేందుకు తాము పని చేయలేదన్నారు. ఇక, కేటీఆర్ విచారణ ముగిసే వరకూ ఉత్కంఠ కొనసాగే అవకాశం కనిపిస్తోంది. సుప్రీంకోర్టులోనూ కేటీఆర్ పిటీషన్ విచారణకు రాలేదు. దీంతో.. ఈ రోజు జరిగే పరిణామాల పైన భిన్న అంచనాలు.. ఆసక్తి కొనసాగుతోంది.

## తిరుపతి ఘటనలో ఇద్దరు సస్పెండ్

**(1వపేజీ తరువాయి)**మాట్లాడిన అనంతరం సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించారు. తొక్కిసలాట ఘటనకు బాధ్యులుగా ఇద్దరు ఉన్నతాధికారులను సస్పెండ్ చేశారు. డీఎస్పీ రమణకుమార్, గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డిలను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు.
ఈ ఘటనకు సంబంధించి మరో ముగ్గురు అధికారులపై బదిలీ వేటు వేశారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈఓ, టీటీడీ సీఎస్ఓ శ్రీధర్ గౌతమిలను బదిలీ చేశారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం చంద్రబాబు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ మేరకు తమ నిర్ణయాలు వెల్లడించారు.

## హొటల్లో అమ్మాయితో దొరికిపోయిన చాహల్..!



**ముంబై-నవభూమి:** టీమిండియా స్టార్ బౌలర్ యుజ్వేంద్ర చాహల్ వైవాహిక జీవితం గురించి గత కొద్దిరోజులుగా అనేక వార్తలు వైరల్ అవుతూనే ఉన్నాయి. చాహల్ అతని భార్య ధనశ్రీ వర్మ విడాకులు తీసుకుంటున్నారంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. యుజ్వేంద్ర చాహల్ , ధనశ్రీ వర్మలది ప్రేమ వివాహం. 2020లో వీరి వివాహం జరిగింది. యుజ్వేంద్ర చాహల్ భార్య ధనశ్రీ వర్మ పాపులారిటీ గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఆమెకు సోషల్ మీడియాలో ఫుల్ క్రేజ్ ఉంది. ధనశ్రీ వర్మ డ్యాన్సర్‌గా, కొరియోగ్రాఫర్‌గా , సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌గా కూడా ఆమె ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నారు. ఆమె తన ప్రత్యేకమైన డ్యాన్స్ వీడియోల ద్వారా ప్రేక్షకులను అలరిస్తుంటారు.ధనశ్రీ చిన్నప్పటి నుండి భరతనాట్యం నేర్చుకున్నారు. ఆమె తన స్వంత డ్యాన్స్ కంపెనీని కూడా స్థాపించారు. ఇటీవలే ఆమె ఓ తెలుగు సినిమాలో కూడా హీరోయిన్‌గా నటించడానికి రెడీ అయ్యారు.అయితే గత కొంతకాలంగా యుజ్వేంద్ర చాహల్,ధనశ్రీ వర్మల వ్యక్తిగత జీవితంపై అనేక రూమర్స్ వైరల్ అవుతున్నాయి. వీరిద్దరి మధ్య అభిప్రాయభేదాలు రావడంతో వీరు వీడిగా ఉంటున్నారనే ప్రచారం ఊపందుకుంది.ఇదే సమయంలో చాహల్ తన భార్య ధనశ్రీతో ఉన్న ఫొటోలన్నింటినీ తొలగించాడు. ధనశ్రీ కూడా చాహల్‌ను అన్‌ఫాలో చేసింది. అంతకు ముందు ధనశ్రీ వర్మ తన ఇన్‌స్టాగ్రామ్‌లో తన పేరు నుంచి భర్త పేరుని తొలగించింది. దీంతో అప్పుడే వీరి విడాకుల పుకార్లు ఊపందుకున్నాయి. మరి ఇప్పుడు ఇద్దరూ ఒకరినొకరు అన్‌ఫాలో చేయడంతో ఇప్పుడు నిజంగానే విడాకులు తీసుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పెళ్లి రోజున సైతం వీరిద్దరు విషెష్ చెప్పుకోలేదు. సరిగ్గా ఇదే సమయంలో చాహల్ మరో అమ్మాయితో కనిపించి షాకిచ్చాడు. ముంబైలోని హొటల్‌లో ఓ అమ్మాయితో చాహల్ కనిపించాడు. ఆమెతో కలిసి హొటల్ బయటకు వచ్చే సమయంలో మీడియాను చూసి చాహల్ తన ముఖానికి చేతులు అడ్డుపెట్టుకున్నాడు. వైట్ టీ-షర్ట్, బ్యాగీ జీన్స్‌తో ధరించిన చాహల్.. కెమెరాల కంటపడకుండా ఉండేందుకు ఆపసోపాలు పడ్డాలు. హొటల్ పిల్లర్స్ వెనుకాల దాక్కోవడం, చేతులను కవర్ చేసుకోవడం వంటి పనులు చేశాడు. ఈ చర్యలతో ఈ ఇద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే అనుమానాలు కలుగుతున్నాయి. %=వషిీఎఎవఅవవ ఖీశీతీ ¯శీబ% "బుమ్రా చుక్కలు చూపించాడు-ఒప్పుకున్న ఆసీస్ ఓపెనర్ ..!" అయితే సదరు యువతి పేరు తనిష్క కపూర్ అని, కన్నడలో రెండు సినిమాల్లో నటించినట్లు ప్రచారం జరుగుతోంది. ధనశ్రీతో పరిచయం కాకముందే వీరిద్దరూ డేటింగ్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. అప్పట్లో ఈ వార్తలను చాహల్ ఖండించాడు. పెళ్లి అయిన తర్వాత కూడా తనిష్క కపూర్‌తో చాహల్ సీక్రెట్ అఫైర్ నడిపించాడని, దాంతో ధనశ్రీతో గొడవలు మొదలయ్యాయనే వాదను కూడా తెరపైకి వచ్చింది. చాహల్ వ్యవహారం నచ్చకనే ధనశ్రీ వర్మ విడాకులు ఇచ్చేందుకు సిద్ధమైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## రెస్టారెంట్లలో మిగిలిపోయిన ఆహారం పేదలకు... స్విగ్గీ ప్రత్యేక కార్యక్రమం


### ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ సామాజిక బాధ్యత

### 33 నగరాల్లో స్విగ్గీ సర్వ్స్ సేవలు

**ముంబై-నవభూమి:**ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ సామాజిక బాధ్యతతో చేపడతున్న కార్యక్రమం పేరు... స్విగ్గీ సర్వ్స్. రెస్టారెంట్లలో నిత్యం ఎంతో ఆహారం మిగిలిపోతుంటుంది. అలా మిగిలిపోయిన ఆహారం వృథా కాకుండా... పేదలకు అందించాలన్న సదుద్దేశంతో స్విగ్గీ నేడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం కోసం స్విగ్గీ... రాబిన్ హుడ్ ఆర్మీ అనే సామాజిక సేవా సంస్థతో చేతులు కలిపింది. దీనిపై స్విగ్గీ సీఈవో రోహిత్ కపూర్ స్పందించారు. స్విగ్గీ సర్వ్స్ కార్యక్రమాన్ని దేశంలోని 33 నగరాల్లో చేపడుతున్నామని చెప్పారు. దీన్ని మరిన్ని నగరాలకు విస్తరిస్తామని తెలిపారు. తమ కార్యాచరణ వల్ల ఆహారం వృథా అవడం అనే సమస్యే ఉండదని, అటు పేదలకు కూడా ప్రయోజనం కలుగుతుందని అన్నారు.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
శుక్రవారం
10 । జనవరి । 2025



# ఆయన ఇంట్లో సోదాలు జరిపి డబ్బును సీజ్ చేయాలి.. కేజ్రీవాల్ డిమాండ్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ నేతల తీరుపై ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ నేతలు తొక్కని అడ్డదారి లేదని ఆయన విమర్శించారు. డిసెంబర్ 15 నుంచి జనవరి 7 వరకు ఈ 22 రోజుల వ్యవధిలో న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో తమ ఓటును రద్దు చేయాలని కోరుతూ 5,500 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఎందుకు ఓటు రద్దు కోరుతున్నారని సంబంధిత అధికారులు ఆయా దరఖాస్తుదారులను ఫోన్‌లు చేసి అడగ్గా.. అసలు తాము ఓటు రద్దు కోసం దరఖాస్తే చేయలేదని చెప్పారని కేజ్రీవాల్ తెలిపారు. ఇదంతా బీజేపీ కుట్ర అని, తమ పార్టీకి పడవని నిర్ధారించుకున్న ఓట్ల రద్దు కోసం ఆ పార్టీ శ్రేణులే ఇలాంటి దరఖాస్తులు చేశాయని ఆరోపించారు. చాపకింద నీరులా ఢిల్లీలో బీజేపీ పెద్ద కుట్ర నడుపుతోందని అన్నారు. ఢిల్లీలో గత 15 రోజుల నుంచి కొత్త ఓట్ల కోసం 13 వేల దరఖాస్తులు వచ్చాయని కేజ్రీవాల్ తెలిపారు. ఆ దరఖాస్తులు కూడా ఢిల్లీ ఓటర్లు పెట్టుకున్నవి కావని, ఇతర రాష్ట్రాల్లో తమకు అనుకూలంగా ఉన్న వారిని బీజేపీ ఢిల్లీలో ఓటర్లుగా చేర్పిస్తున్నదని విమర్శించారు. ఇక బీజేపీ న్యూఢిల్లీ అభ్యర్థి పర్వేశ్ వర్మ జాబ్ క్యాంపులు నిర్వహిస్తూ బహిరంగంగా డబ్బులు పంచుతున్నారని ఆరోపించారు.

## నోరు విప్పి మాట్లాడడు.. 40 ఏళ్లుగా తిండే లేదు.. ఫ్రీగా సివిల్స్ కోచింగ్ ఇస్తున్న బాబా..!



**న్యూఢిల్లీ-నవభూమి:** చాయ్ వాలీ బాబా..! ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్‌కు చెందిన దినేశ్ స్వరూప్ బహ్మచారి చాయ్ అమ్ముకుని జీవనం సాగించేవాడు. ఆ తర్వాత ఆయన సాధువుగా మారడంతో 'చాయ్ వాలీ బాబా ఇ అనే పేరు వచ్చింది. యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో ఈ నెల 13 నుంచి మహాకుంభ మేళా ప్రారంభ కానుండటంతో అందరు సాధువుల మాదిరిగానే ఆయన కూడా ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నాడు. అయితే ఆయన ప్రత్యేకతలు తెలుసుకుని జనం నోరెళ్లబెడుతున్నారు. ఎందుకంటే ఆయన 40 ఏళ్లుగా ఎలాంటి ఆహారం ముట్టడం లేదు. కేవలం రోజుకు 10 కప్పుల చాయ్ మాత్రమే తాగుతాడు. అంతేకాదు ఆయన నోరు విప్పి ఒక్క మాట కూడా మాట్లాడడు. కేవలం సైగలతోనే సంభాషణలు కొనసాగిస్తాడు. ఇంతేనా..! ఇందులో నోరెళ్లబెట్టడానికి ఏముంది అనుకుంటున్నారా..? ఆగండాగండి.. 40 ఏళ్లుగా తిండి తినకుండా, నోరు విప్పి మాట కూడా మాట్లాడకుండా ఆయన చేస్తున్న మరో ఆశ్చర్యకరమైన పని ఏమిటంటే.. సివిల్స్ అభ్యర్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వడం.'కేవలం టీ అమ్ముకునే వ్యక్తి సాధువుగా మారడం ఒకే.. సాధువుగా మారి ఏండ్లుగా మౌనం పాటించడం ఒకే.. 40 ఏండ్లుగా తిండి లేకుండా కేవలం చాయ్‌లతో గడపడం చాలా కష్టమే.. అయినా అదీ ఒకే.. జ్ఞానం సముపార్జించి సివిల్స్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వడం ఒకే.. కానీ నోరు విప్పకుండా విద్యార్థులకు బోధన ఎలా చేస్తున్నాడు..?' అని మీరు కూడా నోరెళ్ల బెట్టారు కదా..! అయితే అక్కడికే వెళ్దాం..ఇచాయ్ వాలీ బాబా విద్యార్థులకు బోధించడం కోసం వాట్సాప్‌నే కీలక వనరుగా మార్చుకున్నారు. సివిల్స్ అభ్యర్థులు వాట్సాప్ ద్వారా తమ సందేహాలను పంపితే.. బాబా వాటిని నివృత్తి చేస్తుంటాడు. ఆయన దగ్గర శిక్షణ పొంది ఎంతో మంది అభ్యర్థులు ఉద్యోగాలు సంపాదించారట. బాబాను ఆయన శిష్యులు గౌరవంగా మహారాజ్‌జీ అని పిలుచుకుంటారట. మహారాజ్ జీ గురించి ఆయన శిష్యుడు రాజేష్ సింగ్ మాట్లాడుతూ.. 'నేను నాలుగైదేళ్లుగా మహారాజ్ జీతో ప్రయాణం సాగిస్తున్నాను. సివిల్స్‌కు సంబంధించి మాకు అవసరమైనప్పుడల్లా ఆయన మార్గదర్శనం చేస్తుంటారు' అని చెప్పాడు.
అయితే, 40 ఏళ్ల నుంచి తిండి లేకుండా ఎలా ఉండగలుగుతున్నారన్న ప్రశ్నకు చాయ్ వాలీ బాబా స్పందిస్తూ.. కఠినమైన నియమాలు పాటించడంతో అది సాధ్యమేనని చెప్పారు. మౌనంగా ఉండటానికి కారణమేమిటని అడగ్గా.. మౌనం మనిషిలో శక్తిని పోగు చేస్తుందని అన్నారు. కాగా ప్రయాగ్‌రాజ్‌లో ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు మహాకుంభమేళా జరగనుంది. ఈ కుంభమేళాకు ప్రపంచ దేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు.

## ప్రయాణికుడి బ్యాగ్‌లో మొసలి తల.. ఎయిర్‌పోర్ట్‌లో స్వాధీనం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ఒక ప్రయాణికుడిపై సెక్యూరిటీ సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు. అతడి లగేజ్‌ను తనిఖీ చేశారు. బ్యాగ్‌లో మొసలి తల ఉండటం చూసి షాక్ అయ్యారు. దానిని స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయం విమానాశ్రయంలో ఈ సంఘటన జరిగింది. జనవరి 6న కెనడా పౌరుడైన వ్యక్తి టొరంటో వెళ్లేందుకు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాడు. ఎయిర్ కెనడా విమానం ఎక్కే ముందు సెక్యూరిటీ సిబ్బంది అతడ్ని చెక్ ఇన్ చేశారు. ఆ వ్యక్తిపై అనుమానం రావడంతో టెర్మినల్ 3 వద్ద లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దీంతో ఒక బ్యాగ్‌లో మొసలి తల ఉండటాన్ని సెక్యూరిటీ సిబ్బంది గమనించారు. అతడ్ని అదుపులోకి తీసుకుని కస్టమ్స్ అధికారులకు అప్పగించారు.కాగా, కస్టమ్స్ అధికారులు ఆ మొసలి తలను స్వాధీనం చేసుకున్నారు. దానిని గుడ్డతో చుట్టి లగేజ్‌లో అతడు ఉంచినట్లు తెలిపారు. 777 గ్రాముల బరువున్న మొసలి తలను ఢిల్లీకి చెందిన అటవీశాఖ అధికారులు పరిశీలించారు. మొసలి పిల్లకు చెందినదిగా వారు నిర్ధారించారు. దర్యాప్తు కోసం డెహ్రాడూన్‌లోని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్‌కు దానిని పంపారు. ఆ కెనడా పౌరుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం రేవంత్ విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు గ్రీన్ సిగ్నల్



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతినిచ్చింది. జనవరి 13వ తేది నుంచి 23 వరకు ఆస్ట్రేలియా, సింగపూర్, స్విట్జర్లాండ్, బ్రిస్బేన్, దావోస్ దేశాల పర్యటనకు వెళ్లాల్సి ఉందని సీఎం ఏసీబీ కోర్టును కోరారు. ఈ అంశాన్ని పరిశీలించిన ఏసీబీ కోర్టు.. రేవంత్‌రెడ్డి విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. గతంలో ఓటుకు నోటు కేసు బెయిల్ సందర్భంగా పాస్‌పోర్టును సీఎం రేవంత్?రెడ్డి కోర్టుకు అప్పగించారు. ప్రస్తుతం విదేశాలకు వెళ్లాల్సి ఉందని తన పాస్‌పోర్టును 6 నెలలు ఇవ్వాలనే సీఎం అభ్యర్థనకు ఏసీబీ కోర్టు అంగీకారం తెలిపింది. మళ్లీ 2025 జులై 6వ తేది లోపు పాస్‌పోర్టు తిరిగి అప్పగించాలని రేవంత్‌రెడ్డిని ఏసీబీ కోర్టు ఆదేశించింది. సీఎం విదేశీ పర్యటనలో స్వల్ప మార్పు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో స్వల్ప మార్పులు చోటు చేసుకుంది. సీఎం ఆస్ట్రేలియా పర్యటన పూర్తిగా రద్దయ్యింది. జనవరి 14న సీఎం ఢిల్లీ వెళ్లనున్నారు. 15, 16 తేదీల్లో ఢిల్లీలో పర్యటించనున్నారు. 15వ తేదిన దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న ఏఐసీసీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత 17వ తేదీన సీఎం ఢిల్లీ నుంచి నేరుగా సింగపూర్ వెళ్లనున్నారు సీఎం రేవంత్ రెడ్డి. జనవరి 17, 18వ తేదీల్లో రెండు రోజుల పాటు సీఎం రేవంత్‌రెడ్డి సింగపూర్?లో పర్యటిస్తారు. అక్కడ్నుంచి నుంచి 19వ తేదీన దావోస్?లో జరగనున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొంటారు. జనవరి 24వ తేది వరకు సీఎం రేవంత్ దావోస్ పర్యటనలో ఉంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## ప్రయాణికుడితో కలిసి రైల్లోనే మద్యం సేవించిన రైల్వే సిబ్బంది.. ఆపై పొట్టుపొట్టు కొడుతూ..!



**న్యూఢిల్లీ-నవభూమి:** రైల్లో ప్రయాణిస్తున్న ప్రజలు మద్యం సేవిస్తూ రచ్చ చేయడం చూశాం. ఫుల్లుగా తాగొచ్చి రైలు ఎక్కి.. అక్కడున్న టీసీలకు చుక్కలు చూపించిన వాళ్ల గురించి కూడా చాలానే విన్నాం. కానీ ఇది మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే రైల్వే ఉద్యోగులతో కలిసే ఓ ప్రయాణికుడు ఫుల్లుగా మద్యం సేవించాడు. రైల్లోనే కలిసి తాగిన వీళ్లు ఆపై కొట్టుకున్నారు. ఆపేందుకు వచ్చి టీటీఈని.. ప్రయాణికుడు చెప్పుతో కొట్టడంతో గొడవ మరింత పెద్దది అయింది. ఈ క్రమంలోనే రైల్వే అధికారులు సదరు ప్రయాణికుడిని ఇష్టం వచ్చినట్లుగా కొట్టారు. నెట్టింట వైరల్ అవుతున్న ఈ వీడియోలో ఏముందో మనం ఇప్పుడు తెలుసుకుందాం.
ఉత్తర ప్రదేశ్‌లోని సివాన్‌కు చెందిన 38 ఏళ్ల షేక్ మజీబుల్ ఉద్దీన్ అనే ట్రక్ డ్రైవర్ పని మీద న్యూఢిల్లీకి వెళ్లాడు. తిరిగి వచ్చేటప్పుడు అమృత్‌సర్ – కతిహార్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. ఈక్రమంలోనే తన వెంట మద్యం కూడా తెచ్చుకున్నాడు. అయితే మజీబుల్ రైల్లో ప్రయాణిస్తుండగా.. రైల్వే సిబ్బంది పరిచయం అయ్యారు. ముఖ్యంగా రైల్లోని బెడ్లపై బట్టలు మార్చే ఇద్దరు ఉద్యోగులు అయిన విక్రమ్ చౌహాన్, సోను మెహతాలతో స్నేహం చేశాడు. వారి మధ్య సఖ్యత కుదరగా.. ఓ రెండు పెగ్గులు వేసుకుందాం రమ్మంటూ పిలిచాడు.
దాంతో రైల్వే సిబ్బంది తన వద్దకు వచ్చి కూర్చోగా ముగ్గురు కలిసి ఫుల్లుగా మద్యం సేవించారు. ఈక్రమంలోనే పలు అంశాల గురించి చర్చించుకుంటున్న వీరి మధ్య గొడవ జరిగింది. దీంతో ప్రయాణికుడు మజీబుల్ వారిద్దరిపై గట్టి గట్టిగా అరవగా.. అక్కడే ఉన్న టీటీఈ రాజేష్ కుమార్ వచ్చాడు. అక్కడున్న ముగ్గురికీ గొడవ ఆపమంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. కానీ విపరీతమైన మద్యం మత్తులో ఉన్న మజీబుల్.. టీటీఈ చెంపపై చెప్పుతో కొట్టాడు. దాంతో ఆయన కూడా అతడితో గొడవకు దిగాడు.ఇలా టీటీఈ రాజేశ్, విక్రమ్ చౌహాన్, సోను మెహతాలు ముగ్గరూ కలిసి మజీబుల్‌ను కొట్టడం ప్రారంభించారు. కింద పడేసి మరీ అతడిపై దాడి చేశారు. ఆ తర్వాత అతడిని అక్కడే పడేసి వెళ్లిపోయారు. అప్పటి వరకు చాటుగా వీడియో తీసిన తోటి ప్రయాణికులు రైల్వే అధికారులకు సమాచారం అందించారు. ఫిరోజాబాద్‌లోని ప్రభుత్వ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని అపస్మారక స్థితిలోకి చేరుకున్న మజీబుల్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. ఆపై నెట్టింట వైరల్ అయిన వీడియోను పరిశీలించారు.

## అమ్మాయిలు బట్టలు మార్చుకునే గదిలో ప్యూన్ ఫోన్.. సీక్రెట్‌గా వీడియో రికార్డింగ్.. చివరకు ఏమైందంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఏ వయసులో ఉన్నా సరే ఆడపిల్లలు అయితే చాలు.. చాలా జాగ్రత్తగా ఉండాల్సిందేనంటున్న పోలీసులు. ఇందుకు ప్రధాన కారణం ప్రతీ చోట స్పై కెమెరాలు పెట్టడమే. హోటళ్లు, పబ్లిక్ టాయిలెట్స్, షాపింగ్ మాల్స్ బాత్రూముల్లో సీక్రెట్ కెమెరాలు పెట్టడం గురించి చాలానే విన్నాం కానీ.. తాజాగా బడిలో స్పై కెమెరా వార్త వెలుగులోకి వచ్చింది. బడికి చెందిన ప్యూనే.. సీక్రెట్‌గా తన మొబైల్ ఫోన్‌ను ఆడపిల్లలు బట్టలు మార్చుకునే గదిలో పెట్టాడు. కెమెరా ఆన్ చేసి మరీ విజ్యువల్స్ రికార్డు అయ్యేలా చేశాడు. చివరకు పోలీసులకు చిక్కాడు. ఎలాగో మనం ఇప్పుడు తెలుసుకుందాం. పబ్లిక్ టాయిలెట్స్, బట్టలు మార్చుకునే గదుల్లో స్పై కెమెరాలు పెడుతూ.. మహిళలు తమ పనులు చేసుకుంటుండగా చాటుమాటుగా చూసే వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. మొన్నటికి మొన్న మహిళా టీచర్ల బాత్రూంలో స్పై కెమెరా వార్త వెలుగులోకి రాగా.. తాజాగా బడిలో విద్యార్థినులు బట్టలు మార్చుకునే గదిలో సీక్రెట్ కెమెరా దొరికింది. కెమెరా అంటే కెమెరానే కాదండోయ్.. మొబైల్ ఫోన్‌లో కెమెరా ఆన్ చేసి పెట్టడం. అయితే ఈ దారుణానికి పాల్పడింది ఆ పాఠశాలకు చెందిన ప్యూనే కావడం గమనార్హం. ఈ ఘటన ఎక్కడ జరిగింది, నిందితుడు ఎలా దొరికిపోయాడో మనం ఇప్పుడు తెలుసుకుందాం.పుణేలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన 12 నుంచి 13 ఏళ్ల విద్యార్థినిలు జనవరి 6వ తేదీనే స్పోర్ట్ పీరియడ్ తర్వాత బట్టలు మార్చుకోవడానికి బడిలోని గదికి వెళ్లారు. కిచెన్‌తో పాటు బట్టలు మార్చుకునే గది ఒక్కటే కావడంతో.. అక్కడకు వెళ్లిన ఆరుగురు విద్యార్థినిలు ముందుగా లోపల ఎవరైనా ఉన్నారా అని చెక్ చేశారు. అయితే మనుషులు ఎవరూ కనిపించలేదు కానీ ఓ అమ్మాయికి అక్కడ మొబైల్ ఫోన్ ఉండడం కనిపించింది. దీంతో వెంటనే దాన్ని తీసుకుని చూడగా.. అది రికార్డు అవుతున్నట్లు గుర్తించి షాక్ అయింది. వెంటనే ఆ ఫోన్‌ను తన తోటి విద్యార్థులకు చూపించింది. ఆ తర్వాత వారంతా తమ వీడియోలు అందులో ఉన్నట్లు చూసి విస్తుపోయారు.అలాగే ఆ ఫోన్ తమ బడిలోని ప్యూన్‌ది అని గుర్తించారు. వాల్ పేపర్‌పై అతడి ఫొటో ఉండడం.. కెమెరాలో కూడా అతడికి సంబంధించిన ఫొటోలు కనిపించడంతో ప్యూన్ ఫోనేనని నిర్ధారించుకున్నారు విద్యార్థినులు. ఆపై ఈ విషయాన్ని నేరుగా వెళ్లి తమ ఉపాధ్యాయులకు చెప్పారు. అలాగే ఇంటికెళ్లాక కుటుంబ సభ్యులకు వివరించారు. దీంతో అమ్మాయిన తల్లిదండ్రులు మరుసటి రోజు బడికి వచ్చి నిర్వాహకులకు దీని గురించి వివరించారు. దీంతో పాఠశాల యాజమాన్యం ఆ ప్యూన్‌ను విధుల్లోంచి తొలగించింది. అయితే పిల్లల తల్లిదండ్రులు మాత్రం అంతటితో ఊరుకోలేదు. అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ.. పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ప్యూన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే అతడి ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్యూన్ తొలిసారే ఇలా వీడియో తీస్తూ దొరికిపోయాడా లేక గతంలోనూ ఇలాంటి చర్యలకే పాల్పడ్డాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటనపై స్పందించిన పాఠశాల నిర్వాహకులు.. 2015 సంవత్సరం నుంచి ఆ ప్యూన్ అదే బడిలో పని చేస్తున్నట్లు తెలిపారు. ఇన్నాళ్లూ బాగానే ఉన్నాడని.. ఇలాంటి ఘటనలు ఏవీ జరగలేవని చెప్పుకొచ్చారు. ఇలాంటి వార్త బయటకు రావడం ఇదే తొలిసారి అని విషయం తెలిసిన వెంటనే అతడిని విధుల్లోంచి తొలగించినట్లు వివరించారు.

## భర్త నుంచి డబ్బు, నగలు చోరీ.. పారిపోయి ప్రియుడ్ని పెళ్లాడిన భార్య



**లక్నో-నవభూమి:** ఒక భార్య తన భర్తకు చెందిన డబ్బు, బంగారు నగలను చోరీ చేసింది. ఇంటి నుంచి ఆమె పారిపోయింది. ఫేస్‌బుక్‌లో పరిచయమైన ప్రియుడ్ని కలిసి అతడ్ని పెళ్లాడింది. ఈ విషయం తెలుసుకున్న భర్త అక్కడకు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌కు చెందిన అబిరాల్‌కు 2017లో పంజాబ్‌లోని మొహాలికి చెందిన వినోద్ కుమార్‌తో వివాహమైంది. అయితే ఉత్తరప్రదేశ్‌లోని రాయ్ బరేలీకి చెందిన ఫైజాన్ అహ్మద్ ఫేస్‌బుక్‌లో ఆమెకు పరిచయమయ్యాడు. దీంతో వారిద్దరి మధ్య ప్రేమ సంబంధం ఏర్పడింది.కాగా, గత ఏడాది డిసెంబర్‌లో భర్త ఇంటి నుంచి అబిరాల్ పారిపోయింది. వినోద్ కుమార్‌కు చెందిన రూ.2 లక్షల డబ్బు, బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్‌తో సహా రూ.5 లక్షల విలువైన వాటిని అపహరించి తన వెంట తీసుకెళ్లింది. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్ బరేలీకి ఆమె చేరుకున్నది. ఫేస్‌బుక్ లవర్ ఫైజాన్ అహ్మద్‌ను కలిసింది. రెండు రోజుల తర్వాత వారిద్దరూ పెళ్లి చేసుకున్నారు.ఇమరోవైపు అబిరాల్ భర్త వినోద్ కుమార్‌కు ఈ విషయం తెలిసింది. దీంతో అతడు రాయ్ బరేలీకి చేరుకున్నాడు. జనవరి 7న అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డబ్బు, బంగారంతో తన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయేందుకు అహ్మద్ పురిగొల్పినట్లు ఆరోపించాడు. అయితే ప్రియుడితోనే తాను ఉంటానని పోలీసులకు అభిరాల్ చెప్పింది. దీంతో ఆమె భర్త ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## అలా అయితే.. 'ఇండియా' కూటమి పొత్తును ముగించండి: ఒమర్ అబ్దుల్లా



**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం పార్లమెంట్ ఎన్నికల వరకే అయితే 'ఇండియా' కూటమి పొత్తును ముగించాలని సూచించారు. ఆ కూటమికి నాయకత్వం, ఎజెండా వంటివి ఏమీ లేకపోవడాన్ని ఆయన విమర్శించారు. 'ఇండియా' కూటమిలో భాగమైన ఆప్, కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేయడంపై గురువారం మీడియా అడిగిన ప్రశ్నకు ఒమర్ అబ్దుల్లా సమాధానమిచ్చారు. 'దీని గురించి నేను ఏమీ చెప్పలేను. ఎందుకంటే ఢిల్లీ ఎన్నికలతో మాకు సంబంధం లేదు. ఆప్, కాంగ్రెస్, క్షేత్రస్థాయిలో ఉన్న ఇతర పార్టీలు బీజేపీని ఎలా ఎదుర్కోవాలో నిర్ణయించుకోవాలి' అని అన్నారు.ఇకాగా, తనకు తెలిసినంత వరకు 'ఇండియా' బ్లాక్‌కు ఎలాంటి కాలపరిమితి లేదని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. అయితే దురదృష్టవశాత్తు కూటమి సమావేశాన్ని నిర్వహించడం లేదని చెప్పారు. దీంతో కూటమి నాయకత్వం, ఎజెండా, ఉనికి గురించి తనకు స్పష్టత లేదని అన్నారు. 'అది (ఇండియా బ్లాక్) కేవలం పార్లమెంట్ ఎన్నికల కోసమే అయితే వారు కూటమిని ముగించాలి' అని సూచించారు.

## పక్కింటి వారిపై కోపాన్ని మూగజీవాలపై చూపాడు.. మొత్తం 28 పావురాల మెడలు మెలితిప్పాడు!




**న్యూఢిల్లీ-నవభూమి:** మనకు ఎవరి మీదనైనా కోపం వస్తే.. దాన్ని తీర్చుకోవడానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తుంటాం. కొందరు కొట్టి, తిడుతూ వారిలోని కోపాన్ని చల్లార్చుకుంటారు. మరీ పగ ఎక్కువేతే అయితే దాడులు, హత్యల వరకు వెళ్తుంటారు. అలాగే చేశాడో వ్యక్తి. పక్కింటి వారిపై ఉన్న కోపాన్ని తీర్చుకోవడానికి మూగజీవాల ప్రాణాలు తీశాడు. ఆ ఇంటి వాళు పెంచుకుంటున్న పావురాల వద్దకు వెళ్లి క్రూరంగా వాటి మెడలు తిప్పి మరీ హత్యలు చేశాడు. ఈ కథేంటో మనం ఇప్పుడు పూర్తిగా తెలుసుకుందాం.సామాన్యంగా ఎవరి మీదైనా మనకు కోపం వస్తే అరవడమో, కొట్టడమో చేస్తుంటాం. ఎక్కువగా గొడవ పడి దాన్ని ఆ తర్వాత మర్చిపోతుంటాం. ముఖ్యంగా పక్కింటి వాళ్లతో కూడా ఇలాంటి గొడవలే జరిగితే చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుంటాం. ఎందుకంటే ఎప్పుడూ కలిసుండాలి కాబట్టి. కానీ ఓ వ్యక్తి మాత్రం ఇలా భావించలేదు. తనకు పక్కింటి వారిపై కోపం రాగా.. వారికి సంబంధించిన మూగ జీవాల ప్రాణాలను తీశాడు. మొత్తంగా 28 పావురాల మెడలను మెలి తిప్పేస్తూ.. క్రూరంగా హత్యలకు పాల్పడ్డాడు. ఆ పూర్తి వివరాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.
మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లా సింధియా నగర్‌కు చెందిన కాజల్ రాయ్‌కు.. పావురాలు అంటే చాలా ఇష్టం. శాంతికి, స్వేచ్ఛకు ప్రతీకలుగా నిలిచే 50 పావురాలను ఆమె తన మేడపై పెంచుకుంటోంది. వాటికి ప్రత్యేకంగా ఓ బోను ఏర్పాటు చేసి మరీ వాటిని అందులో ఉంచుతూ.. ప్రాణంగా చూసుకుంటోంది. రోజూ ఆహారం పెడుతూ.. తెగ మురిసిపోతుంటుంది. అయితే ఇటీవలే ఆమె కుటుంబానికి.. పక్కింటి వారితో గొడవ జరిగింది. అప్పటి నుంచి ఇరు కుటుంబాలు మాట్లాడుకోవడం లేదు.
అయితే పక్కింటికి చెందిన మోహిత్ ఖాన్‌కు.. కాజల్ రాయ్ కుటుంబంపై విపరీతమై కోపం ఏర్పడింది. గొడవ జరిగిపోయాక కూడా ఆమెపై కోపం తగ్గించుకోలేకపోయిన ఆయన.. వాళ్లను ఎలాగైనా సరే బాధ పెట్టాలని భావించాడు. అందుకోసం ఏం చేయాలా అని తెగ ఆలోచించగా... మేడ మీద ఉన్న పావురాలు గుర్తుకు వచ్చాయి. అయితే కాజల్ రాయ్ ఎంతో ప్రేమగా చూసుకునే ఆ పావురాలను చంపేస్తే తన కోపం తీరిపోతుందని భావించిన మోహిత్ వాటిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. కానీ అక్కడ చాలా పావురాలు ఉన్నాయి కాబట్టి తన ఒక్కడి వల్ల కాదని భావించాడు. ఈక్రమంలోనే తన స్నేహితుడిని వెంట తెచ్చుకుని మరీ.. కాజల్ రాయ్ మేడ మీదకు చేరాడు. బోనులోంచి పావురాలను బయటకు తీస్తూ.. వాటి మెడలను మెలి తిప్పుతూ చంపేశాడు. మొత్తంగా 28 పావురాలను చంపగా.. మిగతా పావురాలు అరవడం ప్రారంభించాయి. ఆ చప్పుడు విన్న కాజల్ రాయ్ వెంటనే పెరిగెత్తుకుంటూ బంగ్లాపైకి చేరింది. అది గుర్తించిన నిందితులు పారిపోవడం ప్రారంభించారు. దాన్ని కాజల్ రాయ్ చూసింది. పావురాలు ఎందుకు అరుస్తున్నాయో తెలుసుకునేందుకు దగ్గరకు వెళ్లగా 28 చనిపోయి కనిపించాయి.
అయితే వాటి మెడలు తిప్పడం వల్లే అవి చనిపోయినట్లు గుర్తించిన ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ కుటుంబంపై కోపంతో మోహిత్ ఖాన్, అతడి స్నేహితులే ఈ దారుణానికి పాల్పడినట్లు వివరించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ముఖ్యంగా పావురాలు ఎలా చనిపోయాయో తెలుసుకునేందుకు అటవీ శాఖ అధికారులను రప్పించగా.. పరీక్షించిన వారు పావురాల మెడలు తిప్పడం వల్లే అవి చనిపోయినట్లు నిర్ధారించారు.ఆ తర్వాత చనిపోయిన పావురాలను కాజల్ రాయ్‌కు అప్పగించగా.. వాటిని ఖననం చేసింది. అయితే తన ప్రాణానికి ప్రాణమైన పావురాల ప్రాణాలు తీసిన మోహిత్ ఖాన్, ఆయన స్నేహితుడిని కఠినంగా శిక్షించాలంటూ పోలీసులను కోరింది. జంతు హింస కింద కేసులు నమోదు చేసిన పోలీసులు నిందితులను త్వరలోనే పట్టుకుని.. వారికి కఠిన శిక్ష అమలయ్యేలా చేస్తామని చెప్పారు.

## ఈ నెలలోనే ఉమ్మడి పౌర స్మృతి అమలు చేస్తాం : ఉత్తరాఖండ్ సీఎం

**బరేలీ-నవభూమి:** ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈ నెల నుంచే ఉమ్మడి పౌర స్మృతి అమలు కానున్నది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర సీఎం పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. యూపీలోని బరేలీలో జరినగి ఓ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. 29వ ఉత్తరయాని మేళాను సీఎం ధామి ప్రారంభించారు. 2024, ఫిబ్రవరి ఏడవ తేదీన ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌర స్మృతి బిల్లును పాస్ చేసింది. ఆ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం వెంటనే దక్కింది. ఆ తర్వాత మార్చి 12, 2024లో నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి పౌర స్మృతి 2024 చట్టాన్ని రూపొందించారు. జనవరి 2025 నుంచి ఆ చట్టాన్ని పూర్తిగా అమలు చేయనున్నట్లు చెప్పారు. యూసీసీ అమలు కోసం ప్రత్యేక పోర్టల్, మొబైల్ యాప్ డెవలప్ చేశారు. మహిళలు, పిల్లల సాధికారతే లక్ష్యంగా యూసీసీ అమలు ఉంటుందని సీఎం ధామి గతంలో తెలిపారు.

## భారీ భద్రత కల్గిన భోపాల్ సెంట్రల్ జైల్లో చైనా డ్రోన్.. వాళ్లదే కావొచ్చంటున్న అధికారులు!



**న్యూఢిల్లీ-నవభూమి:** అత్యంత భారీ భద్రత కల్గిన భోపాల్ సెంట్రల్ జైల్లో బుధవారం మధ్యాహ్నం చైనాకు చెందిన ఓ డ్రోన్ లభ్యం అయింది. అండా సెల్‌గా పిలిచే ఈ జైల్లో భారీ భద్రతి ఉన్నప్పటికీ.. ఓ సెల్ వెలుపల పెట్రోలింగ్ గార్డు డ్రోన్ గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అయితే ఇది ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు దీన్ని పంపించారనే దాన్ని మాత్రం ఇంకా గుర్తించలేదు. కానీ ఓ అధికారి మాత్రం ఇది వాళ్లకు చెందిందే కావొచ్చంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఆ పూర్తి కథేంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.
మధ్య ప్రదేశ్‌లోని భోపాల్ సెంట్రల్ జైల్లో బుధవారం రోజు అర్ధరాత్రి కలకలం రేగింది. అత్యంత భారీ భద్రత కల్గిన ఈ జైల్లో చైనాకు చెందిన ఓ డ్రోన్ లభ్యం అయింది. అది చూసిన పెట్రోలింగ్ గార్డు భయభ్రాంతులకు గురయ్యాడు. వెంటనే పైఅధికారులకు ఆ డ్రోన్‌ను అప్పగించాడు. ప్రస్తుతం ఈ డ్రోన్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరి దీన్ని జైల్లోకి పంపించారనే దానిపై విచారణ సాగిస్తున్నారు. అయితే జైలుకు సంబంధించిన ఓ పోలీసు అధికారి మాత్రం ఈ డ్రోన్ వాళ్లే ఇక్కడ వేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆయన అనుమానానికి కారణం ఏంటి, ఎవరు పడేశారని ఆయన భావిస్తున్నారో మనం ఇప్పుడు తెలుసుకుందాం.అండా సెల్‌గా పిలిచే భోపాల్ సెంట్రల్ జైల్లో.. భయంకరమైన , క్రూరమైన దోషులను ఉంచుతారు. ముఖ్యంగా పెద్ద పెద్ద గూండాలు, ఉగ్రవాదులను ఆ జైల్లో పెడుతుంటారు. అయితే ఎప్పటిలాగే బుధవారం రోజు ఓ పెట్రోల్ గార్డ్ జైల్లో తిరుగుతున్నాడు. ఈక్రమంలోనే హైరిస్క్ సెల్ వెలుపల మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4 గంటల మధ్య ఓ డ్రోన్ కనిపించింది. దాన్ని చూసిన అతడు ముందుగా భయపడ్డా వెంటనే పైఅధికారులకు సమాచారం అందించారు. ఆపై ఆ డ్రోన్‌ను స్వాధీనం చేసుకుని.. దాన్ని ఎవరు, ఎందుకు జైల్లోకి పంపారనే దానిపై విచారణ సాగిస్తున్నారు.ఈక్రమంలోనే ఆ డ్రోన్ చైనాలో తయారైందిగా గుర్తుంచారు. అలాగే అందులో రెండు లెన్సులు ఉన్నట్లు కనుగొన్నారు. మొత్తం 30 నుంచి 40 గ్రాముల బరువు ఉన్న ఓ బ్లాక్ డ్రోన్ ఎవరిది, ఎందుకు జైల్లోకి పంపారనే దాన్ని మాత్ర కనుక్కోవడానికి సాంకేతిక నిపుణులు తీవ్రంగా కష్ట పడుతున్నారు. మరోవైపు భోపాల్ సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ రాకేష్ కుమార్ బాంగ్రే మాట్లాడుతూ.. జైలు ప్రాంగణంలో ఈ డ్రోన్ ల్యాండింగ్‌ను ఎవరూ చూడలేదని చెప్పారు. అలాగే దీన్ని ఎవరో ప్రత్యేకించి ఇక్కడకు పంపారని తాను భావించడం లేదని.. జైలు బయట ఆడుకునే చిన్న పిల్లలదే ఈ డ్రోన్ కావచ్చని తెలిపారు.
జైలు సమీపంలో ప్రతినిత్యం అనేక మంది పిల్లలు ఆడుకుంటూ కనిపిస్తారని.. వారికి ఇది ఎక్కడో దొరకగా ఇక్కడే ఆడుకొని పడేసి ఉంటారని తాను ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం భోపాల్ సెంట్రల్ జైల్లో వివిధ ఉగ్రవాద సంస్థలకు చెందిన 70 మంది ఉగ్రవాదులు శిక్షను అనుభవిస్తున్నారు.

## ఢిల్లీ ఎన్నికల్లో ఒక్కస్థానం నుంచే పోటీ చేస్తున్నా.. బీజేపీ ఆరోపణలను ఖండించిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. మరో నెల రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో.. అధికార, విపక్ష పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారంటూ బీజేపీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. న్యూ ఢిల్లీతోపాటు మరో స్థానం నుంచి కేజ్రీ పోటీ చేయబోతున్నారంటూ బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై కేజ్రీవాల్ తాజాగా స్పందించారు. బీజేపీ నేతల ఆరోపణలను ఖండించారు. తాను కేవలం ఒక్క స్థానం నుంచే పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు.కాగా, న్యూ ఢిల్లీ స్థానం నుంచి కేజ్రీ వరుసగా నాలుగోసారి పోటీకి సిద్ధమయ్యారు. ఈ స్థానం నుంచి కేజ్రీవాల్‌పై బీజేపీ తరఫున మాజీ ఎంపీ పర్వేశ్ వర్మ కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్నారు. మరోవైపు 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు 67, 62 స్థానాలతో ఆప్ క్లీన్ స్వీప్ చేసింది. హ్యాట్రిక్ విక్టరీతో మూడోసారి అధికారంలోకి రావాలని ఆ పార్టీ భావిస్తున్నది. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

## జడిపిస్తున్న మరోవైరస్


ఇ-నాన్నా పులి కథ అందరికీ తెలుసు! కానీ ఇప్పుడు అందరం నాన్నా.. వైరస్ కథ చూస్తున్నాం! ప్రపంచంలో ఏదో మూల ఏదో ఒక వైరస్ వ్యాప్తి ఎక్కువ అవగానే మరో ప్రళయం రాబోతుందనే స్థాయిలో సోషల్ మీడియా ప్రచారం చేస్తున్నది. ముందుగా వైరస్ పుట్టుపూర్వోత్తరాల గురించి తెలుసుకుందాం.

వైరస్‌లు కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఆవిర్భవించాయి. ఇవన్నీ వ్యాధి కారకాలే. అవి మొక్కల్లో, జంతువుల్లో, మానవుల్లో వ్యాధులను కలిగిస్తుంటాయి. కొన్ని వైరస్‌లు బాక్టీరియాలపైనా దాడి చేస్తాయి. అతిథేయి లేకుండా వైరస్ ప్రత్యుత్పత్తి కొనసాగించలేదు. వైరస్‌ను నిర్జీవజీవిగా వర్ణిస్తారు. దానికి జీవుల లక్షణాలు, నిర్జీవుల లక్షణాలు రెండూ ఉంటాయి. అతిథేయి దేహంలో జీవిగా, బయట నిర్జీవిగా మనుగడ సాగిస్తుంది.మానవులలో వైరస్ వ్యాధులు నియోలిథిక్ కాలం నుంచీ ఉన్నాయి. 12 వేల ఏండ్ల క్రితమే వైరస్‌లు మానవుల్లో వ్యాధిని కలిగించాయి. మనిషి పరిణామ క్రమంలో సంఘజీవిగా మారినప్పటి నుంచీ వైరస్ వ్యాధులు వ్యాప్తి చెందడం మొదలయింది. స్మాల్‌పాక్స్. మీజిల్స్ అతిప్రాచీనమైన వైరస్ వ్యాధులు. మనుషుల్లో వ్యాధి కారక వైరస్‌లు.. మొదట జంతువుల్లో లేదా పక్షులలో వ్యాధిని కలిగించే వైరస్‌లు (జునోటిక్/ ఏవియన్ వైరస్). 15వ శతాబ్దంలో ఇన్‌ఫ్లుయెంజా, ఫ్లూ వ్యాధులు లక్షలాదిమంది మరణాలకు కారణమయ్యాయి. ఇవే వ్యాధులు 17వ శతాబ్దంలోనూ విస్తృతంగా వ్యాప్తి చెందా యి. 18వ శతాబ్దంలో స్మాల్‌పాక్స్ వైరస్ ప్రపంచవ్యాప్తంగా విలయానికి కారణమైంది. 19వ శతాబ్దంలో వాక్సిన్స్ కనుగొన్న తరువాత స్మాల్‌పాక్స్‌ను అరికట్టగలిగాం. పోలియో, మీజిల్స్, ముంప్స్, రుబెల్లా వంటి వాటి వ్యాప్తిని నివారించగలిగాం. కానీ, కొత్త వైరస్‌లు పుట్టుకొస్తూ మానవాళికి కొత్త సవాళ్లను విసురుతూనే ఉన్నాయి.మానవ అభివృద్ధి జరిగిన కొద్దీ జీవన విధానంలో మార్పులు వస్తూ ఉన్నాయి. జనాభా పెరుగుదల, వాతావరణ మార్పులు, విస్తృత రవాణా సదుపాయాల వంటివి కొత్త వైరస్‌ల ఆవిర్భావం, వ్యాప్తికి కారణం అవుతున్నాయి. మానవాళి ప్రధానంగా జునోటిక్ వైరస్‌లు, ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌లు, అర్బోరి వైరస్‌ల (కీటకాల నుంచి సంక్రమిస్తుంది) వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నది. 20, 21 శతాబ్దంలో ఈ వైరస్‌ల నుంచి అనేక ప్రమాదాలు ఎదుర్కొన్నాం. ఫ్లూను కలగజేసే ఇన్‌ఫ్లుయెంజాను ఉదాహరణగా తీసుకుంటే, 1899లో 2.5 లక్షల మరణాలు, 1918లో స్పానిష్ ఫ్లూగా రూపాంతరం చెంది 5 కోట్ల మరణాలు, 1950లో ఆసియన్ ఫ్లూగా 10 లక్షల మరణాలు, 2009లో స్వైన్ ఫ్లూ రూపంలో అనేక మరణాలకు కారణమైంది. అలాగే, ఎల్లో ఫీవర్ వైరస్ ప్రతి దశాబ్దంలోనూ విజృంభిస్తున్నది. 19వ శతాబ్దం మొదట్లో పుట్టుకొచ్చిన హెపటైటిస్ వైరస్ ఇప్పటికీ వ్యాధులను కలిగిస్తూనే ఉన్నది. ఇలా కొన్ని వేల సంవత్సరాలుగా వైరస్‌తో మానవుడు పోరు సలుపుతూనే ఉన్నాడు.ప్రపంచం ప్రస్తుతం జంతువుల నుంచి మానవులకు వ్యాప్తి చెందే శ్వాసకోశ వ్యాధికారక వైరస్‌ల నుంచి పెను ప్రమాదం ఎదుర్కొంటున్నది. అతి తీవ్ర శ్వాసకోశ వ్యాధులు (సివియర్ అక్యూట్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్) మానవులకు చాలా ప్రమాదకరంగా ఉంటున్నాయి. గతంలో వచ్చిన 'సార్స్','మెర్స్'తో పాటు 2019 లో వచ్చిన కొవిడ్-19 ప్రపంచాన్ని చిన్నాభిన్నం చేసింది. కోట్లాదిమంది మృతికి కారణమైంది. ఈ వైరస్ ప్రభావం నుంచి ప్రపంచం ఇప్పుడిపుడే కోలుకుంటున్నది.ప్రస్తుత కాలంలో ఏ కొత్త వైరస్ పేరు విన్నా మానవాళి ఆందోళనకు గురి అవుతున్నది. ఇప్పుడు చైనాలో మరో వైరస్ హ్యూమన్ మెటాన్యూమోనిక్ వైరస్ (హెచ్‌ఎంపీవీ) కేసులు పెరగ్గానే ప్రపంచంలో అలజడి మొదలయింది. కానీ ఇది చాలా పాత వైరస్. 2001 లోనే దీనిని డచ్ శాస్త్రవేత్తలు గుర్తించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రపంచంలో అనేక దేశాలలో ఈ వైరస్ సోకినప్పటికీ మరణాలు ఎక్కువగా లేవు. ఎండమిక్ గానే ఉంది. ప్రస్తుతం కూడా అదే స్థాయిలో ఉంది.భారతదేశంలో కూడా వేర్వేరు ప్రాంతాల్లో హెచ్‌ఎంపీవీ వ్యాప్తిని 2008 నుంచి 2023 వరకు గమనించారు. అయితే, ఇక్కడ కూడా భారీ నష్టాన్ని ఏమీ కలిగించలేదు. ప్రధానంగా ఐదేండ్లలోపు పిల్లలు, వయోధికులు, ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారిలో, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, శ్వాస సంబంధ వ్యాధులు ఉన్నవారిలో ఈ వైరస్ ప్రభావం ఎక్కువ. మిగిలిన వారిలో కేవలం జలుబు వంటి లక్షణాలు కనిపిస్తాయి.ఈ వైరస్ యొక్క వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ గురించి జనబాహుళ్యంలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా కొత్త వైరస్‌లు పుట్టుకొస్తూనే ఉంటాయి. మ్యుటేషన్స్, జెనెటిక్ షిఫ్ట్, స్పీసిస్ జంప్ వల్ల ఇలా జరుగుతుంది. ప్రతీ కొత్త వైరస్ ప్రమాదభరితం కాదు. కాకపోతే, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఆందోళన అసలే అవసరం లేదు. సోషల్ మీడియా పుకార్లతో 'నాన్నా! వైరస్' స్థితికి రావద్దు.

# విద్యారంగంలో ఫాతిమా షేక్ సేవలు మరువలేనివి



సమ సమాజ నిర్మాణంలో ఎందరో మహానుభావులు అని మనం ఎప్పుడు చెప్పుకుంటాం కానీ నాటి నేటి పురుషాధిక్యత సమాజంలో కూడా పురుషులకు తగ్గకుండా మహిళలు కూడా వారి వారి పాత్రను పోషించారు . ప్రతి సందర్భంలోనూ యుద్ధాల సమయంలోనూ వారి పాత్ర కీలకం . బ్రిటిష్ పరిపాలన సమయంలో కూడా మహిళల విద్య కోసం భారతదేశంలో మొదటిసారి నడుం బిగించిన మహాత్ముడు మహాత్మ జ్యోతిబాపూలే దంపతులకు ఫాతిమా షేక్ కూడా అండగా నిలిచి వారితోపాటు విద్యాబోధనలో సమాజ సేవలో ముఖ్య కీలక భూమిక పోషించారు . చరిత్రలో లోతైన అధ్యయనం చేసినా కొద్దీ సంఘ సేవకుల పాత్రులను వారికి సహకరించి సేవలందించిన వాళ్ల సేవలను ఒక్కొక్కటిగా వెలుగు చూస్తూ బయటకు వస్తున్నాయి . అందులో భాగంగానే బ్రిటిష్ ఇండియా ముంబై రెసిడెన్సి పరిధిలోని పూణే ప్రాంతంలో నివాసి అయిన ఫాతిమా షేక్ 9 జనవరి 1831 న జన్మించారు. ఫాతిమా షేక్ మియాన్ ఉస్మాన్ షేక్ సోదరి. సామాజిక సేవల విషయంలో సొంత తండ్రే జ్యోతీరావ్ పూలేను ఇంటి నుంచి బయటకు పంపించినప్పుడు మియాన్ ఉస్మాన్ షేక్ ఆశ్రయమిచ్చారు. వారి ఇంట్లో జ్యోతీరావ్ పూలే, సావిత్రిబాయి పూలే నివాసం ఉండేవారు. ఆధునిక భారతదేశంలోని మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయుల్లో ఒకరైన ఆమె పూలే పాఠశాలలో దళిత పిల్లలకు విద్యను అందించడం ప్రారంభించింది. పూలే దంపతులు ఫాతిమా షేక్‌తో కలసి అణగారిన



9 జనవరి ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా

వర్గాలలో విద్యను వ్యాప్తి చేసే బాధ్యతను చేపట్టారు. ముఖ్యంగా బాలికా, స్త్రీ విద్యకు కృషి చేసారు. సింథియా ఫర్రార్ అనే అమెరికన్ మిషనరీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో ఇద్దరూ చేరినప్పుడు ఫాతిమా షేక్, సావిత్రిబాయి పూలేను కలిశారు. ఆమె పూలే దంపతులు స్థాపించిన ఐదు పాఠశాలల్లో పనిచేసింది. ఆమె అన్ని మతాలు, కులాల పిల్లలకు బోధించింది. 1851లో ముంబాయిలో రెండు పాఠశాలల స్థాపనలో ఫాతిమా షేక్ పాల్గొన్నది. ఉస్మాన్ షేక్ ఇంట్లో ప్రారంభమైన పాఠశాలకు విద్యార్థుల ఆదరణ పెరగటంతో మరిన్ని పాఠశాలలను చుట్టుపక్కల ప్రాంతాల్లో నెలకొల్పారు. వాటిల్లో సావిత్రీబాయి, ఫాతిమా షేక్ ఇద్దరూ కలిసి చదువు చెప్పేవారు. అయితే మహిళలకు చదువులెందుకు అనే ధోరణి ఉన్న సమాజంలో వారిరువురు అనేక అవాంతరాలను ఎదుర్కొన్నారు. అందులోనూ అట్టడుగు వర్గాల ప్రజలు చదువుకోవడానికి వీలులేని దురాచారం ఉంది . దీంతో భవిష్యత్ తరాల కోసం వాళ్లు అవమానాలను, దాడులను సైతం ఎంతో సహనంతో భరించారు. అమ్మాయి చదువు అవనికి వెలుగు అని చాటిచెప్పారు. 9 అక్టోబర్ 1900 న 69 సంవత్సరాల వయసులో తుది శ్వాస వదిలారు. 2014లో మహారాష్ట్ర ప్రభుత్వం సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, జాకీర్ హుస్సేన్, అబ్దుల్ కలాం, ఆజాద్ లాంటి వారితో పాటు ఫాతిమా షేక్ సంక్షిప్త పరిచయాన్ని బాల్ భారతి లో పాఠ్యాంశంగా చేర్చింది. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 2022లో ఫాతిమా షేక్ పాఠాన్ని 8వ తరగతి పాఠ్యపుస్తకాలలో ప్రవేశపెట్టింది. తెలంగాణ ప్రభుత్వం కూడా 9 జనవరిలో ఫాతిమా షేక్ జయంతి ఉత్సవాలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది .

**అస శ్రీరాములు**
**సీనియర్ జర్నలిస్ట్**

# మరోరూపంలో మూడు చట్టాలు



రైతుల ఆందోళనకు తలొగ్గి గతంలో వెనక్కి తీసుకున్న మూడు సాగు చట్టాల్లోని అంశాలకు వేరే ముసుగులు తగిలించి తిరిగి ప్రవేశపెట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎత్తులు వేస్తున్నదా? అప్పట్లో వాటి రద్దు సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం ఇప్పుడు పోరాడుతున్న రైతులు ఇదే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కోసం పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని శంభు వద్ద రైతులు పది నెలలుగా ఆందోళన చేస్తుంటే వారితో చర్చలకు ముందుకు రాకపోగా, ఇప్పుడు రద్దు చేసిన సాగు చట్టాలకు మించిన భయంకరమైన యంత్రాంగాన్ని మరో రూపంలో తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించడం రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నది.

'కాలగర్భంలో కలిసిపోయాయను కున్న మూడు నల్ల చట్టాలు మళ్లీ నెత్తిన పడతాయన్న భయం రైతులను వెంటా డుతున్నది. అందుకు తగ్గట్టుగానే 'అగ్రికల్చర్ మార్కెటింగ్' (ఎన్‌పీఎఫ్ఏఎం)పై కేంద్రం జాతీయ విధాన ముసాయిదా రూపొందించడం రైతుల ఆందోళనకు గురిచేస్తున్నది. 2021లో రద్దుచేసిన మూడు సాగు చట్టాలను దొడ్డి దారిన తీసుకొచ్చేందుకే ఈ ప్రయత్నమని, వాటి తో పోలిస్తే ఇది మరింత ప్రమాదకరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'కిసాన్ ఆందోళన్-2.0' పేరుతో 9 నెలలుగా కొనసాగుతున్న పోరాటంలో కిసాన్ యూనియన్ సిద్ధూపూర్ రాష్ట్ర అధ్యక్షుడైన జగ్జీత్‌సింగ్ డల్లేవాల్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. హర్యానా-పంజాబ్ సరిహద్దులోని ఖనౌరీలో నవంబర్ 26న ఆయన ఆమరణ దీక్ష చేపట్టి రైతు ఉద్యమాన్ని మలుపుతిప్పారు. దీని తర్వాత రైతు ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యం పెరిగింది. డల్లేవాల్ దీక్షను భగ్నం చేయడం, రైతుల ఒత్తిడితో తిరిగి విడుదల చేయడం వివాదాస్పదమైంది. సుప్రీం ఆదేశాలతోనే డల్లేవాల్ దీక్షను భగ్నం చేశామని పోలీసులు అంటుంటే.. తామెన్నడూ అలా ఆదేశించలేదని సర్వోన్నత న్యాయస్థానం చెప్తున్నది.

ఇక, పంట ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ) మార్కెట్లను రద్దు చేయడంతోపాటు కాంట్రాక్ట్ సాగును ప్రోత్సహిస్తూ నిరుడు నవంబర్ 25న ముసాయిదా విధానాన్ని కేంద్రం విడుదల చేసింది. గతంలో తీసుకొచ్చిన మూడు సాగుచట్టాల్లో ఇది కూడా ఒకటి కావడంతోనే అప్పట్లో రైతులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు.

ఇప్పుడు మళ్లీ దీనిని దొడ్డిదారిన తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతుండటంపై మరోమారు పిడికిలెత్తారు. గత హామీల అమలు కోసం పోరాడుతుంటే అది పట్టని కేంద్రం ఇప్పుడు సాగు మొత్తాన్ని ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే
ఆలోచన చేస్తుండటం రైతులను విస్మయానికి గురిచేస్తున్నది.

దీనికితోడు పంజాబ్‌లో ఏంపీఎంసీ మార్కెట్ల విధానాన్ని సమూలంగా మార్చాలని చూస్తుండటంతో రైతులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అంతేకాదు, ముసాయిదా పాలసీపై స్పందించేందుకు రాష్ట్రాలకు కేం ద్రం రెండువారాల సమయం మాత్రమే ఇవ్వడం వెనుక ఉన్న ఉద్దేశం కూడా ఇదేనని అంటున్నారు. కాబట్టి పంజాబ్ వెంటనే దీనికి వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, అన్ని రాష్ట్రాలు ఇదే వైఖరి అవలంబించాలని రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) డిమాండ్ చేస్తున్నాయి.

ప్రభుత్వం విడుదల చేసిన అగ్రికల్చర్ మార్కెటింగ్ ముసాయిదా పాలసీలో ప్రైవేటు హోల్‌సేల్ మార్కెట్లను ఏర్పాటు చేయడం, ప్రాసెసర్లు, ఎగుమతిదారు లు, వ్యవస్థీకృత రిటేలర్లు, బల్క్ బయ్యర్లను నేరుగా హోల్‌సేల్ కొనుగోలుకు అనుమతించడం వంటివి రైతుల ఆగ్రహానికి కారణమవుతున్నాయి. ముఖ్యంగా కాంట్రాక్ట్ సాగుపై ప్రభుత్వం పట్టుబట్టడం విమర్శలకు గురవుతున్నది. ఇది అమల్లోకి వస్తే తమ పొలంలో తామే కూలీలుగా మారిపోతామన్న భయం వారిలో వ్యక్తమవుతున్నది. మరోవైపు, దీనిపై రైతుల ఆందోళన అవసరం లేద ని, వారి మేలుకోసమే దీన్ని తీసుకొస్తున్నట్టు కేంద్రం చెప్తున్నది. ప్రైవేటు మార్కెట్ల మధ్య పోటీ పెరిగితే రైతుల మేలుకే దోహదం చేస్తుందని, వారి నికర ఆదాయాన్ని పెంచాలన్నదే తమ యోచన అని కేంద్రం వాదిస్తున్నది.ఎన్‌పీఎఫ్ఏఎం నిస్సందేహంగా రద్దు చేసిన వ్యవసాయ చట్టాలకు 'బ్యాక్ డోర్ ఎంట్రీ' ఇస్తుందని ఎస్‌కేఎం నేత రాజేవా ల్ చెప్తున్నారు. కొత్త ముసాయిదా విధానంతో ప్రైవేటు వ్యాపారులకు గిడ్డంగులు నిర్మించుకునేందుకు అనుమతి లభిస్తుందని, కాబట్టి ఇది ఆమోదయోగ్యం కాదం టున్నారు. ఏది ఏమైనా ఈ పాలసీని వ్యతిరేకించి తీరుతామని రైతులు భీష్మించుక్కూర్చున్నారు. రైతు సంఘాలను మరోమారు ఏక తాటిపైకి తెచ్చి దీనికి వ్యతిరేకంగా పోరాడుతామని, ఇందుకోసం ఎంతవరకైనా కొట్లాడతామని ఆ సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు.

# పెరిగే గణపయ్య.. చల్లగ చూడయ్య!

**భక్తి**



పార్వతీ తనయుడు స్వయంభూగా వెలిసిన క్షేత్రాలు తెలంగాణ ప్రాంతంలో బహు అరుదుగా కనిపిస్తాయి. అలాంటి వాటిలో ఒకటి రేజింతల్. ఇక్కడ పార్వతీ నందనుడు సిందూర వర్ణంలో సిద్ధి వినాయకుడిగా కొలువుదీరాడు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రేజింతల్ గ్రామ శివారులో స్వామి ఆలయం ఉంది. ఇక్కడి దైవాన్ని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వస్తుంటారు. తెలంగాణ రాష్ట్రానికి తలమానికమైన రేజింతల్ వినాయకుడి క్షేత్రం 225వ వార్షికోత్సవం జరుపుకొంటున్నది. ఈ సందర్భంగా ఆ ఆలయ విశేషాలు తెలుసుకుందాం..

రేజింతల్ వినాయకుడు స్వయంభూగా వెలిశాడని స్థల పురాణం. అయితే, 225 సంవత్సరాల కిందట స్వామి జాడ తెలిసింది. ఆ కాలంలో శివరాం అనే భక్తుడు కాలినడకన తీర్థయాత్రలకు బయల్దేరాడట. అనేక క్షేత్రాలు దర్శిస్తూ రేజింతల్ ప్రాంతానికి రాగానే అతనికి ఏదో తెలియని అనుభూతి కలిగింది. గ్రామంలోనే చాలాకాలం ఉండి తపస్సులో నిమగ్నుడయ్యాడు. మళ్లీ తీర్థయాత్రలు కొనసాగించాడు. ఒకసారి శిష్య బృందంతో తిరుపతి వెళ్తూ మళ్లీ రేజింతల్ ప్రాంతానికి వచ్చాడు. చీకటి పడటంతో ఆ రాత్రి అందరూ అక్కడే బస చేశారు. మర్నాడు పుష్య శుక్ల చవితి కావడంతో.. వినాయకుడికి పూజలు చేయాలని శిష్యులు కోరారు. శివరాం పంతులుకు రాత్రి కలలో వినాయకుడు కనిపించి తన ఉనికిని తెలియజేశాడట. తన విగ్రహాన్ని వెలికితీసి పూజాదికాలు నిర్వహించాలని ఆజ్ఞాపించాడట. మర్నాడు ఆ ప్రాంతంలో వెదకగా వినాయకుడి విగ్రహం కనిపించిందట. అలా అవతరించిన స్వామికి భక్తులు ఆలయాన్ని నిర్మించారు. తర్వాతి కాలంలో కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి జరిగింది.

ఎన్నో ప్రత్యేకతలు..

సహజంగా ఆంజనేయస్వామికి సిందూరం అలదుతారు. ఎక్కడాలేని విధంగా రేజింతల్ వినాయకుడికి సిందూరం పులమడం ఆచారం. అంతేకాదు స్వామివారి రూపం ఒకవైపు నుంచి ఆంజనేయుడిగా, మరో కోణంలో వినాయకుడిగా దర్శనమివ్వడం విశేషం. ఈ వినాయకుడి విగ్రహం ఏటా పెరుగుతుందని చెబుతారు.

మొదట్లో రెండున్నర అడుగులు ఎత్తూ మూడడుగుల వెడల్పు ఉన్న స్వామివారి విగ్రహం ఇప్పుడు ఐదున్నర అడుగుల ఎత్తు, ఆరడుగుల వెడల్పుతో ఉందని చెబుతారు. పృథ్వీ తత్వానికి ప్రతీకగా భావించే వినాయకుడు సకల విఘ్నాలను, సమస్త క్లేశాలను తొలగిస్తాడని భక్తుల నమ్మకం. ఇన్ని ప్రత్యేకతలు ఉండబట్టే.. రేజింతల్ వినాయకుణ్ని నిత్యం వందలాది మంది భక్తులు దర్శించుకుంటారు. అంగారక చతుర్థి, సంకష్టహర చతుర్థి లాంటి పర్వదినాల్లో వేలమంది భక్తులు ఆలయానికి వస్తారు. ఏటా పుష్య శుక్ల పాడ్యమి నుంచి చవితి వరకు స్వామివారి జయంత్యుత్సవాలు వైభవంగా చేస్తారు. ఇందులో భాగంగా సహస్ర మోదకాలతో 451 గణపతి హవనాలు, శతచండీ యాగం, లక్ష గణేశ గాయత్రీ హవనం నిర్వహిస్తారు. సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ పరిసర గ్రామాల ప్రజలు వారి ఇండ్లలో ఏ శుభకార్యం జరిగినా ముందుగా రేజింతల్‌కు వచ్చి స్వామిని అర్చించిన తర్వాతే.. పనులు మొదలుపెడతారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలోని మేడిచెట్టుకు ముడుపులు కడతారు. కోరికలు నెరవేరిన తర్వాత మళ్లీ వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారు.





## మెంతినీళ్లతో మేలు

భారతీయుల వంటల్లో మెంతులు తరచుగా వాడుతూనే ఉంటారు. ఆయుర్వేద నిపుణుల ప్రకారం మెంతుల్లో ఉండే విటమిన్లు, మినరల్స్‌తో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మెంతుల నీళు తాగడం వల్ల కలిగే లాభాల గురించి తెలుసుకుందాం.

మెంతి నీళ్లు తాగడం వల్ల శరీరం డిటాక్సిఫై అవుతుంది.

రక్తంలో చక్కెర స్థాయులు అదుపులోకి వస్తాయి.

మెంతినీళ్లు పొట్టను శుద్ధి చేస్తాయి. మలబద్ధకం, ఎసిడిటీ, కడుపుబ్బరం లాంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

క్రమం తప్పకుండా మెంతినీళ్లు తాగుతూ ఉంటే ఊబకాయం తగ్గుతుంది. అయితే, మెంతులు వేడిచేస్తాయి. కాబట్టి గర్భిణులు వైద్యుడి సలహా మేరకే వాడాల్సి ఉంటుంది.

**మెంతినీళ్ల తయారీకి**

ఒకటిన్నర టీ స్పూన్ల మెంతులను ఓ గ్లాసు నీళ్లలో రాత్రంతా నానబెట్టాలి. పొద్దున ఈ నీళ్లను వడగట్టి పరగడుపునే తాగేయాలి.

## సిగలో ఫ్యాషన్ పువ్వు..

ముడిలో మల్లెలు ముడవడం, జడలో గులాబీలు తురమడం అందానికి పందిరేసే సంగతులే అయినా, ఈ రోజుల్లో పువ్వులు అవుటాఫ్ ఫ్యాషన్ అలమరాలో చేరిపోయాయి. అలా అని ఇంతి మనసు పూబంతుల మీద నుంచి సొంతం దూరమైపోయిందనీ చెప్పలేము. ఆ అందాన్ని ఎలాగోలా తన అలంకారంలో అమరిస్తే బాగుంటుందనే ఆలోచన సాగుతూనే ఉంటుంది. అందుకే, ఇటు ఫ్యాషన్ మెరిసేలా, అటు విరుల సొగసు విరిసేలా 'ఫ్లవర్ క్లా క్లిప్'లు మార్కెట్లోకి వస్తున్నాయి.

జుట్టు విరబోసుకోవడం ఇప్పుడు ఫ్యాషన్. కాలేజీకో, ఆఫీసుకో వెళ్లేప్పుడు మాత్రం గాలితో పాటు గోల చేసే జుట్టును గారాబంగా కట్టేయడానికి క్లా క్లిప్పులు లేదా క్లచ్‌లకు పనిచెబుతారు అమ్మాయిలు. దానిని దిగ్విజయంగా పూర్తి చేసి ఆడపిల్లల అభిమానాన్ని చూరగొన్నాయి కాబట్టే, వీటికి గర్ల్ సర్కిల్‌లో యమా క్రేజ్. మన్మథుడు సినిమాలో హీరోయిన్ క్లిప్పును తీసి ఫైలుకు పెట్టినట్టు, వీళ్లు కూడా వీలుని బట్టి వీటిని వాడేస్తుంటారు. అందుకే ఎన్నెన్నో వర్ణాలతో, ఇంకెన్నో అందాలతో ఇవి ముస్తాబయి వస్తున్నాయి. వీటికీ ఆడపిల్లలకూ ఉన్న అనుబంధాన్ని చూసి పువ్వుల సోకునూ రంగరించి ఆమెకు సింగారానికి సిద్ధం చేశారు డిజైనర్లు.

నచ్చిన పువ్వు..ఒకరికి గులాబీ పువ్వు ఇష్టం. మరొకరికి మల్లెలంటే ప్రాణం. ఇంకొకరు చామంతుల అందాన్ని ఆరాధిస్తారు. తులిప్, బ్లూ బెల్స్‌లాంటి ప్రత్యేకమైన పువ్వులు నచ్చేవారు కొందరుంటారు. ఇలా ఎవరి అభిరుచిని బట్టి వారు ఎంచుకునేలా అచ్చం నిజమైన పువ్వులను తలలో పెట్టుకున్నట్టు కనిపించేలా ఈ ఫ్లవర్ క్లా క్లిప్పులు రూపొందుతున్నాయి.

రంగు రంగుల పూల అందాన్ని జడకు అద్దుతూనే ఫ్యాషన్ లుక్‌ని తీసుకురావడం వీటి ప్రత్యేకత. ప్లాస్టిక్‌తో చేసిన వాటితోపాటు, మెటల్ మీద ఎనామిల్ రంగులు వచ్చి, రాళ్లు, పూసలు పొదిగినవి కూడా ఈ తరహాలో తయారు



అవుతున్నాయి. విరబోసిన జుట్టులో చిన్నపాయ తీసి పెట్టుకునేందుకు, బన్, హాఫ్ బన్ మోడళ్లకూ, ట్రెండీ హెయిర్ ట్కస్టైల్స్‌కు ఇవి చక్కగా నప్పుతాయి. సౌకర్యం విషయంలో ఎలాంటి రాజీ లేకుండా రోజువారీ వాడే వాటిలాగే వీటినీ పెట్టుకోవచ్చు. ఎంచక్కా పువ్వులు అలంకరించుకున్నట్టు అందంగానూ కనిపించొచ్చు. ప్రత్యేకంగా అలంకరించుకోకుం డానే స్పెషల్‌గా కనిపించాలంటే పూల క్లిప్పులు మంచి ఎంపికఏమంటారు?

## చలికాలంలో.. వేడివేడిగా! చలికాలం..

చలికాలం.. వాతావరణం విభిన్నంగా ఉంటుంది. ఉదయాన్నే కమ్ముకునే పొగమంచు.. మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. అయితే.. ఆ ఆహ్లాదం వెనకే, అనారోగ్యమూ దాగి ఉంటుంది. చల్లని వాతావరణం.. శరీరానికి అనేక సమస్యలను తెచ్చి పెడుతుంది. అయితే, ఒక చిన్న చిట్కా ద్వారా.. ఇలాంటి ఎన్నో సమస్యలకు చెక్ పెట్టవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఉదయాన్నే 'వేడినీరు తాగడం'.. నిత్యకృత్యంగా చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఇశీతకాలంలో ఎదురయ్యే ప్రధాన సమస్యలు.. జలుబు, ముక్కుదిబ్బడ. ముఖ్యంగా, సైనసైటిస్ ఉన్నవారికి ఈ చల్లని వాతావరణం నరకమే!

ఉదయాన్నే ఒక గ్లాసు వెచ్చని నీరు తాగితే.. జలుబు, సైనస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. గొంతులో శ్లేష్మాన్ని కరిగించడంలో వేడినీరు సాయపడుతుంది. వేడినీటి నుంచి వచ్చే ఆవిరి.. సైనస్ వల్ల కలిగే ఒత్తిడిని తగ్గిస్తుంది.

చలి తీవ్రత పెరిగితే.. శరీరంలో రక్తనాళాలు కుంచించుకుపోతాయి. ఫలితంగా.. శరీర అవయవాలకు రక్త సరఫరా మందగిస్తుంది. అయితే.. వేడినీళ్లు అద్భుతమైన వాసోడైలేటర్‌గా పనిచేస్తాయి. ఇవి రక్తనాళాలను విస్తరింపజేసి.. రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తాయి. ఫలితంగా, గుండె ఆరోగ్యానికీ ప్రయోజనం చేకూరుతుంది. కండరాల నొప్పి నుంచీ ఉపశమనం కలుగుతుంది.

చలికాలంలో కొందరిలో 'అచలాసియా కార్డియా' సమస్య కనిపిస్తుంది. అన్నవాహిక కండరాలపై ప్రభావం చూపే ఈ సమస్య వల్ల ఆహారం తీసుకోవడం, నీళ్లు తాగడం కూడా కష్టమైపోతుంది. అయితే.. అన్నవాహిక కండరాలను సడలించడంలో వేడినీరు సాయపడుతుంది. తద్వారా అచలాసియా లక్షణాలు తగ్గి.. ఆహారం, నీళ్లు మింగడం సులభం అవుతుంది.

వేడినీటిని తాగడం.. జీర్ణవ్యవస్థకూ ప్రయోజనకరంగా ఉంటుంది. జీర్ణ అవయవాలకు రక్త ప్రవాహాన్ని ప్రేరేపిస్తుంది. వాటి ప ని తీ ర ు న ు మెరుగుపరుస్తుంది.

వేడినీటిలో ఒక టీస్పూన్ నిమ్మరసం కలుపుకొని తాగితే.. ఆహారం త్వరగా విచ్ఛిన్నం అవుతుంది. శరీరం పోషకాలను మరింత సమర్థంగా గ్రహించేలా సాయపడుతుంది. మలబద్ధకం, కడుపుబ్బరం, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలను దూరం చేస్తుంది.

వేడినీళ్లు.. పేగులను ఉత్తేజపరుస్తాయి. వాటి కదలికలను ప్రోత్సహిస్తాయి. ఆహారాన్ని సమర్థంగా విచ్ఛిన్నం చేస్తాయి. ఫలితంగా.. మలబద్ధకం దూరమవుతుంది.

చల్లని వాతావరణానికి ప్రతిస్పందనగా శరీరం వణుకుతుంది. అలాంటి సమయంలో వేడినీటిని తాగడం వల్ల.. శరీర అంతర్గత ఉష్ణోగ్రత పెరిగి.. వణుకు తగ్గుతుంది.

చలికాలంలో చెమట ఎక్కువగా పట్టదు. దీంతో శరీరంలోని వ్యర్థాలు లోపలే ఉండిపోతాయి. వేడినీరు తాగడం వల్ల



శరీరంలో అంతర్గత ఉష్ణోగ్రత పెరిగి చెమట బాగా పడుతుంది. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపించేస్తుంది. ఫలితంగా.. కాలేయం, మూత్రపిండాల పనితీరుకు భరోసా ఇస్తుంది.



# ముక్కోటి వైభవం

శుక్రవారం వైకుంఠ ఏకాదశి

ధనుర్మాస సంతసాన్ని రెట్టింపు చేసే పర్వం వైకుంఠ ఏకాదశి. దక్షిణాయనంలో యోగనిద్రలో ఉన్న మహావిష్ణువు ఈ రోజే మేల్కొంటాడని శాస్త్రం చెబుతున్నది. స్థితికారుడైన శ్రీహరిని మేల్కొల్పడానికీ, ఆ స్వామిని దర్శించుకోవడానికి ముక్కోటి దేవతలూ వైకుంఠానికి తరలివెళ్తారు. ఉత్తర ద్వారం నుంచి పురుషోత్తముణ్ని దర్శించుకొని ఉప్పొంగిపోతారు. దేవతలే కాదు.. ఇలాతలంలో మనుషులు కూడా వైష్ణవాలయాలకు పోటెత్తుతారు. ఉత్తర ద్వారం గుండా వెళ్లి విష్ణుమూర్తి విశేష రూపాన్ని చూసి జన్మ తరించిందన్న భావనకు లోనవుతారు.

ఏడాదిలో వచ్చే అన్ని ఏకాదశులూ ఏదో ఒక ప్రత్యేకతను సంతరించుకున్నవే! ముక్కోటి ఏకాదశి కూడా విశేషమైనదే. అయితే, ప్రతి ఏకాదశినీ చాంద్రమానం అనుసరించి చేసుకుంటాం. ముక్కోటి ఏకాదశిని మాత్రం సౌరమానం ప్రకారం జరుపుకొంటాం. సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించిన తర్వాత వచ్చే శుక్ల ఏకాదశిని 'వైకుంఠ ఏకాదశి'గా చేసుకోవాలని శాస్త్రం నిర్దేశించింది. అందుకే ఈ పర్వం ఒక్కోసారి మార్గశిర మాసంలో, ఒక్కోసారి పుష్యమాసంలో వస్తుంటుంది. ముక్కోట ి దేవతలు వైకుంఠ ద్వారంలో మహావిష్ణువును దర్శించుకుంటారు కాబట్టి దీనిని 'ముక్కోటి ఏకాదశి' అని కూడా పిలుస్తారు. ముందుగా దేవతలకు దర్శనమిచ్చిన శ్రీహరి%ొ% ఉత్తర ద్వారం ద్వారానే ప్రయాణించి భూలోకానికి వచ్చాడనీ, మురాసురుడు అనే రాక్షసుణ్ని సంహరించాడని పురాణ కథనం.ముక్కోటి ఏకాదశి నాడు వేకువ జామునే నిద్రలేవాలి. అవకాశం ఉన్నవాళ్లు నదీస్నానం చేయాలని పెద్దల మాట. లేనిపక్షంలో అభ్యంగన స్నానం ఆచరించి.. వైష్ణవాలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకోవాలి. శారీరకంగా ఆరోగ్యం సహకరించిన వారు ఆనాడు పూర్తి ఉపవాసం పాటించాలి. వీలైనంత ఎక్కువ సమయం విష్ణుచింతనలో కాలం గడపాలి. విష్ణుకథలు వినడం, విష్ణునామాన్ని సంకీర్తనం చేస్తూ మనసును దైవానికి సమీపంగా ఉంచే ప్రయత్నం చేయాలి. మర్నాడు ఉదయం విష్ణుపూజ చేసి, అతిథికి భోజనం పెట్టి, ద్వాదశి పారణం (భోజనం) చేయాలి.మనకు ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, ఆపై మనసును పదకొండో ఇంద్రియంగా చెప్పారు పెద్దలు. ఈ ఏకాదశ ఇంద్రియాలూ మంచి మార్గంలో ప్రవర్తించడం 'వైకుంఠ ఏకాదశి' లక్ష్యం. 'కుంఠం' అంటే లోపం. ఏ లోపం లేకుండా ఉండటం అంటే 'వికుంఠం'. అంటే సక్రమంగా వ్యవహరించటం. పదకొండు ఇంద్రియాలకు వికుంఠ స్థితిని ప్రసాదించే పర్వదినం వైకుంఠ ఏకాదశి. మనసు, ఇంద్రియాలూ, వీటి ప్రవృత్తులు కోటాను కోట్లు. ఆ మనసు సత్వ, రజ, స్తమో గుణాల ప్రకారం పనిచేస్తుంది. ఆ ప్రవృత్తులను ముక్కోటి దేవతలుగా సంకేతరూపంలో చెప్పారు పెద్దలు. ఈ ప్రవృత్తులన్నీ 'ఉత్తర' ద్వారం వెంబడి ప్రయాణించడం అంటే 'యోగసాధన' అని అర్థం. అలా యోగసాధన సక్రమంగా సాగినప్పుడు కలిగే దివ్యానందమే హృదయంలో కలిగే విష్ణు దర్శనం. ఆనాడు జీవుడి మనః ప్రవృత్తులు ఉన్న మార్గం కన్నా ఉన్నతమైన మార్గంలో ప్రయాణిస్తాయి. అదే ఉత్-తర-ద్వార దర్శనం. ఈ అంతరార్థాన్ని గమనించి ప్రవర్తించిన వేళ ఈ వైకుంఠ ఏకాదశి పర్వదినం మొక్కుబడిగా మిగిలిపోక సార్థకం అవుతుంది.విష్ణు రూపం,,ఏకాదశి శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన తిథిగా చెబుతారు. పూర్వం ముర అనే రాక్షసుడితో విష్ణుమూర్తి యుద్ధం చేశాడు. యుద్ధ సమయంలో అలసిపోయిన విష్ణువు కాసేపు నిద్రిస్తాడు. ఇదే అదునుగా విష్ణువును సంహరించడానికి మురాసురుడు ప్రయత్నిస్తాడు. అప్పుడు విష్ణువు దేహం నుంచి ఓ దివ్యతేజస్సు ఆవిర్భవించి, ఆ రాక్షసుణ్ని సంహరిస్తుంది. ఆ రోజు ఏకాదశి కావడంతో, విష్ణుమూర్తి తన తేజస్సును ఏకాదశి అని సంబోధించాడు. తన దేహం నుంచి ఉద్భవించి తనను రక్షించిన ఏకాదశితో మహావిష్ణువు.. 'మమ భక్తాశ్చ యే లోకాః తవ భక్తాశ్చ యే నరాః త్రిషు లోకేషు విఖ్యాతాః ప్రాప్స్యంతి మమ సన్నిధిం' అంటాడు. అంటే ఎవరు తనను, ఏకాదశీ దేవిని ఆరాధిస్తారో వాళ్లు ముల్లోకాల్లో కీర్తిని, చివరగా మోక్షాన్ని పొందుతారని వరం ఇస్తాడు. ఏకాదశిని ఆరాధించడం అంటే, ఆ రోజున ఉపవాసం ఆచరించి, భగవత్ ధ్యానంలో సమయం గడపడమే!

**ఉత్తమ దర్శనం**

దేవతలకు ఉత్తరాయణం పగటి సమయంగా, దక్షిణాయనం రాత్రివేళగా పేర్కొంటారు. ఉత్తర-దక్షిణాయనాలకు సంధిలో వచ్చే ధనుర్మాసం దేవతలకు బ్రాహ్మీ సమయంగా అభివర్ణిస్తారు. ఈ బ్రాహ్మీ ముహూర్తంలో వచ్చే శుక్ల ఏకాదశి అత్యంత పవిత్రమైనది. ఆ రోజు దేవతలంతా వైకుంఠానికి వెళ్లి ఉత్తర ద్వారం నుంచి వైకుంఠనాథుడిని దర్శనం చేసుకుంటారు. ఈ నేపథ్యంలో శ్రీమహావిష్ణువు అనుగ్రహాన్ని పొందడం కోసం వైష్ణవ ఆలయాల్లో వైకుంఠంతో సమానమైన రత్న మందిరాన్ని

## హ్యాపీ.. మానిక్యూర్!

క్రిస్మస్ సంబురాల్లో అలంకరణదే అగ్రస్థానం. తగ్గేదేలే అన్నట్టు ఉంటుంది అమ్మాయిల ముస్తాబు. అందులోనూ చేతిగోళ్ల సింగారింపులో రకరకాల థీమ్స్ వస్తున్నాయి. స్టార్స్, కేక్స్, క్యాండిల్స్, బెల్స్, క్రిస్మస్ తాత.. ఇలా అనేక బొమ్మలు గోటి మీదికి ఎక్కుతున్నాయి. వీటికి త్రీడీ ఎఫెక్ట్ కూడా ఇస్తున్నారు.



## పచ్చిగా తింటే..



కూరగాయల్లో ఎన్నోరకాల విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. అనేక వ్యాధులను దూరం చేస్తాయి. అయితే, కూరగాయలను ఉడికిస్తే.. వాటిలో పోషకాలు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పచ్చిగానే తీసుకుంటే పోషకాలు పూర్తిస్థాయిలో శరీరానికి అందుతాయని అంటున్నారు. అయితే, ఇలా అన్నిరకాల పదార్థాలను పచ్చిగా తీసుకోవడం కూడా ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు.

క్యారెట్ మాదిరిగా ముల్లంగిని పచ్చిగా తినకూడదు. ఇందులోని గాయిట్రోజెన్స్ అనే పదార్థం.. థైరాయిడ్ పనితీరుపై ప్రభావం చూపుతుంది. దీనిని నేరుగా తీసుకుంటే.. గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి.

పాలకూరలో ఆగ్జలేట్ ఎక్కువ. ఇది కిడ్నీలో రాళ్లను ఏర్పరుస్తుంది. అతిగా తీసుకుంటే.. మలబద్ధకం ఇబ్బంది పెడుతుంది.

కొన్ని కోడిగుడ్లలో సాల్మొనెల్లా అనే బ్యాక్టీరియా పెరుగుతుంది. వీటిని నేరుగా తీసుకోవడం వల్ల ఆహారం విషపూరితమయ్యే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా.. కడుపునొప్పి, వాంతులతోపాటు జ్వరం లాంటి లక్షణాలు కనిపించవచ్చు. కాబట్టి, కోడిగుడ్లను సరైన ఉష్ణోగ్రత వద్ద ఉడికించి తినడమే మంచిది. కొన్నిసార్లు హాఫ్ బాయిల్డ్ కూడా అనారోగ్యాన్ని కలిగించవచ్చు.

బీన్స్‌ను పచ్చిగా తీసుకుంటే.. కడుపులో హైడ్రోజెనిక్ యాసిడ్ ఉత్పత్తి అవుతుంది. ఫలితంగా.. వికారం, వాంతులు, విరేచనాలు ఇబ్బంది పెడతాయి.

ఆలుగడ్డల్లో సొలానిన్ అనే టాక్సిన్ ఉంటుంది. ఇది నరాల సమస్యలు, వికారం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలను కలగజేస్తుంది. కాబట్టి, ఆలుగడ్డలను ఉడికించి తినడమే బెటర్!

పచ్చిగా తినే అవకాశం ఉన్న కూరగాయలను కూడా ఎక్కువ మొత్తంలో తీసుకోవడం మంచిదికాదు. పరిమితికి మించి తీసుకుంటే.. కడుపు ఇన్ఫెక్షన్లు, అజీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఉడికించిన కూరగాయలతో పోలిస్తే.. పచ్చివి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. వీటిలోని పోషకాలను శరీరం నెమ్మదిగా గ్రహిస్తుంది. దాంతో జీర్ణక్రియ వేగం తగ్గుతుంది. కొన్నిరకాల కూరగాయల్లో యాంటి న్యూట్రియంట్ గుణాలు ఉంటాయి. అవి ఆహారంలో పోషకాల శోషణను పూర్తిగా నిరోధిస్తాయి. అలాంటి కూరగాయలను ఉడికించి తీసుకోవడమే మంచిది.

## హస్తకళాభరణం!

బంగారపు హంగులు లేవు. వెండికే సొంతమైన ధగధగల్లేవు. ముత్యాల మెరుపుల్లేవు. రత్నాల రాచ మర్యాదలూ లేవు. అయితేనేం, ఆ నగల వగలు చూడాల్సిందే. ధర తక్కువ. వైవిధ్యం ఎక్కువ. కళాత్మకతా అధికమే. ఏ చీర కట్టుకుంటే ఆ వన్నె హారం ధరించవచ్చు. అదే రంగు ఇయర్ రింగ్స్ సింగారించుకోవచ్చు. అంతేనా, ఎకోఫ్రెండ్లీ కూడా.



బంకమన్ను, గుడ్డ పేలికలు, పూసలు, దారాలు, సహజమైన రంగులు.. ఇవే ముడి సరుకు. హ్యాండ్ మేడ్ హారాలే కాదు.. జుంకాలు, ముక్కుపుడకలు, గాజులు కూడా లభిస్తాయి.



# నష్టాల్లోనే దేశీయ స్టాక్ మార్కెట్లు.. 528 పాయింట్లు పతనమైన సెన్సెక్స్..



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలతో పాటు విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, కార్పొరేట్ కంపెనీలు త్రైమాసిక ఫలితాల ప్రకటనల నేపథ్యంలో మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 78,206.21 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటిక సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 78,206.21 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. ఒక దశలో 77,542.92 పాయింట్ల కనిష్ఠానికి పతనమైంది. చివరకు స్వల్పంగా కోలుకుంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి 528.28 పాయింట్లు పతనమై.. 77,620.21 వద్ద ముగిసింది. నిఫ్టీ 162.45 పాయింట్లు తగ్గి 23,526.50 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో దాదాపు 1,175 లాభపడగా.. మరో 2,610 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఓ ఎ న్ జీ సీ , టాటా స్టీల్, కోల్ ఇండియా, బీపీసీఎల్ నష్టపోయాయి. హెచ్‌యూఎల్, బ్రిటానియా ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా, ఎంఅండ్ఎం, బజాజ్ ఆటో లాభపడ్డాయి. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా అన్ని సూచీలు.. ఐటీ, మెటల్, గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, పవర్, రియాల్టీ ఒకటి నుంచి రెండుశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక్కొక్కటి ఒకశాతం వరకు తగ్గుముఖం పట్టాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 85.86 వద్ద ఉన్నది.

# ఎంతసేపు భార్యను చూస్తూ ఉండిపోతారు..? ఆదివారాలు కూడా పనిచేయండి : ఎల్ అండ్ టీ చైర్మన్



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ స్థాయిలో ఇతర దేశాలతో భారత్ పోటీ పడాలంటే యువతరం వారానికి 70 గంటలు పని చేయాలని ఇన్ఫోసిస్ ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలు పెద్ద ఎత్తున చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను కొందరు సమర్థించగా.. చాలా మంది వ్యతిరేకించారు. తాజాగా ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ సైతం ఇదే తరహా వ్యాఖ్యలే చేశారు. అయితే, నారాయణమూర్తి కంటే ఆయన ఓ అడుగు ముందుకేసి.. వారానికి 90 గంటలు పనిచేయాలని తన ఉద్యోగులకు సూచించారు.తన ఉద్యోగులతో ఇంటరాక్షన్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని సూచించారు. అవసరమైతే ఆదివారాలు కూడా వదులుకోవాలన్నారు. ఎంతసేపు అలా భార్యను చూస్తూ ఉండిపోతారు..? అంటూ ప్రశ్నించారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని భార్యలతో చెప్పాలని ఉద్యోగులతో అన్నారు. 'ఆదివారాలు మీతో పనిచేయించలేకపోతున్నందుకు బాధపడుతున్నా. మీతో ఆదివారాలూ పనిచేయించగలిగితే నేను మరింత సంతోషంగా ఉంటాను. ఎందుకంటే నేను ఆదివారాలు కూడా పనిచేస్తున్నాను' అని ఉద్యోగులతో అన్నారు. సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.కాగా, ప్రపంచ స్థాయిలో ఇతర దేశాలతో భారత్ పోటీ పడాలంటే యువతరం వారానికి 70 గంటలు పని చేయయాలని ఇన్ఫోసిస్ ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. 'ప్రపంచంలోకెల్లా భారత్‌లోనే ఉత్పాదకత అతి తక్కువ. ఉత్పత్తిలో మన పని మెరుగు పర్చుకోలేకపోయినా, ప్రభుత్వంలో కొంత స్థాయి వరకూ అవినీతి తగ్గించకపోయినా.. అద్భుతమైన ప్రగతి సాధించిన దేశాలతో మనం పోటీ పడలేం' అని నారాయణ మూర్తి స్పష్టం చేశారు. 'నా యువతరానికి నేను చేసే రిక్వెస్ట్ ఒకటే.. 'ఇది నా దేశం. నా దేశం కోసం నేను వారానికి 70 గంటలు పని చేస్తాను' అని తప్పనిసరిగా ప్రతిజ్ఞ చేయాలి-అని నారాయణ మూర్తి చెప్పారు.

# మార్కెట్లోకి షియోమీ బడ్జెట్ 5జీ ఫోన్.. ధర ఎంతంటే?



**హైదరాబాద్-నవభూమి:** చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షియోమీ.. దేశీయ మార్కెట్లోకి చౌక ధరకలిగిన 5జీ స్మార్ట్‌ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రెడ్మీ నోట్ 14 సిరీస్‌లో భాగంగా విడుదల చేసిన ఈ స్మార్ట్‌ఫోన్ రూ.9,999 ప్రారంభ ధర కాగా, గరిష్ఠంగా రూ.11,999కి లభించనున్నది.

# మేక్‌మైట్రిప్ ప్రత్యేక ఆఫర్

## ఇంటర్నేషనల్ టికెట్లపై విడుతలవారిగా చెల్లింపులు




**న్యూఢిల్లీ-నవభూమి:** రవాణా సదుపాయాలు సమకూరుస్తున్న మేక్‌మైట్రిప్..కస్టమర్లను ఆకట్టుకోవడానికి వినూత్న ఆఫర్‌ను తెరపైకి తీసుకొచ్చింది. అంతర్జాతీయ ప్రయాణికులను ఆకట్టుకోవడంలో భాగంగా తమ ముందస్తు విమాన టికెట్ బుకింగ్ చేసుకున్నవారు ఒకేసారి చెల్లింపులు జరుపాల్సిన అవసరం లేదని, విడతలవారీగా చెల్లిస్తే సరిపోతున్నదని వెల్లడించింది. ముందస్తు బుకింగ్ చేసుకున్న సమయంలో విమాన టికెట్ చార్జిలో 10 శాతం నుంచి 40 శాతం మధ్యలో చెల్లిస్తే సరిపోతున్నదని, మిగతాది ప్రయాణానికంటే ముందు లేదా బుకింగ్ చేసుకున్న నాటినుంచి 45 రోజులు ఏది ముందువస్తే ఆ రోజు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించింది.

ఈ ఆఫర్‌ను ఎంచుకున్నవారు ఎలాంటి అదనపు చెల్లింపులు జరుపాల్సిన అవసరం లేదని పేర్కొంది. విమానయాన రంగంలో ఇలాంటి ఫీచర్ ప్రవేశపెట్టడం ఇదే తొలిసారని, ప్రయాణికులు తమ అంతర్జాతీయ రూట్లకోసం ఒకేసారి చెల్లింపులు జరుపాల్సి వస్తుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వీరికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ స్కీంను ప్రవేశపెట్టినట్లు మేక్‌మైట్రిప్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి సౌజన్య శ్రీవాత్సవ తెలిపారు.ముఖ్యంగా అతిపెద్ద కుటుంబాలు లేదా గ్రూపులు తమ అంతర్జాతీయ బుకింగ్‌లపై ఒకేసారి మొత్తం చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ కొత్త స్కీంతో వీరికి ప్రయోజనాలు కలుగనున్నాయన్నారు. ఎక్కువ మంది భారతీయులను అంతర్జాతీయ విమానాల బుకింగ్ చేసుకునేందుకు వీలుగా ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ స్కీంనకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించిందని, ఒంటరిగా, జంటలు, కుటుంబాలు అంతర్జాతీయ రూట్లలో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నదన్నారు.

# హ్యూమన్ మెటాప్‌న్యూమోవైరస్ (హెచ్ఎమ్‌పివి) లక్షనాలు మరియూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు



**న్యూఢిల్లీ-నవభూమి:** శ్వాసకోశ వైరస్లు ముఖ్యంగా చల్లని నెలలలో రోగులను ప్రభావితం చేస్తాయి. ఇన్‌ఫ్లుఎంజా, ఆర్ఎస్‌వి హ్యూమన్ మెటాప్‌న్యూమోవైరస్ (హెచ్ఎమ్‌పివి) వంటి ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి. వీటిలో, ముఖ్యంగా హాని కలిగించే జనాభాపై గణనీయమైన ప్రభావం ఉన్నప్పటికీ, హెచ్ఎమ్‌పివి తరచుగా విస్మరించబడుతుంది. క్లినికల్ కోణం నుండి మీరు ఈ వైరస్ గురించి తెలుసుకోవలసినది ఇక్కడ ఉంది.

**హెచ్ఎమ్‌పివి అంటే ఏమిటి?**

హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్, లేదా హెచ్ఎమ్‌పివి, 2001లో మొదటిసారిగా గుర్తించబడిన శ్వాసకోశ వైరస్. ఇది రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ (ఆర్ ఎస్ వి)కి చెందిన ఒకే కుటుంబానికి చెందినది మరియు అనేక వైద్యపరమైన సారూప్యతలను పంచుకుంటుంది. చాలా మంది వ్యక్తులు బాల్యంలో హెచ్ఎమ్‌పివికి గురవుతారు, 5 సంవత్సరాల వయస్సులో దాదాపు అన్ని పిల్లలు కనీసం ఒక్కసారైనా సోకినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. హెచ్ఎమ్‌పివి ప్రధానంగా దగ్గు, నాసికా రద్దీ, జ్వరం మరియు గొంతు నొప్పి వంటి ఎగువ శ్వాసకోశ లక్షణాలను కలిగిస్తుంది. అయినప్పటికీ, కొన్ని సమూహాలలో- చిన్నపిల్లలు, వృద్ధులు అంతర్లీన పరిస్థితులు ఉన్న వ్యక్తులతో సహా-ఇది బ్రోన్కియోలిటిస్, న్యుమోనియా మరియు అరుదైన సందర్భాల్లో శ్వాసకోశ వైఫల్యం వంటి తీవ్రమైన తక్కువ శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది.

**ఇది ఎలా వ్యాపిస్తుంది?**

అనేక శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగానే, సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు లేదా మాట్లాడినప్పుడు హెచ్ఎమ్‌పివి శ్వాసకోశ బిందువుల ద్వారా వ్యాపిస్తుంది. ఇది కలుషితమైన ఉపరితలాలను తాకడం ద్వారా ౹ ముఖాన్ని, ముఖ్యంగా కళ్ళు, ముక్కు లేదా నోటిని తాకడం ద్వారా కూడా వ్యాపిస్తుంది. వైరస్ దాదాపు 3-6 రోజుల పొదిగే వ్యవధిని కలిగి ఉంటుంది మరియు వ్యాధి సోకిన వ్యక్తులు అనారోగ్యం యొక్క తీవ్రమైన దశలో చాలా అంటువ్యాధిని కలిగి ఉంటారు.

**క్లినికల్ ప్రెజెంటేషన్ దయాగ్నోసిస్**

రోగనిర్ధారణ దృక్కోణం నుండి, ఒక సవాలును అందిస్తుంది ఎందుకంటే దాని లక్షణాలు ఇతర శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగానే ఉంటాయి. రోగులు నివేదించవచ్చు:

జ్వరం మరియు చలి

నిరంతర దగ్గు

నాసికా రద్దీ

౸ గురక లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది

తీవ్రమైన సందర్భాల్లో, ముఖ్యంగా రోగనిరోధక శక్తి లేని వ్యక్తులలో, లక్షణాలు హైపోక్సియా (తక్కువ ఆక్సిజన్ స్థాయిలు) తీవ్రమైన శ్వాసకోశ బాధకు దారితీస్తాయి. రోగనిర్ధారణ

తరచుగా పాలిమరేస్ చైన్ రియాక్షన్ (పి సి ఆర్) వంటి పరమాణు పరీక్షలను కలిగి ఉంటుంది, ఇది హెచ్ఎమ్‌పివి ని గుర్తించడానికి అత్యంత నమ్మదగిన పద్ధతి. అయినప్పటికీ, రోగి తీవ్ర అనారోగ్యంతో లేదా నిర్దిష్ట ఎపిడెమియోలాజికల్ అధ్యయనంలో భాగమైతే తప్ప హెచ్ఎమ్‌పివి కోసం సాధారణ పరీక్ష ఎల్లప్పుడూ నిర్వహించబడదు.

**చికిత్స నిర్వహణ**

ప్రస్తుతం, హెచ్ఎమ్‌పివికి నిర్దిష్ట యాంటీవైరల్ చికిత్స లేదా వ్యాక్సిన్ లేదు. నిర్వహణ ప్రధానంగా మద్దతునిస్తుంది లక్షణాల నుండి ఉపశమనం పొందడంపై దృష్టి పెడుతుంది:

౸ తేలికపాటి కేసులకు: జ్వరం రద్దీని తగ్గించడానికి విశ్రాంతి, ఆర్ద్రీకరణ ఓవర్-ది-కౌంటర్ మందులు సాధారణంగా సరిపోతాయి.

౸ తీవ్రమైన కేసుల కోసం: తీవ్రమైన సందర్భాల్లో అనుబంధ ఆక్సిజన్ లేదా మెకానికల్ వెంటిలేషన్‌ను అందించడానికి ఆసుపత్రిలో చేరడం అవసరం కావచ్చు.

**నివారణ వ్యూహాలు**

హెచ్ఎమ్‌పివి ఇతర శ్వాసకోశ వ్యాధుల విషయానికి వస్తే నివారణ కీలకం. ఇక్కడ అత్యంత ప్రభావవంతమైన చర్యలు ఉన్నాయి:

చేతుల పరిశుభ్రత: కనీసం 20 సెకన్ల పాటు సబ్బు మరియు నీటితో క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవాలి.

శ్వాస సంబంధిత మర్యాదలు: దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు మీ నోరు మరియు ముక్కును టిష్యూ లేదా మోచేయితో కప్పుకోండి.

ఉపరితలాలను క్రిమిసంహారక చేయండి: డోర్క్‌నాబ్‌లు ఫోన్‌ల వంటి హై-టచ్ ఉపరితలాలను తరచుగా శుభ్రం చేయండి.

**పరిచయాన్ని నివారించండి:** అనారోగ్యంతో ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండండి మరియు మీకు అనారోగ్యంగా అనిపిస్తే బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండండి.

డా.శ్రీనివాస్ చారి
అవేర్ గ్లెనిగల్స్ హాస్పిటల్- ఎల్‌బి నగర్

# వీక్షకులకు సూపర్ వాల్యూ టీవీ ప్యాక్‌లను పరిచయం చేస్తూ, 'సిర్ఫ్ లగే మెహెంగా' క్యాంపెయిన్‌ను ప్రారంభించిన టాటా ప్లే




**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశంలోని ప్రముఖ డైరెక్ట్ టు హోమ్ ప్రొవైడర్ టాటా ప్లే, కొత్త ఏడాది, పంటల, పండగల సీజన్‌ను పురస్కరించుకుని 'సిర్ఫ్ లగే మెహెంగా' (అనుకునేందుకే ధర ఎక్కువ) కేవలం అనే సరికొత్త క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. కుటుంబంలోని ప్రతి సభ్యుని ఎంపికలకు అనుగుణంగా, వినోదం, వార్తలు, క్రీడలు, సంగీతం, సినిమాలు, భక్తి, కిడ్స్, తదితర కళా ప్రక్రియలతో సహా విస్తృతమైన, బడ్జెట్-ఫ్రెండ్లీ, అధిక నాణ్యతతో కూడిన వినోద అనుభవాన్ని టాటా ప్లే తెలుగు సూపర్ వాల్యూ ప్యాక్ అందిస్తుంది.

ఓగిల్వీ తెరకెక్కించిన 'సిర్ఫ్ లగే మెహెంగా' క్యాంపెయిన్‌ను డీటీహెచ్ సేవలు ఖరీదైనవి అనే అపోహను హాస్యాస్పదంగా తొలగించే ఓవర్ స్టేట్‌మెంట్ పేరడీ చిత్రాల శ్రేణిని ప్రదర్శిస్తుంది. టాటా ప్లే ప్రపంచ స్థాయి వినోదాన్ని సరసమైన ధరకు ఎలా అందజేస్తుందో, రాజీలేని వీక్షణ అనుభవాన్ని ఎలా అందజేస్తుందో ఈ వాణిజ్య ప్రచార చిత్రాలు హైలైట్ చేస్తాయి. ఒత్తిడితో గోళ్లు కొరికే పరిస్థితులల్లోనూ హాస్యాన్ని పండించడం ద్వారా, టెలివిజన్‌లో అందుబాటులో ఉండే అసలైన, ప్రీమియం వినోదాన్ని కనుగొనడంలో ఉన్న ఆనందాన్ని ఈ వాణిజ్య చిత్రాలు వివరిస్తాయి. దేశవ్యాప్తంగా ఉన్న వీక్షకులను ఆకర్షించేందుకు వివిధ భాషల్లో ఈ క్యాంపెయిన్ అందుబాటులోకి వచ్చింది.

టాటా ప్లే భౌగోళికాలు, శ్రేణులు, ప్రాంతాలు, విభాగాల వ్యాప్తంగా ప్రేక్షకులకు విలువ-ఆధారిత వినోదాన్ని అందించడంలో సరికొత్త కొలమానాలను సెట్ చేస్తూనే ఉంది.

నెలకు రూ.255తో ప్రారంభమయ్యే ప్యాక్‌లతో, వీక్షకులు టాటా ప్లే వెబ్‌సైట్‌ని https://www.tataplay.com సందర్శించడం ద్వారా లేదా టాటా ప్లే మొబైల్ యాప్‌లోని నిర్వహణ విభాగాన్ని సందర్శించడం ద్వారా వారి ప్యాక్‌లను మార్చుకోవచ్చు లేదా ఎంచుకోవచ్చు. ఆఫర్‌ను పొందేందుకు వారు తమ ప్రాంతంలో సమీపంలో ఉన్న డీలర్లను కూడా సందర్శించవచ్చు.

# బిగ్ సి లో సంక్రాంతి ఆఫర్లు





**హైదరాబాద్-నవభూమి:** ప్రముఖ మొబైల్ రిటైల్ దిగ్గజం బిగ్''సి'.. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని ఆకర్షణీయమైన ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి మాట్లాడుతూ.. ఈ సంక్రాంతి సందర్భంగా ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ.10 వేల వరకు మొబైల్ ప్రొటెక్షన్‌తోపాటు రూ.5,999 విలువైన స్మార్ట్‌వాచ్, రూ.1,799 విలువైన ఎయిర్‌బడ్స్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు.

అలాగే ఇటీవల మార్కెట్లోకి వచ్చిన ఒప్పో రెనో 13 మొబైల్ కొనుగోళ్లపై రూ.7,990 విలువ కలిగిన స్విస్ మిలిటరీ స్పీకర్‌తోపాటు ఏడాదిపాటు మొబైల్ ప్రొటెక్షన్, రూ.5 వేల వరకు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్‌ను కూడా అందిస్తున్నట్లు చెప్పారు.

స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.15 వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్
బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51 శాతం డిస్కౌంట్
వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండానే మొబైల్ కొనుగోలు అవకాశం
ఐఫోన్ మొబైల్‌పై రూ.5 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్
వివో-ఒప్పో మొబైళ్ల కొనుగోలుపై 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్
వన్‌ప్లస్, రియల్‌మీ మొబైళ్లపై రూ.3 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్
ఎంఐ మొబైళ్లపై రూ.5 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్
ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండా మొబైళ్లు, స్మార్ట్‌టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలను కొనుగోలు చేయవచ్చును.

సింగరేణికి స్పెషల్ క్యాంపెన్ 4.0 పురస్కారం పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ అత్యధికంగా పరిసరాలను శుభ్రం చేసినందుకు సింగరేణి కాలరీస్ సంస్థకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.

# వాట్సాప్ యూజర్లకు గుడ్‌న్యూస్.. త్వరలోనే మరో మూడు ఫీచర్లు అందుబాటులోకి..!



**న్యూఢిల్లీ-నవభూమి:** మెటా యాజమాన్యంలో వాట్సాప్‌కు ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున యూజర్లు ఉన్నారు. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు యూజర్లను ఆకట్టుకునేందుకు కంపెనీ కొత్త కొత్త ఫీచర్లను పరిచయం చేస్తూ వస్తున్నది. గతేడాది ఏఐ సాంకేతికను జోడించి వాట్సాప్ రూపురేఖలనే మార్చేసింది. తాజాగా నూతన సంవత్సరంలో మరో మూడు ఫీచర్స్‌ను యూజర్లకు అందుబాటులోకి తీసుకురాబోతున్నది. మెటా ఏఐ ఫీచర్స్‌ను వాట్సాప్ సిద్ధం చేస్తున్నది. దీంతో వినియోగదారులకు మరింత సౌకర్యవంతంగా ఉండనున్నది.వాట్సాప్‌లో రాబోయే ఫీచర్లు ఇవే..

మెటా ఏఐ షార్ట్‌కట్ : మెటా ఏఐ చాట్‌బాట్‌లో ఇన్‌స్టంట్ యాక్సెస్ కోసం షార్ట్‌కట్ బటన్‌పై వాట్సాప్ పని చేస్తుంది. ఈ బటన్ సహాయంతో యూజర్లు మెటా ఏఐని ఉపయోగించి వారి సమస్యలను సులభంగానే పరిష్కరించుకోవచ్చు. అవసరమైన సలహాలను సైతం పొందేందుకు వీలుంటుంది. ఈ బటన్ ప్రస్తుతం చాట్‌ల ట్యాబ్‌లో అందుబాటులో ఉంటుంది. ఇది విజిబిలిటీని పెంచడంతో పాటు యూజర్లు సులభంగా యాక్సెస్ చేయొచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్ ఐఓఎస్‌లో టెస్టింగ్ దశలో ఉంది. త్వరలోనే మిగతా యూజర్లందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.మెటా ఏఐకి మెసేజ్ ఫార్వర్డింగ్ : ప్రస్తుతం మెటా ఏఐకి మెసేజ్ ఫార్వర్డ్ చేసే ఫీచర్‌పై వాట్సాప్ పని చేస్తుంది. ఈ ఫీచర్‌లో యూజర్లు మెటా ఏఐకి ఏదైనా మీడియా లేదంటే మెసేజ్‌ను పంపుకోవచ్చు. టెక్ట్స్‌ను కాపీ పేస్ట్ చేసుకోవచ్చు. స్పామ్ మెసేజ్‌లను చెక్ చేసుకొని చేసుకొని వెరిఫై చేసుకునేందుకు ఈ ఫీచర్ వినియోగదారులకు సహాయపడనున్నది. సరళంగా చెప్పాలంటే ఫ్యాక్ట్ చెకింగ్‌గా ఉపయోగపడనున్నది. ప్రస్తుతం ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ యూజర్లకు అభివృద్ధి చేస్తున్నది. త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.మెటా ఏఐ చాట్ మెమరీ : మెటా వాట్సాప్‌లో ఏఐని మరింత దగ్గర చేసుందుకు చాట్ మెమొరీ ఫీచర్‌ను తీసుకువస్తున్నది. దీంతో పర్సనల్ అసిస్టెన్స్ మెరుగవనున్నది. యూజర్లు ఏఐని అడిగిన ప్రశ్నలను గుర్తుంచుకుంటుంది. యూజర్లు ఏ సమయంలో ఏం తింటారు.. ఎలాంటి వస్తువులను ఇష్టపడుతున్నారనే.. అయిష్టాలు ఏమున్నాయనే అనే విషయాలను గుర్తుంచుకుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని గుర్తుంచుకొని.. ఎప్పుడైనా మళ్లీ ప్రశ్నలు అడిగిన సమయంలో డేటా సహాయంతో సమాధానం ఇస్తుంది.

# సింగరేణికి స్పెషల్ క్యాంపెన్ 4.0 పురస్కారం



**హైదరాబాద్:-నవభూమి:** పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ అత్యధికంగా పరిసరాలను శుభ్రం చేసినందుకు సింగరేణి కాలరీస్ సంస్థకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్రప్రభుత్వం నిర్వహించిన 'స్పెషల్ క్యాంపెన్ 4.0' పురస్కారం వరించింది.ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్‌కు కేంద్ర బొగ్గుశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి ఈ అవార్డును అందజేశారు. 2024 అక్టోబర్ 2 నుంచి అక్టోబర్ 31 వరకు స్పెషల్ క్యాంపెన్ 4.0లో భాగంగా సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో 216 ప్రదేశాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు.

# ఉన్నట్టుండి పెరిగిన బంగారం ధర.. సడన్ షాక్ ఇచ్చిందిగా..



**న్యూఢిల్లీ-నవభూమి:** గతేడాది బంగారం ధరలు కాస్త తగ్గుతూ వచ్చాయి. దీంతో మహిళలతో పాటు గోల్డ్ లవర్స్ కొనుగోళ్లకు చాలా ఆసక్తి చూపించారు. కొత్త ఏడాది పసిడి మరింత దిగొస్తుందని భావించారు. కొని దాచుకోవాలని భావించారు. మ్యారేజ్ సీజన్ సమయంలో ధరలు కొండెక్కుతాయి కాబట్టి ఇప్పుడే కొనేస్తే బెటర్ అని భావించారు. కానీ పసిడి తగ్గేదేలే అంటూ పరుగులు పెడుతోంది. కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి కూడా గోల్డ్ రేట్స్ భారీగా పెరుగుతూ వస్తున్నాయి. ఇవాళ కూడా ధరలు పెరిగాయి. ఉన్నట్టుండి ఒక్కసారిగా కొండెక్కింది గోల్డ్. ప్రస్తుతం బంగారం ధరలు ఎంత ఉన్నాయి? గోల్డ్ రేట్స్ పెరగడానికి గల కారణాలు ఏంటి? అనేది ఇప్పుడు మనం చూద్దాం..

**గోల్డ్ పైకి.. సిల్వర్ కిందకు..!**

నాల్రోజుల తర్వాత గోల్డ్ రేట్స్ స్వల్పంగా పెరిగాయి. హైదరాబాద్‌లో జనవరి 9, గురువారం ఉదయం చూసుకుంటే.. 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.100 పెరిగి.. రూ.72 వేల 250 దగ్గరకు చేరింది. అదే 24 క్యారెట్ల స్వచ్ఛమైన పసిడి రేటు రూ.110 పెరిగి తులం రూ.78 వేల 820 పలుకుతోంది. తగ్గుతూ పోతున్న గోల్డ్ మళ్లీ ఊపందుకోవడానికి అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులే కారణమని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ఇక, బంగారం ధరలు పెరిగినా.. వెండి మాత్రం స్థిరంగా కొనసాగుతూ సిల్వర్ లవర్స్‌ను ఆకర్షిస్తోంది. ఇవాళ హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,00,000 వద్ద ట్రేడింగ్ అవుతోంది.

# పసిడి దిగుమతుల్లో కోత



**న్యూఢిల్లీ-నవభూమి:** పసిడి దిగుమతుల డాటాను కేంద్ర ప్రభుత్వం సవరించింది. నవంబర్ నెలలో 5 బిలియన్ డాలర్ల బంగారం మాత్రమే దిగుమతైందని వెల్లడించింది. గతంలో 9.84 బిలియన్ డాలర్లు అయినట్లు తెలిపింది.ఇన్‌బౌండ్ షిప్‌మెంట్‌లో డబుల్ అకౌంటింగ్‌ను సరిచేయడం వల్లనే దిగుమతులు తగ్గాయని కేంద్ర వాణిజ్యమంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. అలాగే ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఎనిమిది నెలల్లో దిగుమతులు కూడా 11.7 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు తెలిపింది.




నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7 హైదరాబాద్
శుక్రవారం
10 । జనవరి । 2025


## భారత భూభాగాన్ని ఎవరూ ఆక్రమించలేదు: బీఎస్ఎఫ్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ సరిహద్దు వెంబడి 5 కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని బంగ్లాదేశ్ ఆక్రమించిందన్న వార్తలను భారత సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎస్) కొట్టిపారేసింది. బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (బీజీబీ) దళాలు 5 కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయంటూ బంగ్లా మీడియాలో వార్తలు వచ్చాయి. అవన్నీ పూర్తిగా బాధ్యతారహిత, నిరాధారమైన కట్టు కథలని బీఎస్ఎఫ్ పేర్కొంది. "ఉత్తర 24 పరగణాల జిల్లా, రాంఘాట్ గ్రామంలోని బాగ్దా బ్లాక్‌లో ఉన్న భూభాగంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు కొడలియా నదీ తీరం నుంచి వెళుతుంది. ఇరువైపులా కచ్చితమైన హద్దులను గుర్తించి స్తంభాలు పాతి, కంచె వేసి ఉంది. ఈ సరిహద్దు వెంట బీఎస్ఎఫ్ గస్తీలో ఎలాంటి మార్పు జరగలేదు" అని బీఎస్ఎఫ్ అధికారిక ప్రకటనలో తెలిపింది. భారత భూభాగాన్ని ఎవరూ ఒక్క అంగుళం కూడా తీసుకోలేదని, తీసుకోలేరని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్‌కు చెందిన మీడియాలోని కొన్ని వర్గాలు కల్పిత కథనాలను ప్రచారం చేస్తున్నాయని ఆరోపించింది.

## ఈసారి రిపబ్లిక్ డే పరేడ్‌కు.. 10 వేల మంది ప్రత్యేక అతిథులు



**న్యూఢిల్లీ-నవభూమి:** 2025 రిపబ్లిక్ డే పరేడ్ ఈ ఏడాది మరింత ప్రత్యేకంగా ఉండనుంది. ప్రజలతో మరింత చేరువ అయ్యేందుకు ఈసారి 10 వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు. ఈ ప్రత్యేక ఆహ్వానితులలో వివిధ రంగాల నుంచి వచ్చిన వారు ఉన్నారు.

ఈసారి రిపబ్లిక్ డే 2025 సందర్భంగా ఢిల్లీలోనిర్వహించనున్న పరేడ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో 10 వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు. ఈ ప్రత్యేక ఆహ్వానం జాతీయ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో తీసుకున్నారు. భారతదేశంలోని వివిధ రంగాలలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన వారిని పరేడ్‌కు ఆహ్వానించారు. దీంతో ఆయా ప్రభుత్వ పథకాలలో విజయాలు సాధించిన వారు ప్రజల ముందుకు వచ్చే అవకాశాన్ని కల్పిస్తుంది. దీంతో న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో 76వ గణతంత్ర దినోత్సవ కవాతునువీక్షించడానికి 10 వేల మంది ప్రత్యేక గెస్టులు రానున్నారు.

10 వేల ప్రత్యేక అతిథులలో వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు ఉంటారు. ఇందులో సర్పంచ్‌లు, స్వయం సహాయక బృందం సభ్యులు, చేతివృత్తులవారు, విపత్తు సహాయ కార్యకర్తలు, ఆహార సేకరణలో పాల్గొనేవారు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన వ్యక్తులు, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, తదితరులు ఉండటం విశేషం. ఈ నిర్ణయం ద్వారా వ్యక్తులు తమ బృందంతో కలిసి వచ్చినప్పుడు, సామాజిక సేవలో భాగస్వామ్యం చూపించి, అనేక ఇతర రంగాల్లో చేసిన గణనీయమైన కృషికి మరింత ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

**దీంతోపాటు వీరికి కూడా..**

ఈసారి రిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాల్లో తమదైన ప్రావీణ్యాన్ని, ప్రతిభను చూపిన వారికి ప్రత్యేక గౌరవం ఇవ్వబడుతుంది. వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలలో ప్రతిభ కనబరిచిన వ్యక్తులు ఆహ్వానితులుగా ఉంటారు. అలాగే పారాలింపిక్స్ గెలిచిన అథ్లెట్లు, అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌ల విజేతలు, పేటెంట్ హోల్డర్లు, స్టార్టప్‌లు, పాఠశాల పోటీల విజేతలు కూడా ఈ పరేడ్‌లో పాల్గొంటారు.

**ఢిల్లీకి రాని వారికీ అవకాశం**

ఇప్పటికే ఢిల్లీకి రాని, అట్టడుగు స్థాయిలో గొప్ప కృషి చేస్తున్న వ్యక్తులకు ఈసారి ప్రాధాన్యం ఇవ్వబడింది. వారు దేశం అభివృద్ధిలో తమ పాత్రను మరింత బలంగా చూపించే అవకాశం పొందుతారు. ఈ అద్భుతమైన అవకాశంలో వారు నేషనల్ వార్ మెమోరియల్, %ూవీ% మ్యూజియం వంటి ఐకానిక్ సైట్‌లను సందర్శించగలుగుతారు. అలాగే సీనియర్ మంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేయబడతాయి. ఇది వారికి తమ అనుభవాలను పంచుకునే ఒక మంచి అవకాశంగా నిలుస్తుంది.

**రాష్ట్రాల ప్రదర్శన**

2025 రిపబ్లిక్ డే పరేడ్ కోసం 15 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు ఎంపిక చేయబడ్డాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్, బీహార్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ, డామన్ దయ్యూ, గోవా, గుజరాత్, హర్యానా, జార?ండ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, పంజాబ్, త్రిపుర, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఉన్నాయి. ఈ రాష్ట్రాలు తమ సంస్కృతిని, ఆచారాలను, ప్రగతిని ప్రజల ముందుకు తీసుకురానున్నాయి.

**కేంద్ర ప్రభుత్వ విభాగాల ప్రదర్శన**

ఈ సంవత్సరం, కేంద్ర ప్రభుత్వానికి చెందిన 11 మంత్రిత్వ శాఖలు/విభాగాలు కూడా ప్రత్యేక ప్రదర్శన కోసం ఎంపిక చేయబడ్డాయి. వీటిలో వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, మానవ వనరులు, నైపుణ్యాభివృద్ధి, రవాణా, గ్రామీణాభివృద్ధి, ఇతర ముఖ్యమైన విభాగాలు పాల్గొంటాయి.

ఈ సందర్భంగా భారతదేశం అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో, సమగ్ర అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నట్లు ఈ కార్యక్రమం ప్రపంచానికి తెలియజేస్తోంది. 2025 రిపబ్లిక్ డే పరేడ్ వేదికగా, ప్రజల మధ్య సమాజసేవా, కృషి, దేశభక్తి కొత్త అర్థాలు వెలుగులోకి రానున్నాయి.

## ప్రైవేటు బస్సుల్లో 'పొంగల్' దోపిడీ..



**చెన్నై-నవభూమి:** పొంగల్ పండుగను అడ్డుపెట్టుకుని ప్రైవేటు బస్సులు ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. పండుగ రద్దీని క్యాష్ చేసుకునేలా ఇష్టానుసారంగా చార్జీలను వసూలు చేస్తున్నాయి. చెన్నై - తిరునెల్వేలి( మధ్య ఏకంగా రూ.4 వేలు చార్జీ వసూలు చేయడం గమనార్హం. దీనిని చూసిన ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. సాధారణంగా పొంగల్, దీపావళి పండుగలకు నగర వాసులు తమ సొంతూళ్లకు వెళ్తుంటారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు బస్సులతో పాటు రైళ్ళన్నీ రద్దీతో నడుస్తున్నాయి.అయితే, ఈ రద్దీ సమయంలో ప్రైవేటు బస్సు యాజమాన్యాలు ఇష్టానుసారంగా చార్జీలను వసూలు చేస్తుంటాయి. ఈ యేడాది పొంగల్ పండుగకు సొంతూర్లకు వెళ్ళేవారి కోసం ఈ నెల 10, 11, 12, 13వ తేదీల్లో రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. అయితే, ప్రభుత్వ బస్సుల్లో రిజర్వేషన్లు ఫుల్ అవడంతో అనేక మంది ప్రైవేటు బస్సుల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు.%దీన్ని అవకాశంగా తీసుకున్న ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు అధిక మొత్తంలో చార్జీ వసూలు చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన చెన్నై నుంచి మదురైకు రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. ఏసీ సీటింగ్ బస్సుల్లో రూ.3 వేలు, ఏసీ స్లీపర్ క్లాస్ బస్సుల్లో రూ.4 వేలు వసూలు చేస్తున్నారు. చెన్నై నుంచి నెల్లైకు రూ.4 వేలు, చెన్నై - తూత్తుకుడి(కి మధ్య ఏసీ సీటింగ్ రూ.3 వేలు, స్లీపర్ రూ.4 వేలు వసూలు చేస్తున్నారు.తిరుచ్చికి రూ.2,500, తెన్‌కాశితో పాటు పలు ప్రాంతాలకు రూ.3వేలు కోయంబత్తూరు, పొల్లాచ్చి, తిరుపూరు ప్రాంతాలకు అయితే ఏకంగా రూ.5 వేలు వరకు వసూలు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో కేవలం రూ.1000 నుంచి రూ.1500 మాత్రమే వసూలు చేస్తుండగా, ఇపుడు మాత్రం రెట్టింపు చార్జీలను వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.

## వాతావరణశాఖకు 150 ఏళ్లు..




**చెన్నై-నవభూమి:** వర్షాల తిప్పలు, తుఫాను ముప్పుల గురించి నిత్యం మనల్ని హెచ్చరించి, అప్రమత్తం చేసే భారత వాతావరణ శాఖ (ఐఎండీ) 150వ వర్షంలోకి అడుగు పెట్టింది. ఈ వార్షిక వేడుకలు కొళత్తూర్‌లోని ఎవర్విన్ పాఠశాల ప్రాంగణంలో పాఠశాల యజమాన్యం, చెన్నై ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జరిగాయి.. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్, ప్ల కార్డులతో అవగాహన నిర్వహించారు. ముందుగా భారత వాతావరణ పరిశోధన శాఖ రూపొందించిన ప్రత్యేక గీతానికి విద్యార్థులు నృత్యం చేశారు.

వాతావరణం పర్యవేక్షించే ఉపకరణాలు, వెదర్ స్టేషన్(%ఔమ్ఫ్ట్రవతీ ర్ఫ్ఱశీఅ%) తదితరాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటైంది. అనంతరం సుమారు 400 మంది విద్యార్థులు వాతావరణ పరిశోధన కేంద్రం లోగోతో కూడిన టీ-షర్ట్, టోపీ ధరించి సుమారు కి.మీ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం డైరెక్టర్ ఎస్.బాలచంద్రన్, ఎవర్విన్ పాఠశాలల గ్రూప్ సీఈఓ మహేశ్వరి, సీనియర్ ప్రిన్సిపాల్ పురుషోత్తమన్, డైరెక్టర్లు విద్య, మురళీకృష్ణ సహా పలువురు పాల్గొన్నారు.


## మార్చిలోగా 'వారందరికీ' రూ.1000 ఇస్తాం..



**చెన్నై-నవభూమి:** కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న గృహిణులందరికీ మార్చిలోగా రూ.1000 చెల్లించనున్నట్లు బుధవారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం ఉదయనిధి(సభ్యుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో వేడచందూరు ఎమ్మెల్యే గాంధీరాజన్ దిండుగల్ జిల్లాల్లో కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం కింద లబ్దిపొందనున్న గృహిణుల సంఖ్య వెల్లడించాలని కోరారు.

ప్రత్యేక పథకాల మంత్రిత్వ శాఖ కూడా నిర్వర్తిస్తున్న డిప్యూటీ సీఎం సమాధానమిస్తూ... దిండుగల్ జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 5లక్షల 27 మందికిగాను 4లక్షల 897 మందికి ప్రతినెలా రూ.1000లను చెల్లిస్తున్నట్లు తెలిపారు. వేడచందూరు నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా 62 వేలమంది గృహిణులు లబ్దిపొందుతున్నారని, ఇక రాష్ట్రమంతటా కోటి 63లక్షల 57వేల 195 మంది దరఖాస్తు చేయగా, వాటిలో కోటి 6 లక్షల 52 వేల 198 మందికి నగదు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో కొత్తగా దరఖాస్తు చేసిన గృహిణులకు కూడా వచ్చే మార్చిలోపున ప్రతినెలా రూ.1000లను చెల్లించనున్నామని తెలిపారు.

## మహాకుంభ మేళాలో పాల్గొననున్న సినీ తారలు.. ఎవరెవరంటే..



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన మహాకుంభ మేళా 2025 ఈసారి జనవరి 13న ప్రారంభమై ఫిబ్రవరి చివరివారంలో ముగియనుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్ నగరంలో జరగనున్న ఈ మహాకుంభ మేళా, ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించబడే అత్యంత విశేషమైన మతపరమైన కార్యక్రమంగా నిలిచింది. ఈ వేడుకకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్న నేపథ్యంలో దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లను భారీగా నిర్వహిస్తున్నారు.

**లక్షలాది మంది భక్తులు**

ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు ఈ మహాకుంభంలో పాల్గొని తమ మొక్కులను చెల్లించుకుంటారు. అయితే 2025 మహాకుంభంలో అందరికీ కాకుండా ప్రముఖ వ్యక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా బాలీవుడ్, సౌత్ ఇండస్ట్రీ, నటీనటులు కూడా ఈ మహాకుంభంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈసారి మహాకుంభ మేళాలో భారీ సంఖ్యలో ప్రముఖుల హాజరుకి అంగీకారం తెపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పలువురు ప్రముఖుల పేర్లు వెలుగులోకి వచ్చాయి. వాటిలో బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్, యువ హీరో రణబీర్ కపూర్, హీరోయిన్ అలియా భట్, నటి రాఖీ సావంత్, ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవ్ సహ తదితరులు ఉన్నారు. ఈ తారలు 2025 మహాకుంభ మేళాలో గంగానదిలో స్నానానికి ప్రయాగ్‌రాజ్ రానున్నారు.

**అత్యంత విశిష్టమైనది**


ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్ అనే నాలుగు పవిత్ర స్థలాలలో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే మహాకుంభ్ భారతదేశంలోని అతిపెద్ద మతపరమైన కార్యక్రమాలలో ఒకటి. అయితే వీటన్నింటిలో ప్రయాగ్‌రాజ్ మహాకుంభం అత్యంత విశిష్టమైనది. ఈ విశ్వాసం, సంస్కృతి, సంప్రదాయాల సంగమం ఈసారి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించబడుతోంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ మహాకుంభానికి నిత్యం కోట్లాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు.

**ప్రముఖుల కోసం ప్రత్యేక శిబిరాలు**

ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహాకుంభ మేళా ఈసారి మరింత విశిష్టంగా ఉండబోతున్నది. అందులో ప్రముఖులకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఇందులో భాగంగా వీరికి అధిక స్థాయి భద్రతా ఏర్పాట్లు కూడా ఉన్నాయి. సౌకర్యవంతమైన ఆహారం, నిద్ర, సంరక్షణ, భద్రత వంటి అన్ని విధాల ఏర్పాట్లు చేశారు.

ప్రయాగ్‌రాజ్ మహాకుంభ మేళా అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం కావడంతో భద్రతా చర్యలు అత్యంత సవాలుగా తీసుకుంటున్నారు. కోట్లాది మంది భక్తులు హాజరయ్యే నేపథ్యంలో పలు భద్రతా బృందాలు, ఫాస్ట్-మొబైల్ యాప్స్, 24/7 హెల్ప్‌లైన్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. రవాణా, ట్రాఫిక్, రద్దీ నిర్వహణ, భద్రత కోసం ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి.

## వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుందని.. మేనకోడలి రిసెప్షన్‌లో ఏం చేశాడంటే..!



**కొల్హాపూర్-నవభూమి:** పుట్టినప్పటి నుంచి పెంచి పెద్ద చేసిన కూతురు చెప్పాపెట్టకుండా ఎవరినో పెళ్లి చేసుకుంటే పెద్దవాళ్ల రియాక్షన్ ఎలా ఉంటుందో చెప్పక్కర్లేదు. కొందరు ఎలాగు జరిగిపోయినదాన్ని మార్చలేం అని దగ్గరకు తీసుకుంటే.. ఇంకొందుకు పరువు పోయిందని దాడి చేయడంలాంటి ఘటనలు ఎక్కడోక చోట జరుగుతూనే ఉంటాయి. ఇంచుమించూ ఇలాంటి ఘటనే ఒకటి ఇటీవల మహారాష్ట్రలో జరిగింది. చిన్నప్పటి నుంచి పెంచి పెద్ద చేసిన మేనకోడలు వేరే వాళ్లని పెళ్లి చేసుకోవడంతో రగిలిపోయిన ఓ మేనమామ.. దుర్మార్గానికి తెగబడ్డాడు. పెళ్లి చేసుకుని ఇంటికి తిరిగొచ్చిన యువతి కోసం కుటుంబసభ్యులు ఏర్పాటు చేసిన రిసెప్షన్‌లో నానా హంగామా సృష్టించాడు. కోపంలో సహనం, విచక్షణ కోల్పోయి అతిథుల కోసం తయారు చేస్తున్న ఆహారంలో విషం కలిపి సామూహిక హత్యకు పాల్పడేందుకు ప్రయత్నించాడు. కార్యక్రమానికి హాజరైన ఓ వ్యక్తి అనుకోకుండా ఈ దృశ్యం చూడటంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. పూర్తి వివరాల్లోకి వెళితే..

మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో ఉత్రే గ్రామంలోని మేనమామ మహేశ్ పాటిల్ ఇంట్లో పెరిగిన ఆ యువతి చెప్పా పెట్టకుండా వేరే వ్యక్తితో పారిపోయి పెళ్లిచేసుకుంది. తమ ఇష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకున్నా కుటుంబసభ్యులు అయిష్టంగానే రిసెప్షన్ ఏర్పాటు చేశారు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన మహేష్ మేనకోడలు వివాహ రిసెప్షన్‌లో అల్లకల్లోలం సృష్టించాడు. కళ్యాణమండపానికి గేట్లు పడగొట్టి లోపలికి వెళ్లి ఆమె వివాహాన్ని వ్యతిరేకిస్తూ కేకలు వేశాడు. తర్వాత అతిథుల కోసం సిద్ధం చేసిన భోజనాల్లో విషం కలుపుతుండగా.. దూరం నుంచి చూసిన కొందరు వ్యక్తులు చూసి గట్టిగా అరవడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఇది తెలిసిన వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, " పాటిల్ ఇంట్లో పెరిగిన యువతి గ్రామానికి చెందిన వేరే వ్యక్తితో పారిపోయి పెళ్లి చేసుకుంది. ఇది మేనమామ పాటిల్‌కు నచ్చక కళ్యాణమండపం వద్ద వివాహ రిసెప్షన్ వేడుకను గేట్ క్రాష్ చేసాడు. అతిథుల కోసం వండిన ఆహారంలో విషాన్ని కలిపాడు. కోపంతో ఈ అరాచకానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. సమయానికి అసలు విషయం తెలియడంతో విషపూరితమైన ఆహారాన్ని ఎవరూ తినలేదు. వ్యక్తుల ప్రాణాలకు హాని కలిగించారనే ఆరోపణలపై కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు పోలీసులు.

## ఆ మూడు గ్రామాల్లో.. బట్టతల వైరస్..



**ముంబై-నవభూమి:** జుట్టు అంటే అందరికీ అపురూపమే. అందమైన, ఒత్తైన జుట్టు కోసం రకరకాల ప్రయత్నాలు చేయడం మామూలే. కాస్త హెయిర్ ఫాల్ కనిపించినా అస్సలు తట్టుకోలేరు. ఆందోళనతో రకరకాల ఆయిల్స్, షాంపూలు మార్చేస్తూ జుట్టు కాపాడుకునే చిట్కాల కోసం వెతుకుతారు. నిజానికి వెంట్రుకలు రాలిపోవడానికి, పల్చబడటానికి లైఫ్‌స్టైల్, కాలుష్యం, ఒత్తిడి లాంటి ఎన్నో కారణాలున్నాయి. వంశపారంపార్యంగా చాలా మంది బట్టతల సమస్యతో బాధపడుతూ ఉంటారు. కానీ, మీకు పై సమస్యలేవీ లేకపోయినా ఉన్నపళంగా జుట్టంతా రాలిపోతే.. అదీ వారం రోజుల్లో. ఇలా ఒకరు లేదా ఇద్దరికి జరిగితే ఎవరూ పెద్దగా పట్టించుకోరు. ఒకే సమయంలో వందలమందికి ఇలాంటి సమస్యే ఎదురైతే.. అది వింతే. ఇలాంటి విచిత్రమైన ఘటనే మహారాష్ట్రలో జరిగింది. స్త్రీలు, పురుషులు అనే తేడా లేకుండా మూడు గ్రామాల్లో నివసించే ప్రజలందరికీ విపరీతంగా జుట్టురాలిపోతోంది. ఒక వ్యక్తికి అయితే, ఏకంగా వారంలోనే బట్టతల వచ్చేసింది. ఈ ఉదంతం చూసి అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏ చేస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందో తెలీక టెన్షన్ పడుతున్నారు. ఇంతకీ, ఆ 3 గ్రామాల ప్రజలకు హఠాత్తుగా జుట్టు ఎందుకు రాలిపోతోంది. బట్టతల వైరస్‌లా ఎందుకు వ్యాపిస్తోందంటే..

మహారాష్ట్ర బుల్దానా జిల్లాలోని మూడు గ్రామాల్లోని ప్రజల్లో అకస్మాత్తుగా జుట్టు రాలే సమస్య మొదలైంది. గత కొన్నాళ్లుగా అక్కడ నివసించే ప్రతి ఒక్కరినీ ఈ సమస్య పట్టి పీడిస్తోంది. ఒక వ్యక్తికి వారంలోనే ఉన్న జుట్టంతా ఊడిపోయి బట్టతల వచ్చేసింది. దీంతో బోర్గావ్, కల్వాడ్, హింగ్నా ప్రజల్లో భయం నెలకొంది. ఎందుకిలా వెంట్రుకల కుదుళ్లు బలహీనంగా మారి విపరీతంగా రాలిపోతున్నాయో అక్కడి వారికి అర్థం కాక ప్రభుత్వ ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వెంట్రుకలు రాలే సమస్య అందరిలో వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో దీన్ని 'బట్టతల వైరస్' అని పిలుస్తున్నారు స్థానికులు.ప్రజల అభ్యర్థన మేరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించారు. వారంలోనే బట్టతల వచ్చిన వ్యక్తిని, ఇదే సమస్యతో బాధతో పడుతున్న మరో 50 మందిని పరిశీలించారు. ఈ ఘటనపై ఆరోగ్య బృందంలో షెగావ్ ఆరోగ్య అధికారి డాక్టర్ దీపాలి రహేకర్ మాట్లాడుతూ.. ఈ సమస్య మరికొందరికి వచ్చే ప్రమాదముం దని తెలిపారు. బహుశా ఎరువుల వల్ల కలుషితమైన నీరు, ఆరోగ్య సమస్యలు ఇందుకు కారణం కావచ్చని వెల్లడించారు. బాధితుల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపిం చామని చెప్పారు. ఈ ఫలితాలు ఆధారంగా త్వరమైన కచ్చితమైన కారణాన్ని గుర్తించి తెలియజేస్తామని అన్నారు.

## ఆడ దోమల అంతానికి.. మగ దోమల్లో విష జన్యువు



**సిడ్నీ-నవభూమి:** రాజును చంపడానికి విలన్ విషకన్యని ప్రయోగించే కథ చాలా సినిమాల్లో చూశాం. అదే టెక్నిక్‌తో.. ఆడ దోమలను అంతం చేసేందుకు ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు 'టాక్సిక్ మేల్ టెక్నిక్' పేరుతో ప్రయోగాలు చేస్తున్నారు. అందులో భాగంగా.. మగ దోమల వీర్యాన్ని విషపూరితం చేసే జన్యువును వాటిలో ప్రవేశపెడుతున్నారు. ఆ విషపూరిత దోమలు ఆడదోమలతో కలిసినప్పుడు.. వాటి వీర్యంలో ఉండే విష ప్రొటీన్లు సదరు ఆడదోమల ఆరోగ్యం క్రమంగా క్షీణించిపోయేలా చేసి చివరికి వాటిని చంపేస్తుందన్నమాట. ఏటా దోమ కాటు కారణంగా ప్రపంచవ్యాప్తంగా 39 కోట్ల మంది డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి జ్వరాల బారిన పడుతున్నారు. ఈ వ్యాధులు ఆడదోమల వల్లే వ్యాపిస్తాయి. దీంతో ఆడ దోమలను చంపేందుకు ఆస్ట్రేలియా శాస్త్రజ్ఞులు ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఇలా జన్యుమార్పిడి చేసిన మగదోమలతో కలిసిన ఆడదోమల జీవితకాలం 60 శాతం మేర తగ్గిపోతున్నట్టు గుర్తించామని వారు వెల్లడించారు. ఆడదోమల జీవితకాలం 60న్న తగ్గినా.. దోమకాటు బాధితుల సంఖ్య తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## పొంగల్ ప్రత్యేక రైళ్లు.. ఎక్కడినుంచి ఎక్కడివరకంటే..



**చెన్నై-నవభూమి:** పొంగల్ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06569 బెంగళూరు-తూత్తుకుడి ప్రత్యేక రైలు ఈ నెల 10వ తేది బెంగళూరులో రాత్రి 10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11 గంటలకు తూత్తుకుడి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06570 తూత్తుకుడి-మైసూరు ప్రత్యేక రైలు ఈ నెల 11వ తేది తూత్తుకుడిలో మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు మైసూరు చేరుకుంటుంది.

- నెం.07319 బెంగళూరు-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 10వ తేది బెంగళూరులో ఉదయం 8.05 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.20 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.07320 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-బెంగళూరు ప్రత్యేక రైలు ఈ నెల 10వ తేది చెన్నై సెంట్రల్‌లో మధ్యాహ్నం 3.40 గంటలకు బయల్దేరి రాత్రి 10.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

- నెం.06058 తిరువనంతపురం సెంట్రల్-చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 15వ తేది తిరువనంతపురం సెంట్రల్‌లో ఉదయం 4.25 గంటలకు బయల్దేరి రాత్రి 11 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06059 చెన్నై సెంట్రల్-తిరువనంతపురం సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 16వ తేది చెన్నై సెంట్రల్‌లో అర్ధరాత్రి 1 గంటకు బయల్దేరి రాత్రి 10 గంటలకు తిరువనంతపురం చేరుకుంటుంది.

- నెం.06046 ఎర్నాకుళం జంక్షన్- చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 16వ తేది ఎర్నాకుళంలో సాయంత్రం 6.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు చెన్నై చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06047 చెన్నై సెంట్రల్-ఎర్నాకుళం ప్రత్యేక రైలు ఈ నెల 17వ తేది చెన్నై సెంట్రల్‌లో ఉదయం 10.30 గంటలకు బయల్దేరి రాత్రి 11 గంటలకు ఎర్నాకుళం జంక్షన్ చేరుకుంటుంది.

**16 బోగీలతో వందే భారత్ రైలు...**

చెన్నై ఎగ్మూర్-తిరునల్వేలి మధ్య నడుపుతున్న వందే భారత్ రైలు 16 బోగీలతో నడుపనున్నారు. ప్రస్తుతం ఈ రైలు 7 ఏసీ ఛైర్ కార్ బోగీలు, ఎగ్జిక్యూటివ్ కార్ మొత్తం 8 బోగీలతో నడుపుతున్నారు. ఈ రైలు ప్రయాణికుల ఆదరణ పెరగడంతో, వెయిటింగ్ భారీగా ఉంటోంది. ఈ విషయమై దక్షిణ రైల్వే సిఫారసులతో ఈ రైలు 16 బోగీలతో నడిపేందుకు రైల్వే శాఖ అంగీకారం తెలిపింది. ఈ నెల 11వ తేది నుంచి ఈ రైలు 16 బోగీలతో నడుస్తుందని అధికారులు తెలిపారు.



## డాకుమహారాజ్ సెట్స్‌లో బాలకృష్ణను హత్తుకొని ఏడ్చేసిన చిన్నారి

నందమూరి బాలకృష్ణ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న చిత్రం డాకు మహారాజ్ . ఎన్‌బీకే 109 గా బాబీ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం.కాగా ఈ సినిమా చివరి రోజు షూటింగ్‌లో భావోద్వేగపూరిత సన్నివేశం చోటుచేసుకుంది. డాకు మహారాజ్‌లో చైల్డ్ ఆర్టిస్టుగా నటించిన వేద అగర్వాల్ తన నానాజీ (బాలకృష్ణ)కు వీడ్కోలు పలికే సమయం రావడంతో ఎమోషనల్ అయింది. కన్నీళ్లు పెట్టుకుంటున్న వేదను దగ్గరకు తీసుకొని ఓదార్చాడు బాలకృష్ణ. సెట్స్‌లో నటీనటుల మధ్య ఎలాంటి అనుబంధం ఉంటుందో కండ్లకు కట్టినట్టు చూపించే ఈ సీన్‌ను చూసి అక్కడున్నవాళ్లంతా భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.ఈ చిత్రంలో ఊర్వశి రౌటేలా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నారు. శ్రద్దా శ్రీనాథ్, ప్రగ్యాజైశ్వాల్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ , సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.





## తెలుగమ్మాయి పెట్టుకున్న గొప్ప రూల్ ఇది!

తెలుగు అమ్మాయి ఐశ్వర్యా రాజేష్ తెలుగు సినిమాలు చేసింది చాలా తక్కువ. ఇప్పటి వరకూ కెరీర్ మొత్తంలో చేసిన తెలుగు సినిమాలు ఎన్ని అంటే ఓ నాలుగైదు కనిపిస్తాయి. అంతకు మించి టాలీవుడ్ లో ఆమె సాధించింది ఏం లేదు. కానీ కోలీవుడ్ లో మాత్రం అమ్మడు చాలా సినిమాలు చేసింది. అంజలి అలియాస్ సీతమ్మ లా అక్కడ బాగా ఫేమస్ అయింది. మలయాళం, కన్నడలో కూడా కొన్ని సినిమాలు చేసింది. అయితే విక్టరీ వెంకటేష్ తో కలిసి నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బాగా ఫేమస్ అవుతుంది. ఆ సినిమా రిలీజ్ కి ముందు దర్శకుడు అనీల్ రావిపూడి ప్రచారంలో భాగంగా ఐశ్వర్యా రాజేష్ సహా మిగతా టీమ్ తో చేయిస్తోన్న స్కిట్లు..ఇతర ఫన్నీ వీడియో బాగా వైరల్ అవుతోన్న సంగతి తెలిసిందే. దీంతో ఐశ్వర్య రాజేష్ మన తెలుగమ్మాయి అనే ప్రత్యేక అభిమానం చూపించే వారి సంఖ్య పెరుగుతుంది. తాజాగా ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఐశ్వర్యా రాజేష్ పాత్రల ఎంపిక విషయంలో ఎలా వ్యవహరిహిస్తుందో రివీల్ చేసింది. సినిమాల్లో ప్రతీ అవకాశం గొప్పదే. మంచి అవకాశం వచ్చిందంటే దాన్ని ఈజీగా తీసుకోకూడదు. ఏదో ఒకటి చేయాల్సిందేనన్న తపన ఉండాలి. నా వరకూ ప్రతీ సినిమా కూడా తొలి అడుగుగానే భావిస్తా. నేను చేసే ప్రతీ పాత్ర సమాజానికి ఎంతో కొంత ఉపయోగ పడాలి అని భావిస్తాను.

అలాంటి పాత్రతో సమాజంలో చిన్న మార్పు వచ్చినా నాకు ఎంతో సంతోషం. సినిమా అనేది నా స్వార్ధం అయితే అదే స్వార్ధంతో ఏదైనా చిన్న మార్పు తేగలను అన్న ఆశ నాలో ఉప్పుడూ ఉంటుంది. నాకు రీమేక్ సినిమాలు చేయడం ఇష్టం ఉండదు. కానీ ది గ్రేట్ ఇండియా కిచెన్ లో చేసానంటే అందుకు కారణం ఉంది. అది సమాజానికి అవసరమైన సినిమాగా భావించే నటించాను. అలాంటి పాత్రలొస్తే మాత్రం వదులకోనుఅని తెలిపింది. ఐశ్వర్య తండ్రి రాజేశ్ ఒకప్పుడు హీరోగా,విలన్‌గా చేశాడు. మేనత్త శ్రీలక్ష్మి,అలాగే తాత అమర్‌నాథ్ పాత సినిమాల్లో హీరో.

## యంగ్ టైగర్ సినిమాలో మాలీవుడ్ హీరోలా!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ ప్రాజెక్ట్ లాక్ అయిన సంగతి తెలిసిందే. ఇది భారీ యాక్షన్ థ్రిల్లర్. రేంజ్ యాక్షన్ సినిమా. కానీ బ్యాక్ డ్రాప్ మాత్రం కొత్తగా తీసుకుంటారు. ఫిబ్రవరి నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు. దీనిలో భాగంగా నటీనటుల ఎంపిక పనుల్లో టీమ్ బిజీగా ఉంది. ప్రశాంత్ నీల్ సినిమాల్లో విలన్లు ఎలా ఉంటారో? అన్నది చెప్పాల్సిన పనిలేదు. ఆయనలో విలనిజం అన్నది ఎంత కర్కశంగా ఉంటుందో? అర్దమవుతుంది. రెండు సినిమాల్లోనూ హీరోలకు ధీటైన విలన్లు ఎంపిక చేసి పెట్టి కథను నడిపించాడు. సినిమా సగం సక్సెస్ క్యాస్టింగ్ ఎంపికలోనే అయిపోయింది. మరి యంగ్ టైగర్ కోసం ఎలాంటి విలన్లను దించుతున్నాడు? అంటే ఇప్పుడు ఏకంగా హీరోల్లే విలన్ చేస్తున్నారు.బిజు మీనన్ మాలీవుడ్ లో పేరున్న హీరో. ఇతడు టాలీవుడ్ విలన్‌గా సుపరిచితం. రెండు భాషల్లోనూ చాలా సినిమాలు చేసారు. తాజాగా బిజు మీనన్ ఓ విలన్ గా ఎంపిక చేస్తున్నారట. ఇందులో ఆ పాత్ర ఎంతో పవర్ ఫుల్ గా ఉంటుందిట. ఇక మరో విలన్ పాత్రకు మాలీవుడ్ స్టార్ హీరో టివినో థామస్‌ని తీసుకుంటున్నారట. ఈ పాత్ర ఇంకా శక్తి వంతంగా ఉంటుందట.




అంటే తోవినో థామస్ ...బిజుమీనన్ కుమారుడి పాత్రలో కనిపించనున్నాడట. బిజు మీనన్ తర్వాత వ్యాపార సామ్రాజ్యాన్ని నడిపించే బాధ్యతలు టివినో థామస్ తీసుకుంటాడని సమాచారం. ఇంకా కొందరు కోలీవుడ్, టాలీవుడ్ నటులు కూడా ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారట. అలాగే ఈ కథని ఒక భాగంగా తీస్తున్నారా? రెండు భాగాలుగానా? అన్నది ప్రాజెక్ట్ సెట్స్ కి వెళ్లిన తర్వాత డిసైడ్ అవుతుంది అన్నది లీకైంది. మొత్తానికి తారక్ సినిమా కూడా భారీ యాక్షన్ థ్రిల్లర్ అని మరోసారి క్లారిటీ వస్తోంది.

## సంక్రాంతి సినిమాల సెన్సార్ టాక్: ఏ సినిమా ఎలా ఉండబోతోంది?




సంక్రాంతి సీజన్ అనేది టాలీవుడ్ కు జాక్ పాట్ లాంటిది. మినిమమ్ టాక్ వచ్చినా కూడా బాక్సాఫీస్ వద్ద సాలీడ్ కలెక్షన్స్ అందుకోవడం పక్కా. ఇక ఈసారి విడుదలవుతున్న గేమ్ చేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. మూడు చిత్రాల సెన్సార్ రిపోర్టులు రివీల్ అవ్వడంతో సినీ అభిమానులలో ఆసక్తి మరింత పెరిగింది. రన్ టైమ్ 165 నిమిషాలు 2 గంటల 45 నిమిషాల నిడివి గల గేమ్ చేంజర్ చిత్రం సెన్సార్ కమిటీ నుండి ప్రశంసలు అందుకుంది. రామ్ చరణ్ ద్విపాత్రాభినయం, శంకర్ మార్క్ యాక్షన్ సీక్వెన్సులు ఈ సినిమాకు బలం అవుతాయని తెలుస్తోంది. ముఖ్యంగా రెండు ప్రధానమైన ట్విస్టులు అలాగే అప్పన్న ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ చాలా హైలైట్‌గా నిలుస్తుందట. అంజలి ఎమోషనల్ ఎపిసోడ్ కూడా హైలెట్ అవుతుందని తెలుస్తోంది. ట్రైలర్‌లో కనిపించని కొన్ని కీలక సన్నివేశాలు ప్రేక్షకులకు సర్‌ప్రైజ్‌గా ఉంటాయని సమాచారం. ఇంటర్వెల్ బ్లాక్ సినిమా రేంజ్‌ను మరో స్థాయికి తీసుకువెళుతుందట. దీంతో ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో భారీ వసూళ్లు సాధించే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. డాకు మహారాజ్: రన్ టైమ్ 150 నిమిషాలు 2 గంటల 30 నిమిషాల నిడివి గల డాకు మహారాజ్ సెన్సార్ రిపోర్ట్ కూడా పాజిటివ్‌గా ఉంది. నందమూరి బాలకృష్ణ, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం మాస్ ఆడియన్స్‌ను మెప్పించడానికి సిద్ధమైందని తెలుస్తోంది. ముఖ్యంగా డాకూ ఎపిసోడ్ బాగా డిజైన్ చేయబడిందని, బాలయ్య పాత్రలోని వైవిధ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని సమాచారం. ఈ సినిమాలో కీలకంగా మారనున్న చిన్నారి పాత్ర ట్విస్ట్ గురించి ట్రేడ్ సర్కిల్స్‌లో చర్చ నడుస్తోంది. పబ్లిక్ రిస్పాన్స్ ఎలా ఉంటుందనేది ఈ సినిమాకు కీలకం కానుంది. సంక్రాంతికి వస్తున్నాం: రన్ టటైమ్ 160 నిమిషాలు 2 గంటల 40 నిమిషాల నిడివి గల సంక్రాంతికి వస్తున్నాం సినిమా మాత్రం పూర్తిగా ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా రూపొందింది. వెంకటేష్ నటన, అనిల్ రావిపూడి దర్శకత్వ శైలి క్లిక్కయితే, ఈ సినిమా పెద్ద విజయాన్ని అందుకోవచ్చని టాక్. ఫస్ట్ హాఫ్ పాత్రల స్వభావాలతో ఫన్ క్రియేట్ చేస్తాయట. ఇక సెకండ్ హాఫ్ వెంకీ తో పాటు హీరోయిన్స్ పాత్రలతో సాగే క్రైమ్ డ్రామా కామెడీ మరింత హైలెట్ గా ఉండనున్నట్లు తెలుస్తోంది. క్లైమాక్స్ సన్నివేశాలు వెంకీ మాస్ మానరిజాన్ని అభిమానులకు విజిల్స్ వేస్తూ ఎంజాయ్ చేస్తారని తెలుస్తోంది. మూడు సినిమాలూ వేర్వేరు జోనర్లలో ఉన్నప్పటికీ, పొంగల్ బరిలో ప్రేక్షకుల రుచులకు తగినవిగా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. గేమ్ చేంజర్ ప్యాన్ ఇండియా స్థాయిలో బిజినెస్ చేస్తుండగా, డాకు మహారాజ్ తెలుగు రాష్ట్రాల్లో భారీ ఓపెనింగ్స్ కోసం ఎదురుచూస్తోంది. మరోవైపు, సంక్రాంతికి వస్తున్నాం ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరి ఈ సంక్రాంతి సీజన్ బాక్సాఫీస్ రిపోర్ట్ ఎలా ఉంటుందో చూడాలి

## బ్యాక్ టు యాక్షన్ మూడ్.. కార్ రేసింగ్ టీంతో అజిత్‌కుమార్.. !




దుబాయ్ కార్ రేసింగ్‌లో కోలీవుడ్ స్టార్ యాక్టర్ అజిత్‌కుమార్ భారీ ప్రమాదం నుంచి బయటపడ్డ సంగతి తెలిసిందే. దుబాయ్‌లో రేసింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా అజిత్ కారు ట్రాక్‌ను ఢీకొట్టింది. అయితే అప్రమత్తమైన అజిత్‌కుమార్ వెంటనే కారును కంట్రోల్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది.. స్వల్ప గాయాలతో కారులో నుంచి బయటపడ్డాడు అజిత్ కుమార్.అయితే అజిత్ కుమార్ అభిమానుల్లో జోష్ నింపే వార్త ఒకటి ఫొటోల రూపంలో బయటకు వచ్చింది. అజిత్‌కుమార్ రేసింగ్ టీంతో కలిసి ఫొటోలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. అజిత్‌కుమార్ రేసింగ్ గురించి అతని మేనేజర్ సురేశ్ చంద్ర మాట్లాడుతూ..ఈ శనివారం జరగనున్న ఎండ్యూరెన్స్ రేసులో పాల్గొనే నలుగురు డ్రైవర్లలో మిస్టర్ అజిత్ ఒకరు. ఆయన వరుసగా నాలుగు గంటలు డ్రైవింగ్ ప్రాక్టీస్ చేశారు. చివరగా దాదాపు 3-3.5 గంటలు డ్రైవింగ్ చేశాడు. అయితే కొంచెం దృశ్యమానత (విజిబులిటి)లో నెలకొన్న సమస్య కారణంగా జరిగిన ప్రమాదంలో కారు దెబ్బతిన్నది.అయితే ఆయనకు ఏం కాలేదు. అంబులెన్స్ స్పాట్‌కు చేరుకుంది. అజిత్ కారులో నుంచి బయటకు వచ్చి.. దగ్గరలో ఉన్న గ్రిడ్‌కు వెళ్లారు. వైద్యులు ఆయన ఆరోగ్యాన్ని పరిశీలించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆయన నెక్ట్స్ ప్రాక్టీస్ సెషన్‌లో భాగంగా నేటి నుంచి యాక్షన్‌లోకి దిగుతారని చెప్పాడు. ఈ నేపథ్యంలో తాజా ఫొటోలు చూసిన అభిమానులు అజిత్‌కుమార్ యాక్షన్ మూడ్‌లోకి వచ్చేశాడంటూ సంబురాలు చేసుకుంటున్నారు.

## అకిబ్ జావేద్‌ను చూసి గంభీర్ నేర్చుకోవాలట..? హెడ్‌కోచ్‌కు పాక్ మాజీ కెప్టెన్ బాసిత్ అలీ అడ్వైజ్..!



**న్యూదిల్లీ- నవభూమి:** బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో ఆస్ట్రేలియా చేతిలో 3-1 తేడాతో టీమిండియా ఓటమిపాలైంది. దాంతో ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ రేసు నుంచి వైదొలిగించింది. ఆస్ట్రేలియా వరుసగా రెండోసారి ఫైనల్‌కు చేరింది. జూన్‌లో ఇంగ్లాండ్ లార్డ్స్‌లో జరిగే దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా తలపడనున్నది. భారత జట్టు ఇప్పటి వరకు రెండుసార్లు ఫైనల్‌కు చేరింది. తొలిసారిగా టెస్టుల్లో ప్రదర్శన ఆకట్టుకోలేకపోవడంపై ఫైనల్ నుంచి నిష్క్రమించింది. ఈ క్రమంలో దాయాది పాకిస్థాన్ ఇప్పటి వరకు మూడు సైకిల్స్‌లో పాక్ తొలి మూడుస్థానాలు సైతం చేరుకోలేకపోయింది. ఆ దేశ మాజీలు టీమిండియాకు సలహాలు ఇస్తున్నారు. పాక్ ప్రస్తుత కోచ్ అకిబ్ జావేద్‌ను చూసి నేర్చుకోవాలని హెడ్‌కోచ్ గంభీర్‌కు మాజీ కెప్టెన్ బాసిత్ అలీ సూచించాడు. భారత క్రికెట్ జట్టులో సూపర్ స్టార్ సంస్కృతిని తొలగించాలని.. పాక్ జట్టులో జావేద్ అదే చేశాడని చెప్పుకొచ్చారు. గంభీర్ కోచింగ్‌లో టీం ఇండియా ప్రదర్శన అంత బాగాలేదని అలీ పేర్కొన్నారు. న్యూజిలాండ్‌తో స్వదేశంలో టెస్ట్ సిరీస్, అలాగే ఆస్ట్రేలియాలోనూ ఓటమిపాలైంది. అదే సమయంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో మధ్యలోనే బాబర్ ఆజం, షాహీన్ అఫ్రిది, నసీమ్ షాలను జావేద్ తొలగించాడని.. దాంతోనే ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను గెలిచిందని తెలిపాడు. గౌతమ్ గంభీర్ సైతం సరిగా రాణించని ఆటగాళ్లను తొల గించాలని.. స్థిరంగా ఆడేవారిని తీసుకోవాలని సూచించారు.సూపర్ స్టార్ సంస్కృతిని ముగించి.. వారికి ప్రత్యామ్నాయం లేదని భావించే స్థానంలో కొత్తవారిని తీసుకువచ్చి.. అందరూ సమానమేనని జావేద్ చేసి చూపించాడని మాజీ పాక్ కెప్టెన్ పేర్కొన్నాడు. పాక్ మాజీ కెప్టెన్ టీమిండియాకు సల హాలు ఇవ్వడంపై పలువురు మాజీలు విమర్శిస్తున్నారు.

## శ్రీలంక పర్యటనకు ఆస్ట్రేలియా జట్టు.. కెప్టెన్‌గా స్టీవ్ స్మిత్



**శ్రీలంక-నవభూమి:** శ్రీలంక పర్యటన కోసం ఆస్ట్రేలియా గురువారం జట్టును ప్రకటించింది. శ్రీలంక పర్యటనలో ఆస్ట్రేలియా రెండు టెస్టులు ఆడనున్నది. ఈ రెండు మ్యాచులు గాలే స్టేడియంలోనే జరుగనున్నాయి. లంకలోని పిచ్‌లను దృష్టిలోపెట్టుకొని క్రికెట్ ఆస్ట్రేలియా ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లకు అవకాశం కల్పించింది. ఆసిస్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్‌కు లంక సిరీస్‌కు విశ్రాంతినివ్వగా.. స్టీవ్ స్మిత్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. దాదాపు 22 నెలల తర్వాత టెస్టుల్లో మళ్లీ కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు. చివరిసారిగా 2023 మార్చిలో ఆస్ట్రేలియా జట్టుకు కెప్టెన్‌గా పని చేశాడు. భారత్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో మూడో టెస్ట్ తర్వాత ఉద్వాసనకు గురైన నాథన్ మెక్‌స్వీనికి మళ్లీ చోటు కల్పించింది. ఆస్ట్రేలియా ఇప్పటికే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకుంది. జూన్ 11 నుంచి లార్డ్స్‌లో దక్షిణాఫ్రికాతో జరిగే ఫైనల్‌లో ఆస్ట్రేలియా తలపడనున్నది.

యువ ఆటగాళ్లకు ఛాన్స్..

ప్రస్తుత కెప్టెన్ కమ్మిన్స్ కొడుకు పుట్టడంతో స్మిత్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఆస్ట్రేలియా యువ ఆటగాడికి శ్రీలంక పర్యటనకు ఎంపిక చేసింది. 21 ఏళ్ల కూపర్ కొన్నోలీని ఎంపిక చేసింది.

## నిజం ఎప్పటికైనా గెలుస్తుంది.. విడాకుల రూమర్స్‌పై స్పందించిన ధనశ్రీ వర్మ



**న్యూదిల్లీ-నవభూమి:** భారత స్టార్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ ధనశ్రీ వర్మ జంట విడాకులు తీసుకోబోతోందంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయని, విడిపోయేందుకు నిర్ణయించుకున్నారంటూ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో విడాకుల రూమర్స్‌పై చాహల్ భార్య ధనశ్రీ మౌనం వీడారు. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా ఓ పోస్టు పెట్టారు. కొన్ని రోజులుగా మీడియాలో వస్తోన్న వార్తలతో తాను మానసిక వేదనకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. 'గత కొన్ని రోజులుగా మీడియాలో వస్తోన్న వార్తలను చూస్తుంటే నాకు, నా కుటుంబానికి చాలా కష్టంగా ఉంది. నిజాలు తెలుసుకోకుండా నిరాధారమైన రాతలు రాస్తున్నారు. నాపై ద్వేషం కలిగేలా ట్రోల్స్ చేస్తూ నా ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు. ఈ విషయం నన్ను తీవ్రంగా బాధిస్తోంది. జీవితంలో ఎదగడానికి, మంచి పేరు తెచ్చుకోవడానికి నేను ఎన్నో సంవత్సరాలు కష్టపడ్డాను. నా మౌనం బలహీనతకు సంకేతం కాదు. విలువలకు కట్టుబడి వాస్తవం పై దృష్టి పెట్టి ముందుకు వెళ్తున్నాను. నిజం ఎప్పటికైనా విజయం సాధిస్తుంది' అని ధనశ్రీ వర్మ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**